ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 08.04.2026 | సంపుటి :12 సంచిక : 259 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






# ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం

**దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరు**
**ప్రపంచచరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది**
**ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక**

### నిజానికి ఆ దేశాన్ని తుడిచిపెట్టడం తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని వెల్లడి

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.

మిగతా 2లో..



## గడువుకు ముందే బాంబుల వర్షం

- ఖర్గ్ ద్వీపంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు
- చూస్తూ ఊరుకోమని ఇరాన్ హెచ్చరిక

9లో..

## తాటాకు చప్పళ్లకు భయపడం

- దేశ పౌరులు మానవహారాలుగా ఏర్పడి నిరసన తెలపండి
- యువతకు ఇరాన్ పిలుపు
- ఇకపై ఎటువంటి చర్చల్లేవు..
- అమెరికాతో జరుగుతున్న సంప్రదింపులకు ద్వారాలు మూసివేత
- నిర్ణయాన్ని ప్రకటించిన ఇరాన్ ప్రభుత్వరంగ మీడియా సంస్థ టెహ్రాన్ టైమ్స్
- నాతో సహా నా దేశప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధమే : అధ్యక్షుడు పెజెష్కియాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు ముగుస్తున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాతో జరుగుతున్న శాంతి చర్చలకు ద్వారాలు మూసేసింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వరంగ మీడియా సంస్థ టెహ్రాన్ టైమ్స్ వెల్లడించింది.

మిగతా 2లో..



## యూడీఎఫ్ హయాంలోనే
# కేరళ అభివృద్ధి

### గత ప్రభుత్వాల పనితీరుతోనే కేరళ విజయాలు

- బంగారం స్మగ్లింగ్ కేసు ఎందుకు అపరిష్కృతంగా మిగిలింది?
- శబరిమల ఆలయం నుంచి తరలించిన బంగారం లెక్కలు ఎందుకు చెప్పలేదు?
- విజయన్, మోడీ మంచి మిత్రులు
- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- ముఖ్యమంత్రి విజయన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యుత్తరం

**హైదరాబాద్(జనంసాక్షి):** కేరళ రాష్ట్రం ఇప్పటివరకు సాధించిన విజయాలన్నీ గతంలోని యూడీఎఫ్ ప్రభుత్వాల పనితీరు ఫలితమేననే విషయాన్నిగుర్తించాలని కేరళం ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కు రాసిన లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్డీఎఫ్ వరుసగా రెండు సార్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వాల హయాంలో ఏం జరిగిందో కేరళం ప్రజలకు తెలియజేయాలని సీఎం డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని కేరళం ముఖ్యమంత్రి విజయన్ రాసిన లేఖకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యుత్తరం రాశారు. కేరళం ప్రభుత్వ పనితీరుపై తాను గౌరవంగా, హుందాగా స్పందించాలని అనుకున్నానని, కానీ, మీ ప్రతిస్పందనలో మాత్రం మీరు అభ్యంతరకరమైన భాషను ఉపయోగించారని విజయన్‌ను

మిగతా 2లో..



### రేవంత్‌రెడ్డి పాలనపై తెలంగాణ
## ప్రజలే తీర్పు ఇస్తారు

ఆయనతో చర్చకు దిగను:పినరయి విజయన్

**తిరువనంతపురం(జనంసాక్షి):**తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు

మిగతా 2లో..

## నిరుద్యోగ యువతకు ఉపాధికై అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు

**రామస్వామి గుట్ట వద్ద అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను సందర్శించిన మంత్రి ఉత్తమ్**



**హుజూర్‌నగర్(జనంసాక్షి):** జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి 46 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఈ అడ్వాన్స్ సెంటర్ ను 40 కోట్ల రూపాయలతో నిర్మించడం జరిగిందని, టాటా అడ్వాన్స్ టెక్నాలజీ వారి సహకారంతో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని. ఇందులో ప్రస్తుతం 172 మంది విద్యార్థులు

మిగతా 2లో..

## చందమామ ఆవలి నుంచి పుడమి పులకరింపు

ఆర్టెమిస్-2 మిషన్‌లో భాగంగా చంద్రుని చుట్టూ ప్రదక్షిణ చేసిన వ్యోమగాములు.. తిరిగి భూమి వైపు తమ ప్రయాణం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే చంద్రుని అవతలి వైపు నుంచి వ్యోమగాములు తీసిన భూమి ఫొటోను నాసా విడుదల చేసింది. తిరుగు ప్రయాణంలో ఈ మిషన్ కమాండర్ రీడ్ వైస్‌మాన్ ఈ ఫొటో తీసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ సైతం సోషల్ మీడియాలో షేర్ చేసింది. "జాబిల్లి అవతలి వైపు నుంచి తీసిన మొదటి భూమి ఫొటో ఇది" అని పేర్కొంది.ఆర్టెమిస్-2 యాత్రలో ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడావాసి భాగస్వాములయ్యారు. వీళ్లంతా చందమామపై కాలు మోపకుండా.. సుదూరం నుంచే జాబిల్లిని చుట్టి వస్తున్నారు. జాబిల్లి యాత్రకు నిర్దేశించిన రాకెట్, వ్యోమనౌకలోని కీలక వ్యవస్థల పనితీరును పరిశీలించడమే ఈ మిషన్ ఉద్దేశం.


చంద్రుడి అవతలివైపు నుంచి ఆర్టెమిస్ట్-2 వ్యోగాములు తీసిన భూమి ఫోటో..



## కర్రెగుట్టల్లో అభివృద్ధి పనులకు డీజీపీ శంకుస్థాపన

- మావోయిస్టుల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతాం
- తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని వెల్లడి

**వెంకటాపురం (ములుగు)(జనంసాక్షి):** ప్రకృతి సౌందర్యానికి నిలయమైన ములుగు జిల్లాలోని కర్రెగుట్టల ప్రాంతం మావోయిస్టుల రహిత ప్రాంతంగా అవతరించిందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం జిల్లాలో పర్యటించిన ఆయన, పామునూరు వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి గిరిజన ప్రాంతాల ప్రగతికి బాటలు వేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడు తూ... కర్రెగుట్టలపై మావోయిస్టుల ప్రభావం శూన్యమని, ప్రభుత్వం పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా గుత్తికోయ ప్రజలకు అండగా ఉంటూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తాయని భరోసా ఇచ్చారు. అందులో భాగంగానే పామునూరుకు చెందిన ఏడు కుటుంబాల ఉమ్మడి ఉపాధి కోసం ఒక ఆటోను, ఒక ద్విచక్ర వాహనాన్ని అందజేయడంతో పాటు వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అటవీ సంపద, ప్రకృతి అందాలతో అలరారుతున్న కర్రెగుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఇక్కడికి వచ్చే పర్యాటకులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే లక్ష్యంతో పోలీస్

మిగతా 2లో..

## భారత్ ధర్మసత్రం కాదు

- బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా భాజపా వల్లే సాధ్యం
- అస్సాం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా



2లో

## వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

- ఇక నుంచి 5 కేజీల రెండు సిలిండర్ల సరఫరా
- రాష్ట్రాలకు సూచించిన కేంద్ర ప్రభుత్వం





## సంప్రదాయాల ఆధారంగానే మహిళలపై నిషేధం

- ఇందులో వివక్ష ఏమీ లేదు
- శబరిమల తీర్పుపై సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. "ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదా యాలకు అనుగుణంగానే ఈ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదు. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు (స్త్రీ, పురుషులు ఇద్దరూ) స్వామిని పూజిస్తున్నారు" అని కేంద్రం

మిగతా 2లో..

## రెండేళ్లలో 10వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం



- మరో రెండ్రోజుల్లో ఇంకో 2322 పోస్టుల భర్తీ చేస్తాం
- ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లకు నియామక పత్రాలు అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్(జనంసాక్షి):**ఆరోగ్యశాఖలో గడిచిన రెండేళ్లలోనే 10,327 ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో రెండ్రోజుల్లో ఇంకో 2322 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి అవుతుందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఈ మేరకు ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లతో, పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని.. వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తామని మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం.. ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లకు నియామక పత్రాలు అందజేశారు.కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లందరికీ హృదయపూర్వక అభినందనలు.ఇది మీ జీవితంలో మర్చిపోలేని ఒక అద్భుతమైన రోజు.. ఓ వైపు వరల్డ్ హెల్త్ డే.. మరోవైపు ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం చాలా

మిగతా 2లో..

## ఎన్నికలెప్పుడొచ్చినా మేమే గెలుస్తాం

**మమ్మల్ని అరెస్టు చేయాల్సిన అవసరం ఏంటి?: హరీశ్**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఇండస్ట్రియల్ పార్క్ బాధిత రైతులను కలిసేందుకు పరిగి వెళ్తూ అరెస్టయిన మాజీ మంత్రి హరీశ్‌రావు విడుదలయ్యారు. ఆయనతోపాటు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలను శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు.. కొద్దిసేపటి తర్వాత విడుదల చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. మళ్లీ గెలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని విమర్శించారు."కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వచ్చేది సింగిల్ డిజిట్ మాత్రమే. రేవంత్‌రెడ్డి పాలనలో

మిగతా 2లో..

### ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూ దందా

- రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం
- బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం
- హరీశ్ తదితరుల అరెస్ట్‌పై కేటీఆర్ ఆగ్రహం

2లో..



బెంగాల్‌పై కన్నేస్తే..
## పాకిస్తాన్‌ను ముక్కలు చేస్తాం

పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ సింగ్‌కౌంటర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్

మిగతా 2లో..

## కర్రెగుట్టల్లో అభివృద్ధి పనులకు
# డీజీపీ శంకుస్థాపన

ఔట్‌పోస్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. పాలనలో పారదర్శకత, వేగవంతమైన అభివృద్ధి కోసం అటవీ, రెవెన్యూ, సీఆర్పీఎఫ్ పోలీస్ శాఖల మధ్య మెరుగైన సమన్వయాన్ని పెంచేందుకు ఒక ప్రత్యేక సమన్వయ కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు.అనంతరం వెంకటాపురం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా "అరైవ్ అలైవ్" అనే అవగాహన కార్యక్రమానికి డిజిపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 3000 మంది పాల్గొన్న ఈ సభలో డిజిపి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, ప్రాణాల కంటే ఏదీ మిన్న కాదని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 200 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేయడంతో పాటు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, వాహనదారుల ఆరోగ్య భద్రతపై ఆరా తీశారు.డిజిపి బి.శివధర్ రెడ్డి పామునూరులోని సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఓబీ)ని సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న జవాన్లతో ఆయన ముఖాముఖి మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో జవాన్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా కర్రెగుట్టలు వంటి కొండ ప్రాంతాల్లో వ్యూహాత్మక పట్టు సాధించడానికి, మావోయిస్టు రహిత ప్రాంతంగా కొనసాగించడానికి రాష్ట్ర పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాల మధ్య నిరంతర సమన్వయం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక భద్రతను పటిష్టం చేయడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.మొరమురులో మహిళా నర్సరీ ప్రారంభంఅటవీ పెంపకంలో మహిళల భాగస్వామ్యం భేష్అనంతరం మొరమురు గ్రామంలో మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నర్సరీని డీజీపీ శివధర్ రెడ్డి, రాష్ట్ర పిసిసిఎఫ్ సువర్ణతో కలిసి ప్రారంభించారు. అటవీ విస్తరణలో మహిళలను భాగస్వాములను చేయడం ద్వారా వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. నర్సరీ కార్యకలాపాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ సమన్వయంలో జరిగిన ఈ పర్యటనలో పీసీసీఎఫ్ సువర్ణ, గ్రేహౌండ్స్ అడిషనల్ డిజిపి అనిల్ కుమార్, ఎస్ఐబి ఐ జి పి సుమతి, సిఆర్పీఎఫ్ ఐజీ విక్రమ్, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలెప్పుడొచ్చినా
## మేమే గెలుస్తాం

ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. ప్రతిపక్షాలు కనీసం ప్రశ్నించవద్దని, ధర్నాలకు పోవద్దని అంటున్నారు. ప్రశ్నిస్తే కేసులు, విచారణలు, విజిలెన్స్ కేసులు అంటున్నారు. మమ్మల్ని అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని హరీశ్‌రావు మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి వెళ్తుండగా నార్సింగి పోలీస్ అకాడమీ కూడలి వద్ద బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారు**

పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తన్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావుతో కలిసి ఆయన పరిగికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు.పరిగికి చేరుకోకుండా హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. రైతులకు భరోసాగా వెళ్తున్న హరీశ్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. .

## ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో
## భూ దందా

హైదరాబాద్(జనంసాక్షి): ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# యూడీఎఫ్ హయాంలోనే కేరళ అభివృద్ధి



ఉద్దేశించి సీఎం పేర్కొన్నారు. ప్రత్యర్థుల తొందం పాటు వ్యాఖ్యలపై తానెప్పుడూ ఆవేశపూరితంగా స్పందించనని సీఎం తెలియజేశారు. మీరు తెలంగాణ రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి ఇవ్వాల్సిన గౌరవ, మర్యాదను ఇస్తానని విజయన్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా తెలియజేశారు.

**పదే పదే తప్పుడు ఉదాహరణ...**

నీతి ఆయోగ్ ఎస్డీజీ సూచిక 2023-24ను పదే పదే తెలంగాణ రాష్ట్రానికి తప్పుడు విధంగా విజయన్ ఉదాహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ సమయంలో తెలంగాణలో అధికారంలో ఉన్నది ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కాదని, అది పదేళ్ల బీఆర్ఎస్-బీజేపీ పదేళ్ల దుష్పరిపాలన చివరి దశ అని విజయన్‌కు సీఎం తెలియజేశారు. తెలంగాణలో తమ ప్రజా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకున్నందున ఈ కాలంలో తమ పనితీరు ఆధారంగా తమని అంచనా వేయాలని కేరళం ముఖ్యమంత్రి విజయన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా నమోదైందని, ఇది 10.7% వృద్ధి రేటుతో జాతీయ సగటు 9.9% కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరుకుందని, ఈ గణాంకాల ఆధారంగా తెలంగాణ భారతదేశంలోనే ముందు స్థానంలో నిలిచిందని సీఎం స్పష్టం చేశారు. ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్ 2024-25 గణాంకాల ప్రకారం కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళం రాష్ట్రాలను తెలంగాణ అధిగమించిదన్నారు...

పేదరికాన్ని నిర్మూలించారా?

2025, చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని (ఎక్స్‌ట్రీమ్ పావర్టీ) పూర్తిగా నిర్మూలించిన మొదటి రాష్ట్రంగా కేరళం నిలవనుందని మీరు ట్వీట్ చేశారని కేరళం ముఖ్యమంత్రి విజయన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇది 2026, ఏప్రిల్ నెల, కానీ మీరు రాసిన లేఖలో 64,006 కుటుంబాలు ఇప్పటికీ పథకాలను పొందుతున్నాయని పేర్కొన్నందున మీరు పేదరికాన్ని నిర్మూలించారా అని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. 2025, నవంబర్ 1వ తేదీ నాటి మీ ప్రకటన ఎందుకు ఆచరణలోకి రాలేదని విజయన్ ను సీఎం ప్రశ్నించారు.

ఆ కేసుల సంగతేంటి?

నీతి ఆయోగ్ కరప్షన్ ర్యాంకింగ్‌లను తాను గౌరవిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో విజయన్ చెప్పినట్లు కేరళం ప్రభుత్వం స్వచ్ఛమైనదైతే బంగారు స్మగ్లింగ్ వ్యవహారంలో మీ కార్యాలయంలోని ఉన్నతాధికారులు, కీలకమైన వ్యక్తులకి సంబంధాలున్నాయని డాక్యుమెంట్లతో సహా నిరూపించబడిన ఆ కేసు ఎందుకు అపరిష్కృతంగా మిగిలిపోయిందని విజయన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి 4.5 కిలోల బంగారం అక్రమ తరలింపు ఆరోపణలకు ఎందుకు జవాబు చెప్పడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**తెలంగాణ రైజింగ్ దార్శనికతతో ముందుకు...**

తమ ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతతో ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక కారిడార్ వంటివి నిర్మించి ఒక దశాబ్దంలోనే రూ.1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళుతున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అలాగే కేరళంలో రాబోయే కొద్ది రోజుల్లో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం 'నవ కేరళం' దార్శనికతను అమలు చేస్తుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం ప్రజలు త్వరలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకుంటారని, జరగాల్సినది కూడా అదేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనపై తెలంగాణ
# ప్రజలే తీర్పు ఇస్తారు

తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు.నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు.

మీ హయాంలో ఏం చేశారో చూపించండి: రేవంత్‌రెడ్డి

తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. " మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉంది.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## రెండేళ్లలో 10వేలకుపైగా
# ఉద్యోగాలు
# భర్తీ చేశాం

అరుదుగా జరిగే విషయం. ఈ రోజు మనం 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) డాక్టర్లకు, 174 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేస్తున్నాం.అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ వంటి కీలక విభాగాల్లో ఈ నియామకాలు జరగడం ఎంతో ప్రాధాన్యత కలిగిన విషయం. మీ అందరి రాకతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతాం.రాష్ట్రంలో ఎక్కడా డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా చేసి, ప్రజలకు సమయానికి, నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రాధాన్యం.డిసెంబర్ 2023లో సీఎం రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ప్రభుత్వ హాస్పిటళ్లలో వేల సంఖ్యలో ఖాళీలు, డాక్టర్లు, సిబ్బంది కొరత ఉంది.ఈ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో వెంట, వెంటనే ఉద్యోగాల నియామకాలు చేపట్టాం.డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, తదితర పోస్టులన్నీ భర్తీ చేస్తూ వస్తున్నాం.ఈ రెండేళ్లలో ఏకంగా 10,327 పోస్టులను భర్తీ చేశాం. మరో రెండు రోజుల్లో 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల నియామకాన్ని పూర్తి చేయబోతున్నాం.ఇంకా 6,512 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో 1,000 స్పెషలిస్ట్ డాక్టర్లు, 475 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మాసిస్టులు, ఇతర సిబ్బంది ఉన్నారు.ఈ నియామకాలన్నీ సమయానికి పూర్తి చేసి ప్రతి హాస్పిటల్‌ను పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తాం.రిక్రూట్‌మెంట్ మాత్రమే కాదు.. అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్విప్‌మెంట్, డ్రగ్స్, డయాగ్నస్టిక్స్ అన్నీ సమకూరుస్తున్నాం.ఈరోజు నియామక పత్రాలు అందుకుంటున్న డాక్టర్లకు నేను కొన్ని సూచనలు చేయాలనుకుంటున్నాను. సేవా భావంతో పనిచేయండి. ప్రతి రోగిని మానవత్వంతో చూడండి. నైతిక విలువలను పాటించండి. హైదరాబాద్‌లోనే ఉండాలి, పట్టణాల్లోనే పోస్టింగ్ కావాలనే ధోరణి మార్చుకోండి. కొంతకాలమైన జిల్లాల్లో పని చేయండి. మీ జ్ఞానం, మీ సేవ లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేస్తాయి.ఈ వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి మనమందరం కట్టుబడి ఉండాలి. ప్రతి ఇంటికి నాణ్యమైన వైద్యం అందేలా కలిసి పని చేద్దాం.

## సంప్రదాయాల ఆధారంగానే
## మహిళలపై నిషేధం

తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది.

## ఇరాన్ నాగరికత
## ఈ రాత్రితో అంతం

ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

## భారత్ ధర్మసత్రం కాదు

గహౌతి(జనంసాక్షి):అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం."పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని అమిత్ షా పేర్కొన్నారు. "కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసనకారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు" అని పేర్కొన్నారు.

## వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

న్యూఢిల్లీ(జనంసాక్షి):వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది.

# తాటాకు చప్పుళ్లకు భయపడం

"అమెరికాతో ఉన్న అన్ని దౌత్య, పరోక్ష సంభాషణ మార్గాలను ఇరాన్ మూసివేసింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడిని కూడా నిలిపివేసింది" అంటూ టెహ్రాన్ టైమ్స్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది.ట్రంప్ ఇచ్చిన గడువు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటలు) ముగియనుంది. అప్పట్లోగా హర్మూజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను నేలమట్టం చేస్తామని ట్రంప్ ఇది వరకే హెచ్చరించారు. తాజాగా ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా.. అమెరికా, దాని మిత్రదేశాలు కూడా తమ దెబ్బ రుచి చూస్తాయని ఇరాన్ పేర్కొంది. ఈ క్రమంలోనే ఈజిప్టు, పాకిస్థాన్, తుర్కియే మధ్యవర్తిత్వంలో ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలకు ముగింపు పలికింది. శాంతి చర్చల్లో భాగంగా 45 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన తీసుకురాగా ఇప్పటికే ఇరాన్ తిరస్కరించిన విషయం తెలిసిందే.

పవర్ ప్లాంట్ల చుట్టూ మానవహారాలు.. దాడుల **నేపథ్యంలో ఇరాన్ పిలుపు**

హర్మూజ్ జలసంధి ని తిరిగి తెరిచేందుకు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన గడువు మరికొన్ని గంటల్లో ముగియనుంది. ఇప్పటివరకు ఇరాన్ దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. గడువు ముగిసిన తర్వాత ట్రంప్ ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటారోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న పవర్ ప్లాంట్ల వద్ద మానవహారాలుగా ఏర్పడాలని ఇరాన్ ప్రభుత్వం ఆ దేశ యువతకు పిలుపునిచ్చింది. గడువు ముగిసేలోపు హర్మూజ్‌ను తెరవకపోతే.. ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. అంతకుముందులా డెడ్‌లైన్‌ను పొడిగించేది లేదని తేల్చి చెప్పేశారు. దీంతో అమెరికా దాడుల నుంచి ఆ విద్యుత్ కేంద్రాలను పరిరక్షించుకునేందుకు ఇరాన్ చర్యలు చేపట్టింది. అందులోభాగంగా.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు (ఇరాన్ కాలమానం ప్రకారం) దేశంలోని విద్యుత్ కేంద్రాల వద్దకు ర్యాలీగా రావాలని క్రీడాకారులు, విద్యార్థులతో సహా యువత మొత్తానికి ఆ దేశ క్రీడలు, యువజన మంత్రిత్వశాఖ పిలుపునిచ్చింది. యువత నుంచి స్వయంగా వచ్చిన సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ శాఖ ఉప మంత్రి అలీ రెజా రహీమీ పేర్కొన్నారు. దేశంలోని విద్యుత్ కేంద్రాల చుట్టూ మానవహారాల్ని ఏర్పాటుచేయాలని పలువురు విశ్వవిద్యాలయ విద్యార్థులు, కళాకారులు, యువజన సంఘాలు ప్రతిపాదించాయన్నారు. దాని ప్రకారమే.. 'ఉజ్వల భవిష్యత్తు కోసం ఇరాన్ యువత మానవహారం' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దేశ మౌలిక సదుపాయాలను పరిరక్షించడంతో సహా ఉజ్వల భవిష్యత్తును నిర్మించడంలో యువతకు ఉన్న నిబద్ధతకు చిహ్నంగా ఈ చర్యను అభివర్ణించారు.

నాతో సహా నా దేశప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధమే: ఇరాన్ అధ్యక్షుడు

హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా విధించిన డెడ్‌లైన్ సమీపిస్తున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ప్రాణాలను త్యాగం చేయడానికి తనతో సహా ఇరాన్ పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానన్నారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని అనేక స్థావరాలు, మౌలిక సదుపాయాలను లక్ష్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సారి ఎటువంటి డెడ్‌లైన్ పొడిగింపులు ఉండబోవని తేల్చిచెప్పారు. ఇరాన్‌ను తమ బలగాలు ఒక్కరాత్రిలో తుడిచి పెట్టేయగలవని.. ఆ రాత్రి మంగళవారం రాత్రే కావొచ్చనీ హెచ్చరించారు. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలకు, తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. దీంతో యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటుందో అని పశ్చిమాసియా దేశాల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ప్రాణ త్యాగానికి కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటన చేయడం మరింత ఆందోళనకరంగా మారింది. ఇదీ చదవండి: కోమాలో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ..?

కోమాలో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ..?

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం కోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని, ఈ మేరకు అమెరికా-ఇజ్రాయెల్‌కు నిఘా సమాచారం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణల వేళ ఇరాన్ నాయకత్వంపై ఈ వార్తలు రావడం సంచలనంగా మారింది. "ఖమేనీ అపస్మారక స్థితిలో ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందువల్ల నిర్ణయాలు కూడా తీసుకోలేని స్థితిలో ఉన్నారు" అని ఆ కథనాలు పేర్కొన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన ఆయన ఆచూకీ గురించి వెలుగులోకి రావడం ఇదే తొలిసారి.ఫిబ్రవరి 28న ప్రారంభమైన దాడుల్లో అప్పటి ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా ఖమేనీ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలను కోమ్ నగరంలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## బెంగాల్‌పై
## కన్నేస్తే..పాకిస్తాన్‌ను
## ముక్కలు చేస్తాం

ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## నిరుద్యోగ యువతకు
## ఉపాధికై అడ్వాన్స్
## టెక్నాలజీ సెంటర్లు

వివిధ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నారని, ఈ టెక్నాలజీ సెంటర్ ముఖ్య ఉద్దేశం నిరుద్యోగ, చదువుకున్న యువతకు వివిధ కోర్సులలో శిక్షణ ఇచ్చి వారు స్వతహాగా జీవించడానికి, ఉద్యోగం సంపాదించుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి ప్రతి విద్యార్థికి రూ.2,000 చొప్పున స్కాలర్షిప్ ఇవ్వడం జరుగుతుందని, ఆర్ ఓ ప్లాంట్, టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయాలు 2,3 నెలలో పూర్తి చేయడం జరుగుతుందని, అలాగే రూ.14 కోట్లతో ఐటిఐ భవనం కూడా నిర్మించడం జరుగుతుందని దీనిలో బేసిక్ శిక్షణ ఇస్తారని, అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ శిక్షణ ఇస్తారని, మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి నిర్మాణంలో ఉన్న ఐటీఐ భవనాన్ని సందర్శించి, భవన నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే నరసింహ, ప్రిన్సిపల్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాధికా, రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఆటోల ఎల్పీజీకి కొరత రాకూడదు

- ఎల్పీజి సరఫరా కంపెనీలతో తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్7 (జనంసాక్షి) :** ఆటో ఎల్పీజీ తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీస్ , ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందనలు తెలిపారు. పని తీరు ఏ మాత్రం మెరుగు పరుచుకోని పలు కంపెనీల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి, బంకులన్నింటిలో సరఫరా చేయాలని కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. బంకులకు గ్యాస్ వస్తున్న లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతి రోజు పర్యవేక్షిస్తుందని కమిషనర్ స్టీఫెన్ రవీందర్ వెల్లడించారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

## బీఆర్ఎస్, బీజేపీలకు అధికారం కల్ల

- కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి
- నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రంలో పిసిసి చీఫ్



**నాగర్ కర్నూల్, ఏప్రిల్7 (జనంసాక్షి) :** బీఆర్ఎస్, బీజేపీలకు అధికారం రావడం కల్ల అని పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఈ - ఆఫీస్ వినియోగాన్ని పెంచి, పరిపాలనలో పారదర్శకత సాధించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో లిజిల్లా కలెక్టర్‌లి మాట్లాడుతూ.. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా, తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ - ఆఫీసు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ - ఆఫీస్ వినియోగాన్ని పెంచి, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని సాధించాలన్నారు. ఈ - ఆఫీసుపై శిక్షణ పొంది, వివిధ అంశాలలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసి, సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## వందేభారత్ రైలు ఆహారంలో పురుగు..

- తయారీ సంస్థకు రూ.10 లక్షల జరిమానా



**ముంబై (జనంసాక్షి) :** వందేభారత్ రైళ్లలో ప్రయాణికులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నాయి. అయినప్పటికీ అప్పుడప్పుడూ నాణ్యత, శుభ్రత లేని ఆహారం, పురుగులతో కూడిన ఆహారం అందిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల ఒక ప్రయాణికుడికి వందేభారత్ రైలులో అందించిన ఆహారంలో ఏకంగా ఒక పురుగు కనబడింది. దీంతో షాక్‌కు గురైన ప్రయాణికుడు దీన్ని వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది.

దీనిపై స్పదించిన ఐఆర్‌టీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) సంస్థ ఫుడ్ కాంట్రాక్టర్‌కు భారీ జరిమానా విధించింది. ఆదిత్య దిద్వానియా అనే ప్రయాణికుడు అహ్మదాబాద్ నుంచి ముంబైకి వందేభారత్ రైలులో ప్రయాణించాడు. ఈ సందర్భంగా అతడికి రైలులో ఆహారం అందించారు. అయితే, అతడికి అందించిన ఆహారం తింటుండగా మధ్యలో ఒక పురుగు కనపడింది. అలాగే, తనతోపాటు అదే కోచ్‌లో ఇంకొకరికి కూడా అలాగే పురుగులు వచ్చాయి. దీంతో ఆ కోచ్‌లో ఇతరులు ఎవరూ ఆహారం తీసుకోలేదని తెలిపాడు. ఇక, ఈ అంశానికి సంబంధించి వీడియో తీసి, అతడు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు. దీనికి ఐఆర్‌టీసీ స్పదించింది. ఆదిత్య దగ్గరినుంచి వివరాలు సేకరించింది. ఫుడ్ అందించిన కాంట్రాక్ట్ సంస్థకు రూ.10 లక్షల జరిమానా విధించినట్లు, కాంట్రాక్ట్ రద్దు చేసినట్లు తెలిపింది. అలాగే, కిచెన్ సీజ్ చేసినట్లు కూడా వెల్లడించింది. శుభ్రత, ప్రయాణికుల ఆరోగ్యానికి తాము ప్రాధాన్యమిస్తామని పేర్కొంది. అయితే, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ఐఆర్‌టీసీ తగిన చర్యలు తీసుకోవాలని, కిచెన్‌లను అధికారులతో నిత్యం తనిఖీ చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## బంగ్లాదేశ్ బోర్డు అధ్యక్షుడిగా భారత మద్దతుదారుడు..

- అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డు..!

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ ఆ దేశ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. అవినీతి ఆరోపణలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్న బీసీబీకి కొత్త చీఫ్‌గా తమీమ్‌ను నియమించింది ప్రభుత్వం. అమినుల్ ఇస్లాం నేతృత్వంలోని బోర్డును రద్దు చేసిన ప్రభుత్వం మంగళవారం ఈ మాజీ ఓపెనర్‌కు పగ్గాలు అప్పగించింది. ఇటీవల భారత్‌లో టీ20 ప్రపంచకప్‌ను బాయ్‌కాట్ చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకించిన తమీమ్ బీసీబీ అధ్యక్షుడు కావడంతో బీసీసీఐతో సంబంధాలు మరింత మెరుగయ్యే అవకాశముంది. నిరుడు అక్టోబర్‌లో జరిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఎన్నికల్లో అవకతవకల నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైంది. ఎన్నికల్లో అవినీతిపై నిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ తదుపరి బోర్డు అధ్యక్షుడిగా మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ పేరును ప్రతిపాదించింది.

## జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించండి

**బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లను కలిసి విన్నవించిన బీసీ కుల సంఘాల నాయకులు**



**సిద్దిపేట (జనంసాక్షి) :** సిద్దిపేట కలెక్టరేట్ లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ అధికారి సయ్యద్ రఫీ, ఇతరఅధికారులని కలిసిన సిద్దిపేటలోని బిసి కుల సంఘాల నాయకులు ఈ నెల ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్‌ను ప్రజాప్రతినిదులను సామాజిక ప్రజాసంఘాల బీసీ కుల సంఘాల నాయకులను భాగస్వామ్యం చేయాలని ఘనంగా నిర్వహించేలాగా పూర్తిస్థాయి అధికార యంత్రాంగం భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. మహనీయుల జయంతులని అధికారికంగా నిర్వహించడం అంటే కొబ్బరికాయ కొట్టి దండేసి దండం పెట్టి మొక్కుబడిగా చేయడం కాకుండా వారి యొక్క జీవితాన్ని ఆలోచనలని ఆశయాలని విస్తృతంగా ప్రచారం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సామాజిక ప్రజాస్వామిక సమాఖ్య (ఎస్‌డీఎఫ్) చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కంకటి నవీన్ గౌడు, వీరశైవ బలిజ లింగాయత్ సమాజ అధ్యక్షులు ఆకుల ప్రశాంత్, బోయ సంఘం రాష్ట్ర నాయకులు బోయ రాములు, యాదవ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మామిండ్ల ఐలయ్య యాదవ్ గారు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య కురుమ, మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల బాలయ్య, బట్రాజుసంఘం రాష్ట్ర నాయకులు రామరాజు బట్టు, నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు కొత్వాల్ నరేందర్ నాయి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నారోజు బ్రహ్మం తదితర బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాలనీ ల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త**





**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాలనీల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్‌లో పలు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. ఈ సందర్భంగా నాగోల్ డివిజన్ పరిధిలోని నర్సింహా స్వామి కాలనీ ఫేస్-1, ఫేస్-2, మల్లికార్జున కాలనీ, అనంతుల జంగారెడ్డి కాలనీలలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ కార్తిక్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రత్యక్షంగా పర్యటించారు. కాలనీల్లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను సమీక్షిస్తూ, ముఖ్యంగా రోడ్ల అభివృద్ధి, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు మరియు పార్కుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, కాలనీల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగోల్ డివిజన్ నాయకులు చిరంజీవి గౌడ్ భవాని గౌడ్ ఆయా కాలనీల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి లు కార్యవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 07 (జనం సాక్షి):** ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ శ్రీమతి స్నేహ శబరీష్ సూచించారు. టీ ప్రైడ్, తెలంగాణ ఐపాస్ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పరిశ్రమల పెట్టుబడుల ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐపాస్ చట్టం, టీ ప్రైడ్ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ ఐ - పాస్ చట్టం కింద వివిధ శాఖల నుండి అనుమతులు పొందేందుకు 30 యూనిట్లకు గాను 36.9 కోట్ల పెట్టుబడితో దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. అందులో 64 అనుమతులు ఇప్పటికే మంజూరు చేసినట్లు చెప్పారు. టీ ప్రైడ్ పథకం ద్వారా 2025 నవంబర్ 1 నుండి 2026 ఏప్రిల్ 7 వరకు కాలంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వాహనాల మంజూరు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో ఎస్టీ వర్గానికి 42 యూనిట్లకు రూ.1,34,18,564 సబ్సిడీ, ఎస్సీ వర్గానికి 1 యూనిట్‌కు రూ.1,36,500 సబ్సిడీ మంజూరు చేసినట్లు చెప్పారు.అలాగే మొత్తం 43 పరిశ్రమలకు పెట్టుబడి రాయితీలకు కమిటీ అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ అన్ని వర్గాల యువత కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, అట్టి అవకాశాలను యువతీ యువకులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమే సూచించారు, అందుకోసం సంబంధిత విభాగాల సిబ్బంది ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాస్ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్, ఫ్యాక్టరీస్ శాఖ, కమర్షియల్ టాక్స్ శాఖ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారి తారక్ సాయి, సిబ్బంది ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ వివాహంతో ఉద్రిక్తతలు

- దొంగతనం, అగ్ని ప్రమాదాలు



**గూడూరు,ఏప్రిల్ 07(జనంసాక్షి):** ప్రేమ వివాహం ఉద్రిక్తతకు దారి తీసి, దొంగతనం మరియు అగ్నిప్రమాదానికి కారణమైన ఘటన మంగళవారం గూడూరు మండలం గుండంగాలో వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన తేజావత్ ఉమ్లా తండ్రి మంజ్య కుటుంబం ఈ సంఘటనతో తీవ్రంగా నష్టపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 6న ఉదయం ఉమ్లా ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల కోసం వెళ్లిన సమయంలో కొంతమంది వ్యక్తులు ఇంటి ముందు చేరుకుని ప్రేమ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేశారు. దీని తరువాత, మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వద్ద ఉన్న గడ్డివాముకు నిప్పు పెట్టి దహనం చేశారు. అనంతరం ఇంటి తాళం పగలగొట్టి లోపలికి చొరబడి బీరువాలో ఉన్న సుమారు రూ.7 లక్షల నగదు మరియు బంగారు గొలుసును అపహరించారు. ఈ అగ్నిప్రమాదంలో గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.10 వేల మేర నష్టం జరిగినట్లు సమాచారం. బాధితుడు తేజావత్ ఉమ్లా ఫిర్యాదు మేరకు గూడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బి. గిరిధర్ రెడ్డి తెలిపారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు ఆయన వెల్లడించారు.

## కాకతీయ ఓఎస్‌డిగా వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్, ఏప్రిల్7 (జనం సాక్షి) :** కాకతీయ విశ్వవి ద్యాలయ ఆఫీసర్ అన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా, భౌతిక శాస్త్ర విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ బి.వెం కట్రామిరెడ్డి నియమి తుల య్యారు. ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డిని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు. ప్రస్తుతం వెంకట్రామిరెడ్డి టీజీఎడ్‌సెట్ కన్వీనర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

## మీడియా సంస్థలపై దాడులు సరికాదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్



**హైదరాబాద్, ఏప్రిల్7 (జనం సాక్షి) :** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మీద వైసీపీ నేతలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండి స్తున్నామని తెలం గాణ బీజేపీ అధ్యక్షుడు రామ చందర్ రావు పేర్కొన్నారు. ప్రజస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం సరైన పద్ధతికాదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కేసీఆర్ హయాంలో ఉన్నప్పుడు ఇదే తరహా దాడులు చేసేవారని ప్రస్తావించారు. రాజకీయ విమర్శలు ఉంటే రాజకీయంగా చూసుకోవాలని.. బెదిరింపు ధోరణి సరికాదన్నారు. బాధ్యతాయుతమైన సంస్థపై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తున్నామని రామచందర్ రావు పేర్కొన్నారు.

## దేవాదాయ శాఖ కమిషనర్ శాంతి అరెస్ట్

- ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ చర్యలు



**విజయవాడ, ఏప్రిల్7 (జనంసాక్షి) :** ఏపీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి అరెస్టయ్యారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు.. తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఫ్లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ ప్లస్ 2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్రమాల ఆరోపణలతో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు శాంతి సస్పెన్షన్‌లో ఉన్నారు.

# నగరీకరణ వేగం-మౌలిక వసతుల లోపం!?



మన దేశం వేగంగా నగరీకరణ దిశగా దూసుకుపోతున్న ఈ కాలంలో, నగరాలు అభివృద్ధి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి వెనుక దాగి ఉన్న సమస్యలు రోజురోజుకూ భయంకర రూపం దాల్చు తున్నాయి. జనాభా పెరుగుదల, వలసల ఒత్తిడి, వాహనాల విస్ఫోటనం,చినుకు పడితే జలదిగ్బంధం,వరద(డ్రైనేజీ) నీరు నిర్వహణ లోపం.ఎండాకాలం అగ్నిగుండం. జనాభాకు తగినన్ని పార్కులు,చెట్లు పెంచక పోవడం వలన కాంక్రీట్ జంగలై-పర్యావరణ కాలుష్యంతో -ఇవి అన్నీ కలసి నగర జీవనాన్ని క్లిష్టంగా మార్చుతున్నాయి. అభివృద్ధి అనే పేరు మీద అసమతుల్యత పెరిగితే, నగరాలు సౌకర్యాల కేంద్రాలుగా కాకుండా సమస్యల కేంద్రమాలు గా మారే ప్రమాదం ఉంది.

**నగరీకరణ వేగం-మౌలిక సదుపాయాల లోపం..!**

మన దేశంలో నగరీకరణ వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో మహానగరాలు, పెద్ద పట్టణాలు విస్తరణలో పరుగులు తీస్తున్నాయి. ఉపాధి అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు, ఆధునిక జీవన విధానం-ఇవి అన్నీ ప్రజలను గ్రామాల నుండి నగరాల వైపు ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా జనాభా విస్ఫోటనంలా పెరుగుతూ నగరాలపై అసమాన ఒత్తిడి పెరుగుతోంది. అయితే ఈ వేగానికి సరిపడా మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రహదారులు, ప్రజా రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెందకపోవడం తీవ్రమైన సమస్యలకు దారితీస్తోంది. నగరాల అభివృద్ధి ఒకవైపు వేగంగా సాగుతుంటే, రవాణా వ్యవస్థలు మాత్రం నత్తనడకన ముందుకు సాగుతున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల నగరాలు ట్రాఫిక్ కకావికలంగా మారుతున్నాయి. ప్రతి రోజు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయే పరిస్థితి సాధారణమైపోయింది. ఇది కేవలం సమయనష్టం మాత్రమే కాదు, ఆర్థిక నష్టం, మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలకు కూడా కారణమవుతోంది.

**"వాహన విస్ఫోటనం"..**

మన రాష్ట్రంలో వాహనాల సంఖ్య ప్రతి సంవత్సరం గణనీయంగా పెరుగుతోంది. కానీ రహదారులు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థలు అదే స్థాయిలో అభివృద్ధి చెందడం లేదు. ఈ అసమానత నగరాల్లో ట్రాఫిక్ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తోంది. 2025 డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా వాహనాల సంఖ్య 1.81 కోట్లకు చేరుకోవడం ఈ పరిస్థితికి నిదర్శనం. ప్రత్యేకించి ఐటీ, పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఈ ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. రోడ్ల విస్తరణకు, వాహనాల పెరుగుదలకు మధ్య భారీ అంతరం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇది కేవలం రవాణా సమస్యగా మాత్రమే కాకుండా పట్టణ ప్రణాళికలో లోపాలుగా కూడా భావించాలి.

**సమస్యలు -పరిష్కారాలు, భవిష్యత్ హెచ్చరిక..!?**

"సమస్యలు -పరిష్కారాలు"..

ట్రాఫిక్ రద్దీ పెరగడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పార్కింగ్ కొరత, తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం-ఇవి నగర జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది.

ఈ సమస్యలకు సమగ్ర పరిష్కారం అవసరం. ముందుగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఆర్టీసీ బస్సులు, లోకల్ రైళ్లు, మెట్రో సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా విస్తరించాలి. నగరాల్లో ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించవచ్చు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూడా కీలకం. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు పెరిగితే నగరాలకు వలసలు తగ్గుతాయి. ఇది నగరాలపై ఒత్తిడిని కొంతవరకు తగ్గిస్తుంది. "నగరం పరిగెడుతోంది.. ప్రజా రవాణా పడుతూ లేస్తోంది!"మన రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ప్రజా రవాణా వ్యవస్థ ఆ వేగాన్ని అందుకోలేకపోతోంది. ప్రైవేటు వాహనాల వినియోగం పెరుగుతుండటంతో ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం అధికమవుతున్నాయి. దక్షిణాదిలోని మిగతా మెట్రో నగరాలైన చెన్నై,, బెంగళూరుతో పోలిస్తే హైదరాబాదులో పీఎం10 ఉద్గారాలు అధికం.ఇది భవిష్యత్తులో ఢిల్లీ స్థాయికి చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రజా రవాణా లోపమే.

మెట్రో సేవలు ప్రారంభమైనప్పటికీ, అవి ప్రజల అవసరాలకు పూర్తిగా సరిపోవడం లేదు. కోచ్‌ల సంఖ్య, సర్వీసుల ఫ్రీక్వెన్సీ పెరగాల్సిన అవసరం ఉంది. అలాగే మెట్రో స్టేషన్ల నుండి చివరి గమ్యస్థానానికి చేరడానికి సరైన కనెక్టివిటీ లేకపోవడం పెద్ద లోపంగా మారింది. ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్) ఒకప్పుడు కీలక పాత్ర పోషించినా, ప్రస్తుతం దాని వినియోగం తగ్గింది. సమయపాలన లోపం, సర్వీసుల కొరత వల్ల ప్రజలు దానిని విస్మరిస్తున్నారు. అదే సమయంలో సిటీ బస్సుల సంఖ్య కూడా తగ్గడం ప్రజలకు మరింత ఇబ్బంది కలిగిస్తోంది.

**"పరిస్థితి మెరుగుపడుతేనే-సురక్షిత నివాసయోగ్యం"..**

ట్రాఫిక్ మరియు కాలుష్య సమస్యలను తగ్గించడానికి సమగ్ర దృష్టికోణం అవసరం. పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలి. తక్కువ దూరాల కోసం నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాక్లు అభివృద్ధి చేయాలి.ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించి, స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలి. పార్కింగ్ నియంత్రణకు కఠిన నిబంధనలు తీసుకురావాలి. డెడికేటెడ్ బస్ కారిడార్లు, యూనిఫైడ్ టికెటింగ్ వంటి చర్యలు ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మారుస్తాయి.

ప్రధాన హెచ్చరికతో కూడిన సూచన..ఇప్పటికైనా సరైన నిర్ణయాలు తీసుకోకపోతే, హైదరాబాదు కూడా ఢిల్లీలా కాలుష్య నగరంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం గాలి నాణ్యత సూచీ 120-170 మధ్య ఉండటం ఆందోళనకర విషయం. ఇది మోస్తరు నుండి పూర్ స్థాయికి చేరిన పరిస్థితిని సూచిస్తోంది.పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం-all these are slowly damaging the citys livability. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలి. చినుకు పడితే జలదిబ్బంధం, వరద(డ్రైనేజీ)నీరు నిర్వహణ లోపం సరిదిద్దాలి. ఎండాకాలం అగ్నిగుండం పర్యావరణం కాలుష్య నివారణకు చెట్లను పెంచాలి. అలాగే మెట్రో కారిడార్లను విస్తరించడం, ఎంఎంటీఎస్ సేవలను అధిక ఫ్రీక్వెన్సీతో నడపడం, చివరి మైలు కనెక్టివిటీ కోసం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం అత్యవసరం. పట్టణ ప్రణాళికను శాస్త్రీయంగా అమలు చేస్తూ, సమన్వయంతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తేనే నగరాలు నివాస యోగ్యంగా మారుతాయి.

మొత్తానికి, నగరాల అభివృద్ధి కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడమే కాదు-ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కూడా అంతే ముఖ్యమైనది. అభివృద్ధి మరియు ప్రణాళిక మధ్య సమతుల్యత లేకపోతే, నగరాలు శ్వాస తీసుకోలేని స్థితికి చేరుకుంటాయి.ఇప్పటి పరిస్థితులు ఒక గట్టి హెచ్చరికగా భావించాలి. తక్షణ చర్యలు తీసుకోకపోతే, రేపటి నగరాలు జీవించడానికి కష్టమైన ప్రదేశాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రజా రవాణా బలోపేతం, కాలుష్య నియంత్రణ, గ్రామీణాభివృద్ధి-ఈ మూడు దిశల్లో సమన్వయంతో ముందుకు సాగితేనే సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వాలు, నిపుణులు, ప్రజలు-ముగ్గురూ కలిసి పనిచేసినప్పుడే నగరాలు నిజమైన అభివృద్ధి దిశగా పయనిస్తాయి. అప్పుడు మాత్రమే మన నగరాలు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, నివాసయోగ్యమైన ప్రదేశాలుగా రూపాంతరం చెందుతాయి.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# భారత రాజ్యాంగం ఉండగా పక్క దారులెందుకు?

మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి ఎప్రిల్11. బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 136వ జయంతి ఎప్రిల్ 14. లెనిన్ జయంతి ఎప్రిల్ 22 (1870)) అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే 1. ఈ సందర్భంగా మనం మహనీయులతో పాటు మానవ సమాజం సాధించిన హక్కులు, విజయాలను గుర్తు చేసుకుందాం. భారత రాజ్యాంగం లో ఏమేమి చేర్చుకున్నామో తెలుసుకుందాం.

1950 జనవరి 26నుండి స్వంత్ర భారత దేశంలో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. స్వేచ్ఛ సమానత్వం సౌభాతృత్వం, సామ్యవాద లౌకికవాద, సర్వ సత్తాక రాజ్యాంగం గా ప్రకటించుకున్నాము. ఈ లక్షాల సాధనకు 18 ఏళ్ళు వచ్చిన ప్రతి ఒక్కరికి వయోజన ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకొని చట్ట సభలను నిర్మించుకునే హక్కు వచ్చింది. చట్టసభల్లో చట్టాలు రూపొందించడం జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగులు పరిపాలనతో పాటు వాటిని అమలు చేస్తారు. అవి రాజ్యాంగం ప్రకారం ఉన్నాయో లేదో న్యాయ వ్యవస్థ చూస్తుంది భారత రాజ్యాంగం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా నిర్మించబడింది.

అలా వన్ మ్యాన్ వన్ వాల్యూ వన్ వోట్ అమలులోకి వచ్చింది. అప్పటినుండి నుండి మనుషులందరు సమానమే అని ప్రకటించడం జరిగింది। ఈ రాజ్యాంగం అమలు లోకి రాక ముందు మనుషులందరు సమానం గా గుర్తించబడలేదు. కులాల వారీగా మతాల వారీగా ప్రాంతాల వారీగా ఒకరు గొప్ప ఒకరు తక్కువ అనే భేదాలు, వివక్ష, అణిచివేత, కొనసాగాయి. వర్ణ వ్యవస్థ నాలుగు వర్ణాల వ్యవస్థ ను సృష్టించింది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. వర్ణ వ్యవస్థ వెలుపల ఐదో వర్ణం , అంటరాని కులాల సమాజాలు కొనసాగుతూ వచ్చాయి. ఈ అసమానతలు, వివక్ష, అణిచివేత, దోపిడీ, అవమానాలు మొదలైన

వాటన్నిటిని రూపు మాపడం కోసం ప్రతిజ్ఞ చేస్తూ మన రాజ్యాంగం ప్రకటించుకున్నాము. అందరు ఈ ప్రతిజ్ఞను తమ జీవితంలో సంస్కృతిగా సంస్కారంగా, అలవరుచుకోవాలి. శాసనకర్తలు, ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థ, భావ ప్రకటన స్వేచ్ఛ ఈ లక్ష్యాలకనువుగా రాజ్యాంగ పరిధిలో కృషి చేయాలి.

ప్రతి ఒకరు భారత రాజ్యాంగం చదవాలి. తెలుసుకోవాలి. ఆచరణలోకి తెచ్చుకోవాలి. ప్రపంచంలో అత్యున్నత తత్వశాస్తంగా, మానవతా విలువలు ప్రోది చేసుకున్నది మన రాజ్యాంగం. ఆచరించడం మన కర్తవ్యం. అయితే కొందరు వర్ణ వ్యవస్థ వెలుపల అంటరాని కులాలు, అవర్ణుల వలె ఆధునిక సమాజంలో భారత రాజ్యాంగం వెలుపలి వారిగా, మార్చుతున్నారు. అందులో మను ధర్మ శాస్త్రం ఒకటి. మరొకటి మార్క్సిజం. రెండూ పరస్పర విరుద్ధమైనవి. ఇలా భారతదేశంలోని వివిధ ఉద్యమాలను రాజ్యాంగబద్ధమైనవి (Within the Constitution) మరియు రాజ్యాంగేతరమైనవి (Outside the Constitution) అని వర్గీకరించడం ద్వారా వాటి లక్ష్యాలను, పద్ధతులను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

**ఈ వర్గీకరణను క్లుప్తంగా పరిశీలిస్తే:**

1. రాజ్యాంగ పరిధిలోని ఉద్యమాలు (Within the Constitution):

ఇవి రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా సాగుతాయి.

సామాజిక: కుల వివక్షకు వ్యతిరేక ఉద్యమాలు, మహిళా హక్కుల పోరాటాలు, పర్యావరణ పరిరక్షణ (ఉదా: చిప్కో ఉద్యమం).

రాజకీయ: ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాలు (తెలంగాణ ఉద్యమం వంటివి), లోక్‌పాల్ వంటి అవినీతి వ్యతిరేక పోరాటాలు.సాంస్కృతిక: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమాలు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు. పద్ధతి: శాంతియుత నిరసనలు, ధర్నాలు, కోర్టు కేసులు మరియు ఓటు హక్కు ద్వారా మార్పు కోరడం.

2. రాజ్యాంగ వెలుపల సాగే ఉద్యమాలు : ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థపై నమ్మకం లేక లేదా వ్యవస్థను పూర్తిగా మార్చాలనే ఉద్దేశంతో ఇవి సాగుతాయి.

రాజకీయాల్లో వామ పక్షాలు , మావోయిస్టు ఉద్యమాలు. ఇవి అంతిమంగా సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని చేపట్టాలని చూస్తాయి. బిజేపి, ఆర్ఎస్ఎస్, హిందుత్వ శక్తులు, పార్టీలు రాజ్యాంగాన్ని మార్చి వెనకటి వర్ణ వ్యవస్థను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నాయి.

వేర్పాటువాద ఉద్యమాలు: దేశం నుండి విడిపోవాలని కోరుతూ సాగే తీవ్రవాద లేదా మిలిటెంట్ ఉద్యమాలు. ఇలా అనేక రకాల ఉద్యమాలు రాజ్యాంగం ద్వారా హక్కులు పొందుతూనే, హింస, సాయుధ తిరుగుబాటు మరియు ప్రభుత్వ యంత్రాంగాన్ని ధిక్కరించడం వంటి రూపాల్లో ఉద్యమాలు సాగిస్తాయి. రాజ్యాంగం వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటుంది. తద్వారా అందులో పాల్గొనే ప్రజలు నిర్బంధాలు, ఎదుర్కొంటారు. తద్వారా రాజ్యాంగం ద్వారా , ప్రభుత్వాల ద్వారా అందుకో గలిగే అవకాశాలు. అభివృద్ధి, రాజకీయ అధికారానికి దూరం చేయబడతారు. వామ పక్షాల ఉద్యమాలు, హిందూ ధర్మ సంస్థల ఉద్యమాల నాయకులకు చరిత్ర నిర్మాతలు గా కీర్తి ప్రతిష్టలు చేకూరుతాయి. వారిని అనుసరించే ప్రజలు రాజ్యాంగం ప్రకారం అందాల్సినవి అందక మట్టి గొట్టుక పోతారు. సమాజానికి అభివృద్ధి కి వెనక పడిపోతారు. భారత రాజ్యాంగం లో ఇన్ని అవకాశాలు ఉండగా రాజ్యాంగ వ్యతిరేక ఉద్యమాలు అవసరమా? అవి నిజంగా ప్రజలకు మేలు చేస్తాయా లేక కీడు చేస్తాయా యా! రాజ్యాంగ పరిధిలోని ఉద్యమాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తే, రాజ్యాంగేతర ఉద్యమాలు వ్యవస్థను సవాలు చేస్తాయి. ఈ వర్గీకరణ ద్వారా ఏ ఉద్యమం ప్రజాస్వామ్యబద్ధమైనదో, ఏది కాదో అనే స్పష్టత మనకు లభిస్తుంది. భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన తరువాత కూడా అవి మనకు లేనట్టు ప్రచారం చేస్తూ రాజ్యాంగం వెలుపల ఉద్యమాలు చేయాలని ప్రబోధిస్తారు. అనగా వారు రాజ్యాంగం సరిగ్గా అమలు చేయాలని కోరుతూ తద్వారా ప్రయోజనాలను పొందడం పట్ల నిర్లక్ష్యాన్ని, అగౌరవాన్ని,అవహేళనను ప్రచారం చేస్తారు. తద్వారా అందుకోవలసిన అవకాశాల పట్ల మానసికంగా చిన్నచూపు ఏర్పడుతుంది. దానివల్ల నా వంటివారు లక్షలాదిమంది నష్టపోయారు . కష్టాల పాలయ్యారు. వాళ్ళు రాజ్యాంగం లోని మంచి కాకుండా. అందులోని లోపాలను, ఆచరణలోకి అవకతవకలను చూపి ఇక దీన్ని మార్చాల్సిందే అంటారు. అలా ప్రజల శక్తి సామర్థ్యాలు తమ ప్రయోజనాల కోసం కాకుండా రాజ్యాంగం వెలుపలి వారుగా మార్చడం ద్వారా వారి తెలివి తేటలు సామర్థ్యం నిర్వీర్యం చేస్తారు. కనక వారు మిగతా సమాజంతో వెనకబడి పోతారు. రాజ్యాంగం ఇచ్చే దానికన్నా ఎక్కువ పొందుతామని చెప్పి ఉన్నది కూడా లేకుండా చేస్తారు. అదే జరుగుతూ వస్తున్నది.

వాల్లు చెప్పేవి రాజ్యాంగంలో ఉండగా అవి లేనట్టు విడిగా ఎన్నికల ప్రణాళికలో రాస్తారు. నిజానికి అవి రాజ్యాంగం లో లేవా? ఉన్నాయి. ఒకవేళ లేక పోతే రాజ్యాంగం ప్రకారం పొందు పరిచే కృషి చేయాలి. అలా చేసినప్పుడు రాజ్యాంగం పరిధిలో కృషి చేసిన వారవుతారు. రాజ్యాంగం లో ఉన్న మంచి విషయాలు ఆయా ఆర్టికల్స్ ప్రకారం పేర్కొని వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం అని చెప్పుకోవచ్చు . ఉదాహరణకు కొన్ని పేర్కొంటాను.భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన ఆర్టికల్స్‌ను నేటి రాజకీయ ఎన్నికల ప్రణాళిక శైలిలో, ప్రజలకు అర్థమయ్యేలా "వాగ్దానాలు" లేదా "హామీలు"గా ఇలా పేర్కొనవచ్చు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987



**సామెతా పాతదే**
**సారమూ స్పష్టమే..**

అసహ్యించుకో వలసిన దాన్ని
అసహ్యించు కోవాల్సినంత
అసహ్యించుకోక పోతే..
ప్రేమించాల్సిన దాన్ని
ప్రేమించాల్సినంత ప్రేమించలేం..
సామెతా పాతదే
సారమూ స్పష్టమే..
అన్వయం దగ్గరే
అసలయిన పేచీ..
కట్టుకునే ఇల్లో..
కలుపుకునే బంధమో..
ఎద హత్తుకునే
బాంధవ్యమో..
అదే దైనా
ఎంతటి దైనా..
ఎపుడైనా
ఏ కాలంలో నైనా..
పోగేసుకునే సరుకో
సమ కూర్చుకునే
సరంజామా నో
పక్కు వ్యవహారమో..
దేనితో నయినా
దేనిలో నయినా
బింబంలో నయినా
ప్రతిబింబం లయినా
పరికి పరికి పదిసార్లు
అటూ ఇటూ కిందా మీదా
చూసుకుంటాం ఎప్పుడూ
అది మన కైనప్పుడు..
అందరిదైనప్పుడు
అది జనానికైనప్పుడు..
దొబ్బేస్తాం బాగుందని
తొందరపెడతాం లేటొద్దని..
గోముగా నాటిన మొక్కలు
పూయకుండానే రాలిపోతుంటే..
అల్లిన పందిరి అగ్గిల జిక్కి
కాలి కూలి బూడిదౌతుంటే..
కన్నీటి కాలువ లౌతాం
దుఃఖానికి ప్రతిమలౌతాం..
ఎదలు బాదుకుంటాం
మాథం రూపెత్తి రోధిస్తాం..
కూలిన భవనపు పునాది
చూపిన బీటల నెర్రెలు..
సవులతుగా దాచేస్తిమి
మన కేమని దాటేస్తిమి..
లేచిగురులు తొడిగిన
స్వప్నాలు బూడిదౌతుంటే ..
స్వయం కృతక్షోభల వేళని
వేలెత్తి చూపేటోడు నేస్తమెట్లా..??

డా. ఇక్బాల్ పాషా
9440775732

# రాళ్లలో శాస్త్రం: వేయి స్తంభాల గుడిలో దాగిన ఇంజనీరింగ్ ప్రతిభ!

వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వర స్వామి ఆలయం) భారతదేశ ప్రాచీన సివిల్ ఇంజనీరింగ్ ప్రతిభకు అద్భుత నిదర్శనం. 12వ శతాబ్దంలో (సుమారు 1163 సంవత్సరంలో) కాకతీయుల రాజు రుద్రదేవుడు ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్మించబడిన ఈ మహాకట్టడం కేవలం ఒక ఆలయం కాదు; శాస్త్రం, శిల్పం, ఆధ్యాత్మికత కలయికగా నిలిచిన సమగ్ర నిర్మాణ వ్యవస్థ. ఈ గుడి త్రికూటాలయ (మూడు గర్భగృహాలు) రూపంలో నిర్మితమైంది. శివుడు, విష్ణువు, సూర్యుడు దేవతలకు అంకితం చేయబడిన ఈ మూడు గర్భగృహాలు బరువును సమానంగా పంపిణీ చేస్తాయి. స్టార్ ఆకారపు (నక్షత్రాకార) పీఠంపై నిర్మాణం భూకంపాలు, ఇతర భూగర్భ ప్రభావాలను తట్టుకునేలా రూపొందించబడింది. ఇది కాకతీయుల మత సామరస్యాన్ని (శైవ, వైష్ణవ, సౌర సంప్రదాయాలు) ప్రతిబింబిస్తుంది.

**వేయి స్తంభాలు - ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ అద్భుతం**

గుడి పేరుకు కారణమైన వేయి స్తంభాలు కేవలం అలంకరణ కాదు; నిర్మాణానికి మద్దతు ఇచ్చే ముఖ్య భాగాలు. సిమెంట్ లేని యుగంలో రాళ్లను ఖచ్చితమైన కొలతలతో కట్ చేసి, ఒకదానితో ఒకటి ఇంటర్‌లాకింగ్ (తాళం వేసినట్లు) అమర్చారు. ఇది బలమైన, స్థిరమైన నిర్మాణాన్ని సాధ్యం చేసింది. నల్లరాయి స్తంభాల పాలిష్, ఉపరితల సమతుల్యత శిల్పుల నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. ప్రతి స్తంభం సూక్ష్మ శిల్పకళతో అలంకరించబడి, నృత్య భంగిమలు, యోధులు, జంతు రూపాలు వంటి అంశాలు చెక్కబడ్డాయి.

సాండ్ బాక్స్ టెక్నాలజీ -- భూకంప నిరోధక పునాది

పునాది నిర్మాణంలో ఉపయోగించిన "సాండ్ బాక్స్ టెక్నాలజీ" ఈ గుడి ఇంజనీరింగ్ ప్రతిభకు ప్రత్యేక ఉదాహరణ. ఇసుక, బొగ్గు పొడి, నిమ్మరసం, సహజ పదార్థాల మిశ్రమంతో తయారు చేసిన పునాది భూకంప ప్రభావాన్ని తగ్గించి, నిర్మాణ స్థిరత్వాన్ని సాధించింది. ఆధునిక ఇంజనీరింగ్‌లో కూడా ఈ తరహా సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. కాకతీయులు అప్పటికే భూకంప నిరోధక విధానాలను అవలంబించారు.

800 సంవత్సరాలు తట్టుకున్న అద్భుతం

సుమారు 800 సంవత్సరాలకు పైగా కాలాన్ని తట్టుకుని నిలిచి ఉండటం ఈ గుడి బలానికి, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం. దాడులు, ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొన్నా ప్రధాన నిర్మాణం ఇప్పటికీ తన మహిమను కోల్పోలేదు. భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో సంరక్షణ, పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

**కాకతీయుల శైవ భక్తి మరియు సామరస్యం**

కాకతీయులు శైవ భక్తులు కావడం వల్ల శివాలయ నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. అయితే గుడిలో విష్ణు, సూర్య గర్భగృహాలు కూడా ఉండటం వారి మత సామరస్యాన్ని చూపిస్తుంది. శిల్పం, శాస్త్రం, భక్తి సమన్వయంతో ఈ గుడి రూపుదిద్దుకుంది.

ప్రస్తుతం ఈ గుడి యునెస్కో వారసత్వ సైట్లలో ఒకటిగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. పర్యాటకులు, విద్యార్థులు, పరిశోధకులు తరచుగా సందర్శిస్తారు. ఇది కేవలం చారిత్రక స్మారకం మాత్రమే కాదు; ఒక ఇంజనీరింగ్ పాఠశాలగా, సాంస్కృతిక వారసత్వంగా నిలుస్తుంది.

వేయి స్తంభాల గుడి మన చరిత్రను, సాంకేతిక విజ్ఞానాన్ని, కళా వైభవాన్ని గుర్తు చేస్తుంది. ఇలాంటి అద్భుతాలను సంరక్షించడం ప్రతి పౌరుడి కర్తవ్యం. సాంప్రదాయ జ్ఞానం, ప్రకృతి పదార్థాల వినియోగం, స్థిరమైన నిర్మాణ పద్ధతులు-ఇవి భవిష్యత్ నిర్మాణాలకు మార్గదర్శకాలు.

డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
చరిత్ర పరిశోధకులు, కాకతీయ విశ్వవిద్యాలయం

# " సర్", బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం ఉమ్మడిగా - దీదీని ఓడించగలవా!?

పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఎప్పుడూ భావోద్వేగం, సిద్ధాంతం, సంక్షేమం, గుర్తింపు రాజకీయాల మేళవింపుగా సాగుతుంటాయి. కానీ 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు ఒక కొత్త మలుపు తిరిగాయి. ఓటర్ల జాబితానే రాజకీయ యుద్ధభూమిగా మారింది. మూడు పదులుగా ఎన్నికల రాజకీయాలను ప్రభావితం చేసిన అంశాలు. అధికార పార్టీ పై సహజంగా ఉండే వ్యతిరేకత, సంక్షేమ పథకాలు, మత రాజకీయాలు- ఇప్పటికీ కీలకమే అయినా, ఈసారి అసలు ప్రశ్న "ఎవరు ఓటు వేయగలరు?" అన్నదే అసలు, సిసలు ప్రశ్న గా నిలిచింది.

మమతా బెనర్జీకి ఇది కేవలం మరో ఎన్నిక మాత్రమే కాదు. ఇది ఆమె రాజకీయ వారసత్వానికి పరీక్షగా నిలిచింది. 2011లో వామపక్షాలను అధికారం నుంచి దించి, 34 ఏళ్లపాటు వామపక్ష పాలనకు ముగింపు పలికిన ఆమె, వరుసగా మూడు సార్లు ధీటుగా తన శక్తి, సామర్థ్యాలతో అధికారాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు నాలుగోసారి అధికారంలోకి రావాలన్న లక్ష్యం ముందు ఉన్న ప్రధాన సవాలు బీజేపీ కంటే ఎక్కువగా, ఎన్నికల వ్యవస్థపై నమ్మకం అనే అంశమే ప్రధానంగా మారింది. ప్రత్యేకంగా ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో పెద్ద ఎత్తున ఆమె ఓటర్ల పేర్లను ఎంపిక చేసుకొని ఒక కుట్ర ప్రకారం తొలగిస్తున్నారని, దానికి

బీజేపీ సహకారంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రంగంలోకి దిగి లక్షలాది మంది పేర్లు తొలగించబడుతున్నాయన్న ఆరోపణలు ఈ ఎన్నికలను అసాధారణంగా మార్చాయి.

పేర్లు తొలగించిన సంఖ్యలు ఈ ఆందోళనను బలపరుస్తున్నాయి :

సుమారు 7 కోట్లకు పైగా ఉన్న ఓటర్లలో దాదాపు 11 శాతం పేర్లు తొలగింపుకు గురయ్యే అవకాశముందని అంచనా. ఇది ఒక చిన్న పరిమాణం కాదు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే స్థాయిలో ఉంది. ముఖ్యంగా మహిళా ఓటర్లలో పెద్ద సంఖ్యలో తొలగింపులు జరగడం గమనార్హం. మమతా రాజకీయ బలం చాలా వరకు మహిళలపై ఆధారపడి ఉంది. "లక్ష్మీర్ భండార్" వంటి పథకాల ద్వారా కోట్లాది మహిళలకు నెలసరి ఆర్థిక సహాయం అందించడం ఆమెకు గ్రామీణ ప్రాంతాల్లో బలమైన మద్దతును కల్పించింది. భారతదేశంలో మహిళా ఓటర్ల పాల్గొనడం గత దశాబ్దంలో భారీగా పెరిగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటింగ్ శాతం పురుషులకు సమానంగా చేరుకుంది. ఈ నేపథ్యంలో మహిళా ఓటర్ల తొలగింపు ఒక సాధారణ పరిపాలనా ప్రక్రియ కంటే రాజకీయంగా ఎక్కువ ప్రభావం చూపుతుంది.

మమతా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ విధానాలు కూడా ఈ ఎన్నికలలో కేంద్రబిందువుగా ఉన్నాయి. రైతులకు ఆర్థిక సహాయం, కార్మికులకు రక్షణ, వృద్ధులకు



పెన్షన్లు, నిరుద్యోగులకు సాయం ఇవి అన్నీ కలిపి ఒక పెద్ద సంక్షేమ నెట్‌వర్క్‌ను దీదీకి నిర్మించాయి. భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పోలిస్తే, పశ్చిమ బెంగాల్ సంక్షేమ వ్యయం రాష్ట్ర బడ్జెట్‌లో గణనీయమైన వాటాను కలిగి ఉంది. అయితే ఈ మోడల్‌పై విమర్శలు కూడా ఉన్నాయి. దీర్ఘకాలిక అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి వంటి అంశాలు వెనుకబడిపోయాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) పెరుగుతున్నప్పటికీ, పారిశ్రామిక వృద్ధి గణనీయంగా పెరగటం లేదనే విమర్శ కూడా ఉంది.

ఇదే సమయంలో బీజేపీ వ్యూహం పూర్తిగా భిన్నంగా ఉంది. అవినీతి, చట్టవ్యవస్థ, మతపరమైన రాజకీయాలను ప్రధాన అజెండాగా తీసుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు శాతం గణనీయంగా పెరగడం, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు క్షీణించడం రాజకీయ సమీకరణాలను మార్చాయి. 2016లో కేవలం 10 శాతం ఓట్లు పొందిన బీజేపీ, 2021లో దాదాపు 38 శాతం ఓట్లు సాధించడం చిన్న విషయం కాదు. ఇది బెంగాల్‌లో ద్వైపాక్షిక పోటీకి మార్గం సుగమం చేసింది.

అయితే బీజేపీకి సవాళ్లు కూడా తక్కువ లేవు. స్థానిక స్థాయిలో బలమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం, బెంగాలీ సంస్కృతిపై సున్నితమైన అవగాహన లోపించడం, అలాగే "బాహ్య పార్టీ" అనే విమర్శలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అంతేకాకుండా ముస్లిం ఓటర్లలో వ్యతిరేకత, ఇతర రాష్ట్రాల్లో బంగ్లా మాట్లాడే ప్రజలపై జరిగే చర్యలు వంటి అంశాలు కూడా ఈ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఈ ఎన్నికల్లో మరో ముఖ్య అంశం ఓట్ల విభజన. కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేయకపోవడం వల్ల కూడా మైనారిటీ ఓట్లు విభజించబడే అవకాశం ఉంది. గతంలో ఇదే పరిస్థితి బీజేపీకి అనుకూలంగా మారింది.అయినా దేశంలో ప్రధాన ప్రతిపక్షం ఈ విషయంలో అవగాహన లేకపోవడం, రాహుల్ గాంధీలో తగిన పరిణితి లోపించడం వల్ల మమతా బెనర్జీ లాంటి సీనియర్ నేతలతో సంప్రదింపులు జరిపి ఒక అవగాహనతో పొత్తు పెట్టుకుంటే బీజేపీకి చెక్ పెట్టేందుకు ఉపయోగ పడేది. ఒక నియోజకవర్గంలో కేవలం 2--3 శాతం ఓట్ల మార్పు కూడా ఫలితాన్ని పూర్తిగా మార్చగలదు. బెంగాల్ వంటి రాష్ట్రంలో సీపీఎం కూడా బీజేపీ కంటే మమతా బెనర్జీ కొంత మేలు కదా! అయినా ప్రధాన ప్రత్యర్థిగా తృణమూల్ కాంగ్రెస్ ను ఎంచుకోవటం బీజేపీ కి కలిసి వచ్చే అవకాశం. ఇక రాజకీయ ప్రచారంలో భావోద్వేగం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. మమతా తనను "బెంగాల్ గౌరవం"గా చూపించుకుంటే, బీజేపీ "మార్పు" మరియు "అవినీతి రహిత పాలన" అనే నినాదాలతో ముందుకు సాగుతోంది. ఈ రెండు వాదనలు కూడా తమ తమ వర్గాల్లో బలమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో అసలు మార్పు తీసుకురాగల అంశం ఓటర్ల జాబితా సవరణే. ఎన్నికల ప్రక్రియపై ప్రజల నమ్మకం క్షీణిస్తే, అది ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదం. భారతదేశంలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. కానీ ఇటువంటి ఆరోపణలు కొనసాగితే, ఆ నమ్మకం దెబ్బతినే అవకాశం ఉంది.ఇప్పటికే భారత ఎన్నికల సంఘం బీజేపీ కి అనుకూలంగా పనిచేస్తున్నదనే అపవాదు దాని పై బలంగా పడింది. ఎన్నికల కమిషనర్ ఎంపిక దగ్గర నుంచి,సర్ తో ఓటర్ల జాబితాలో కావాలనే విపక్షాల ఓటర్ల పేర్లను ముఖ్యంగా గుర్తించి ఓటర్ల జాబితా నుంచి లక్షలాది మంది ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించటంతో... దాని ప్రతిష్ట సుప్రీంకోర్టు వరకూ వెళ్ళటంతో అంతర్జాతీయంగా దెబ్బ తిన్నది.

మొత్తానికి, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఈసారి కేవలం రాజకీయ పోటీ మాత్రమే కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఒక (సవాల్) పరీక్ష. సంక్షేమం వర్సెస్ సిద్ధాంతం, స్థానికత వర్సెస్ జాతీయత, అలాగే ఓటు హక్కు వర్సెస్ పరిపాలనా ప్రక్రియల మధ్య జరిగే ఈ పోరాటం ఫలితం రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఎన్నికల రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చివరి నిర్ణయం ప్రజల చేతిలోనే ఉంది. కానీ ప్రశ్న మాత్రం ఇంకా నిలిచే ఉంది. ఆ నిర్ణయం తీసుకునే అవకాశం అందరికీ ఉంటుందా?

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.
9849328496.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# సిఎంసి పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

**కమిషనర్ సృజన**

**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల, మెరుగైన ప్రజా పాలనను అందించే దిశగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేసే దిశగా ముందుకు సాగుతున్నామని సీఎం సి కమిషనర్ సృజన పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె నేతృత్వంలో సిఎంసి 2వ స్థాయీ కమిటీ సమావేశాన్ని జయేష్ రంజన్ అధ్యక్షతన మంగళవారం మాదాపూర్ న్యాక్ భవనంలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా మంచి పరిపాలనను అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం మరియు పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తూ... మొత్తం 15 అంశాలకు ఏకగ్రీవ ఆమోదాన్ని తెలపడం జరిగింది.



ఆమోదం లభించింది. అధికారిక వినియోగం కోసం ఈవిల కొనుగోలు, రోడ్డు విస్తరణ, లింగంపల్లి సమీపంలో ఆర్ఓబీ ( ఆర్ఓబి ) , పలు రోడ్డు పనుల కు ఆమోదం తెలియజేశారు. వర్షపునీటి కాలువలు , సిసి/విడిసిసి రోడ్డు పనులు, రోడ్డు విస్తరణ కోసం యుటిలిటీల తరలింపు తదితర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిని సావించనున్నట్టు తెలిపారు. ప్రజారోగ్య సేవల కోసం ఈఎస్ఐ డిస్పెన్సరీ, మెరుగైన పాలనకోసం వికేంద్రీకరణతో కూడిన అధికారాల అప్పగింతను త్వరలోనే చేపట్టనున్నట్టు తెలిపారు. అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవడం కోసం అదనపు నిర్ణయాలు, పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపు, సిఎస్ఆర్ కింద పార్కుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు కమిషనర్ సృజన తెలిపారు. అలాగే సామాజిక భాగస్వామ్యం తో చెరువుల నిర్వహణ, కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల శాఖలు తక్షణమే తమ కార్యాచరణకు అనుగుణంగా పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

# ఆరోగ్యంగా ఉంటేనే మనం జీవితంలో ఏదైనా సాధించగలం

- **శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యం**
- **ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల, ఏప్రిల్ 07 (జనంసాక్షి):** ఆరోగ్యంగా ఉంటేనే మనం జీవితంలో ఏదైనా సాధించగలమని, శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్య మని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న మనం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, ఆరోగ్యం మన జీవితంలో ఎంత ముఖ్యమో గుర్తు చేస్తుందన్నారు. ఆరోగ్యం అనేది మనిషి సంపదలో అత్యంత విలువైనదని అని అన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని మన పెద్దలు చెప్పిన మాటల వెనుక గొప్ప సత్యం దాగి ఉందన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే మనం జీవితంలో ఏదైనా సాధించగలం. శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యం అన్నారు. ఈ వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్నాయని, అందుకే మనం ప్రతిరోజూ



వ్యాయామం చేయడం, సంతులిత ఆహారం తీసుకోవడం, సరైన నిద్రపోవడం, సానుకూల ఆలోచనలు కలిగి ఉండడం చాలా అవసరం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించడానికి ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలు తీసు కుంటుందని ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం మనకు ఒక సందేశాన్ని ఇస్తుందని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని. మనం ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరుచుకుని, మన కుటుంబం, సమాజాన్ని కూడా ఆరోగ్యంగా ఉండాలని, మనందరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని అన్నారు. ప్రతి రోజు ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా ఒక చిన్న అడుగు వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, కృష్ణా నాయక్, సర్పంచ్ లు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మండల పరిధిల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పడాల ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, సూపరిండెంట్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ల బృందం, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై చర్యలు



**శంషాబాద్, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్.జి.ఐ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్.జి.ఐ ట్రాఫిక్ పిఎస్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 24 కేసులు నమోదు చేసి రూ.48 వేలు జరిమానా వసూలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసుల్లో ఇద్దరు వ్యక్తులను రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె. వేణు గోపాల్ రెడ్డి ముందు హాజరు పరచగా, వారికి ఒక్క రోజు సాధారణ కారాగార శిక్షతో పాటు జరిమానాలు విధించారు. యస్. సత్తయ్యకు రూ.3,500, జె. భాస్కర్‌కు రూ.4 వేలు జరిమానా విధించారు. అదేవిధంగా, 11 మంది డ్రంక్ అండ్ డ్రైవింగ్ నేరాల్లో పట్టుబడినకి మొత్తం రూ.27 వేలు జరిమానా చెల్లించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 2 కేసుల్లో రూ.3 వేలు జరిమానా విధించగా, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేసిన 8 మందికి కలిపి రూ.9,500 జరిమానా విధించారు. మైనర్ డ్రైవింగ్ చేసిన ఒక కేసులో వాహన యజమానికి రూ.1000 జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని, రహదారి భద్రత కోసం ఇలాంటి చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. జరిమానాలు ప్రమాదాలను చేందుకు ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇన్స్పెక్టర్ సూచించారు.

## కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి



**తలకొండపల్లి (జనంసాక్షి):** కోళ్ల పందెం స్థావరంపై మెరుపు దాడి చేసి,ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు తలకొండపల్లి ఇన్ స్పెక్టర్ వి.జానకిరామ్ రెడ్డి మంగళవారం తెలిపారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం అంతారం గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కోళ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం తెలియడంతో ఇన్ స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి సూచనల మేరకు ఎస్ఐ కే.శేఖర్ తో పాటు 04 పోలీసు సిబ్బంది దాడులు చేశారని తెలిపారు.ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా,మరో కొంతమంది పరారైనట్లు వివరించారు.పట్టుపడ్డ వారి నుంచి నాలుగు పందెం కోళ్లను,05 బైక్‌లను,రెండు మొబైల్ ఫోన్లు,కోళ్ల కాళ్లకు కట్టే 20 కత్తులు,1000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.నిందితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించినట్లు పేర్కొన్నారు.కోళ్ల పందేలు,పేకాటతో మృతగతి కుటుంబాలు ఆర్థికంగా కుదేలై,అప్పుల బారిన పడుతున్నారని అన్నారు.పారిపోయిన వారిని గుర్తించి వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఇన్ స్పెక్టర్ తెలిపారు.

## మాదాపూర్ లో కరడుగట్టిన బైకు దొంగ అరెస్ట్... 7 బైకులు స్వాధీనం

**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** జల్సాలకు అలవాటు పడి బైకుల దొంగగా మారిన ఓ వ్యక్తిని మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మియాపూర్ ఏసిపి సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం వారాల మురళీధర్ రావు అలియాస్ మురళి(44) గతంలో సరూర్నగర్ లో నివాసం ఉంటుండగా ప్రస్తుతం కూకట్పల్లి పరిధి బాలాజీ నగర్ లో ఉంటూ కార్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ప్రధానంగా ఇళ్ళ ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు, రైల్వే స్టేషన్, పార్కింగ్ ప్రదేశాలు, ఇతర ప్రదేశాలలో పార్కు చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని ఎవరూ లేని సమయం చూసి వాటిని దొంగిలించి ఇతరులకు అమ్ముకుంటూ వచ్చిన డబ్బులతో విచ్చలవిడిగా వ్యసనాలలో మునిగితేలుతుంటాడు. ఈ క్రమంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి చందా



నాయక్ తండా సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ బైకుపై వెళ్తున్న మురళీధర్ రావును పోలీసులు ఆపి తనిఖీ చేయగా అతని వద్ద సదరు బైకుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లభించకపోవడం, అడిగిన విషయాలకు సరైన సమాధానం రాకపోగా బైక్ పై పారిపోవడానికి ప్రయత్నించడంతో మాదాపూర్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించడంతో 3.50 లక్షల రూపాయల విలువచేసే ఏడు బైకులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, కెపిహెచ్బి, చర్లపల్లి, భువనగిరి, సరూర్నగర్ తదితర ప్రాంతాలలో మురళి పై కేసులు నమోదైనట్లు ఎసిపి వెల్లడించారు. నిందితుడు పై దర్యాప్తు కొనసాగుతుందని మరిన్ని వివరాలను రాబట్టి మీడియాకు తెలియపరుస్తామని ఆయన వివరించారు.

## వైఈఏ నూతన అధ్యక్షుడిగా ఆర్.సి.రాహుల్



**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** దశాబ్దానికి పైగా హైదరాబాద్ కేంద్రంగా విజయవంతంగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ అసోసి యేషన్ (వైఈఏ) నూతన నూతన అధ్యక్షుడి తోపాటు పాలకవర్గం ఎన్నికయింది. యువ వ్యాపారవేత్తలకు వేదికగా నిలిచిన వైఈఏ 2026 వార్షిక సర్వ సభ్య సమావేశంలో ఈ 2026-27 ఏడాదికి సంబంధించి అసోసియేషన్‌కు కొత్తనా యకత్వాన్ని ఎన్నుకొని అధికారిక ప్రకటన చేసింది. అధ్యక్షుడిగా ఆర్.సి.రాహుల్ ఎన్నికయ్యారు. ఆ యనతో పాటు జనరల్ సెక్రటరీగా ఆదిత్య బాన్సల్, మెంబర్‌షిప్ చైర్‌గా వినీత సూరన, బోర్డు స భ్యులుగా అవినాష్ చుక్కపల్లి, కూనల్ జైన్, మోహిత్ జడేజాలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆర్.సి.రాహుల్ మాట్లాడుతూ.. కీలక తరుణంలో యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్‌కు నాయకత్వం వహించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. గత పదేళ్లలో వైఈఏ బల మైన సంస్థగా పునాదులు వేసుకుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ సంస్థను స్థానిక సంస్థగానే కాకుండా కాకుండా తమ పరిధిని మరింతగా విస్తరణ చేస్తూ అంతర్జాతీయ స్థాయికి తీసుకుని వెళ్లే కృషి చేస్తామని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు ఒకరితో ఒకరు కలుసుకోవడం, తమ అనుభవాలను పంచుకోవడానికి తమ సంస్థ వేదిక అని చెప్పారు. అందరం కలిసి అభివృద్ధి చెందడానికి అవస రమైన వేదికను రూపొందించడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉన్నది




**మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**




**హయత్ నగర్, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** యుద్ధ వ్యతిరేక నిరసన ర్యాలీ ని పెన్షన్ సంఘాల ఆధ్వర్యంలో పనామా నుండి రెడ్ ట్యాంకు వరకు నిరసన ర్యాలీ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించారు. యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి ముద్దు, ట్రంప్ డౌన్ డౌన్, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి, అమెరికా ఇజ్రాయిల్ తక్షణమే యుద్ధ విరమణ చేయాలి అని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ యుద్ధంతో పశ్చిమాసియా దేశాలలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అనేకమంది ప్రాణాలు బలి అవుతున్నాయని తక్షణమే యుద్ధ విరమణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ యుద్ధ ప్రభావంతో నేడు దేశంలో అనేక వస్తువుల రేట్లు పెంచారని తద్వారా భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ ఏకమై యుద్ధాన్ని నివారించకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజల విస్తృత ప్రచారం నిర్వహించాలని, యుద్ధాన్ని నిలిపివేయాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. యుద్ధం వలన సామాన్య, మధ్యతరగతి, ప్రజలు వ్యాపారస్తులు గ్యాస్ సరఫరా సరిగా లేక వ్యాపారాలు దివాలా తీస్తున్నాయని అన్నారు. హోటల్ నిర్వాహకులకు కడుభారంగా మారింది గ్యాస్ అందడం లేదు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కావున తక్షణమే యుద్ధ విరమణ చేయాలని డిమాండ్ చేశారు. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేస్తుందని తప్పుడు ప్రచారం చేసి యుద్ధాన్ని చేస్తుందని, ఫలితంగా ఈరోజు ప్రపంచ శాంతి విచ్ఛిన్నమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ అసోసియే షన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారావు, నోముల సుదర్శన్ రెడ్డి, బ్రహ్మచారి, అనసూయ, బిజీ ఏం రెడ్డి, ముషం నరహరి, పాల్గొన్నారు.

# ముడ్డిలో పెట్టిన పైపు

**మృతి చెందిన యువకుడు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిథి (జనంసాక్షి):** ఇద్దరు స్నేహితులు నవ్వుతూ చేసిన తమాషాతో ఒకరు ప్రాణం కోల్పోయారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులోని విజయనేహా పరిశ్రమలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్, ఫరూక్ నగర్ మండలం కిషన్ నగర్‌కు చెందిన సాయి అనే యువకుడు పనిచేస్తున్నారు. అయితే స్నేహితులు నవ్వుతూ తమాషాలాడారు. ఈ క్రమంలోనే సాయి పరిశ్రమలో వాడే గాలి పైపును పవన్ ముడ్డిలో పెట్టాడు. దీంతో పవన్ (20) మరణించాడు. మృతుడు పవన్ సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ సీతారాం తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ నాయకుల అరెస్టులు సరికాదు

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి**



**మొయినాబాద్, (జనంసాక్షి):** టిఆర్ఎస్ పార్టీ నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు సరికాదని డిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పరిగిలోని ఇండస్ట్రియల్ భూ బాధిత రైతులను పరామర్శించడానికి వెళు న్న మాజీమంత్రి హరీష్ రావును పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మొయినాబాద్ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఈ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలని చూస్తే ఊరుకునేది హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి, నరోత్తం రెడ్డి, రాహుఫ్, జెవంత్, మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు మద్దతు

**బి.ఆర్.ఎస్ నాయకుల ఖండన**



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** భూములు కోల్పోతున్న రైతులకు మద్దతుగా పరిగి ప్రాంతానికి వెళ్లాలని భావించిన మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డిలను పోలీసులు గృహ నిర్బంధం చేయడాన్ని మణికొండ బి.ఆర్.ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో వెళ్లే నాయకులను అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. అప్పా జంక్షన్ వద్ద వారిని అడ్డుకుని అరెస్ట్ చేయడం, రైతుల పరిస్థితులను తెలుసుకోవడాన్ని కూడా నేరంగా చూడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్న నాయకులను అడ్డుకోవడం తెలిపారు.

# విద్యార్థినిలు కష్టపడి చదవాలి



**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్ హన్వాడ, (జనంసాక్షి):** హన్వాడ, వేపూర్ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బి.సి. సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా విద్యార్థులు వారి మంచి భవిష్యత్తు, ఉన్నతమైన వృత్తి సాధన కోసం కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.హన్వాడ మండల కేంద్రంలోని హన్వాడ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బి.సి. సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వేపూర్ మహాత్మా జ్యోతి బా పూలే తెలంగాణ బి.సి సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు.తొలుత హన్వాడ మహాత్మా జ్యోతి బాపూలే బి.సి.సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. పాఠశాలలోని వంటగదిని తనిఖీ చేసి కలెక్టర్ భోజనం నాణ్యత ను పరిశీలించారు. వంటగది శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని, భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లను, డార్మిటరీని, తరగతి గదులను పరిశీలించారు. ముఖ్యంగా వేసవి కాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం హన్వాడ మండలంలోని పల్లెమో ని కాలనీ సమీపంలో ఉన్న వేపూర్ బి. సి సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. అక్కడ 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ, ఈ రోజు వ్రాసిన ఎస్.ఎస్. సి బయాలజీ పరీక్ష పేపర్ ఎలా వచ్చింది, పరీక్షా ఎలా రాశారు? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఎస్. సి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన తొలి మైలురాయి అని, అందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. పరీక్షలను భయం లేకుండా ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. హీమోగ్లోబిన్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షిస్తు న్నారా అని అడిగారు. మంచి ఆరోగ్యానికి ఆకుకూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, అవి ఐరన్, కాల్షియం, ప్రోటీన్లను అందిస్తాయని తెలిపారు. పాఠశాలలోని డార్మిటరీని పరిశీలించి వేసవిలో ఇబ్బంది లేకుండా ఫ్యాన్‌లు అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు ఉన్నా యా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనం తరం వంటగదినీ , స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం, గుడ్ల నిల్వలను కూడా తనిఖీ చేశారు.భోజన నాణ్యత పరిశీలించి తదనంతరం కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

## జవహర్ నగర్ పిల్లల భవిష్యత్తుకు సమన్వయంతో చర్యలు

**సంబంధిత శాఖలు సామాజిక బాధ్యతతో పని చేయాలి: సీత దయాకర్**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** జవహర్ నగర్‌లోని 0-18 సంవత్సరాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించేందుకు సం బంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీత దయాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కమిషన్ సభ్యులు చందన, సరిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జవహర్ నగర్ పిల్లలకు విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని తెలిపారు. జిల్లాయంత్రాంగం అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేస్తేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. పిల్లల వివరాలను సేకరించి, స్కూలుకు వెళ్లని పిల్లలు, చదువు మానేసిన వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఆధార్, జనన, కుల ధృవపత్రాలు లేని పిల్లలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అందించాలన్నారు.బాల కార్మికులు, బాల్య వివాహాలు, లైంగిక దుర్వినియోగం, డ్రాప్‌ఔట్ వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఆపరేషన్ ము స్కాన్ తరహాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు, స్వచ్ఛ ంద సంస్థల సమన్వయంతో ముందుకు వెళ్లాల ని తెలిపారు. అంగన్‌వాడీ ఫ్యామిలీ సర్వే డేటాను ఉపయోగించి పిల్లల సామాజికో-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధికి పునాది
- ఎమ్మెల్యేలు డా.రాజేష్ రెడ్డి, డా.వంశీ కృష్ణ



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అచ్చంపేట శాసన సభ్యులు డా. వంశీ కృష్ణ , నాగర్ కర్నూల్ శాసన సభ్యులు డా.రాజేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యం. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా తల్లి–శిశు ఆరోగ్యం, టీకాల కార్యక్రమాలు, పరిశుభ్రత, పోషకాహారం వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి" అని తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. వ్యాధులను ముందుగానే నివారించేందుకు అవగాహన అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. రవి కుమార్ గారు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని, ముఖ్యంగా ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో జిల్లా మంచి ఫలితాలు సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.భారత్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డా.కృష్ణ మోహన్, డా.సురేష్ బాబు, లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధులు, ఆర్ఎంఓ డా.ఆర్. శంకర్, డా. ప్రశాంత్, డా. రోహిత్, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బంది, వైద్య మరియు నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



**మిర్యాలగూడ (జనంసాక్షి) :** రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామం వద్ద అద్దంకి నార్కెట్ పల్లి రహదారిపై రైతులు ధర్నా నిర్వహించడం జరిగింది. సోమవారం నాడు రైస్ మిల్లర్లు రైతులకు మధ్య ఘర్షణ జరగడంతో మంగళవారం నాడు రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకుండా నిలిపివేయడం జరిగింది . దీంతో వందలాది ట్రాక్టర్లు హైవే రోడ్డుపై నిలిచిపోవడం జరిగింది దీంతో ఆగ్రహించిన రైతులు అద్దంకి నార్కెట్ పల్లి రహదారిపై సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వాహనాల రాకపోకలను బంద్ చేయడం జరిగింది.. రైస్ మిల్లర్స్ తో ఎమ్మెల్యే చర్చలు సఫలం..

తిరిగి కొనుగోలు ప్రారంభం..

మంగళవారం నాడు మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకుండా బంద్ చేయడంతో ఆగ్రహించిన రైతులు ధర్నా చేసిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డిఎస్పి రాజశేఖర్ రాజుతో కలిసి మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో రైస్ మిల్లర్స్‌తో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే గారిని ఆదేశించడం జరిగింది స్పందించిన రైస్ మిల్లర్లు వెంటనే కొనుగోలు ప్రారంభించడంతో రైతులు ఆందోళన విరమించడం జరిగింది.

## దుందుభి వాగులో అక్రమ ఇసుక తవ్వకాలపై కలెక్టర్‌కు పిర్యాదు



**రాజాపూర్, (జనంసాక్షి) :** మండల పరిధిలోని గుండ్ల పొట్లపల్లి, అగ్రహారం పొట్లపల్లి గ్రామాల శివారులో, ప్రాంతంలో ఉన్న దుందుభి వాగులో హిటాచీలు, జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల వంటి భారీ యంత్రాల ను ఇసుకను అక్రమంగా తవ్వడానికి నిరంతరం ఉపయోగి స్తున్నారు. ఈ చర్య తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కలిగిస్తోందని, స్థానిక జీవావరణ వ్యవస్థను, భూగర్భ జల మట్టాలను కూడా ప్రభావితం చేస్తోందని అగ్రహారం పొట్లపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మహమద్ ఖదీర్ కలెక్టర్ కు పిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం రాత్రి సమయంలో హిటాచీతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, రెవెన్యూ, పోలీసు శాఖలకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని పిర్యాదులో పేర్కొన్నట్లు ఖదీర్ తెలిపాడు.

## నిర్ణీత గడువులోగా మిల్లర్లు సిఎంఆర్ బియ్యం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ శ్రీను




**నారాయణపేట జిల్లా బ్యూరో ఏప్రిల్ 7(జనంసాక్షి):** రైస్ మిల్లర్లు నిర్ణీత గడువు లోపు సిఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి సమర్పించా లని అదనపు కలెక్టర్ (రెవె న్యూ) శ్రీను ఆదేశించారు. మంగళవారం వీసీ హాల్ లోద అదనపు కలెక్టర్ డిఎం సివిఎస్సి, రైస్ మిల్లర్లందరితో,డిటి సివిఎస్‌సితో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 20 25-26 కోసం సిఎంఆర్ డెలి వరీలపై సమీక్ష నిర్వహించా రు.సమావేశంలో రబీ 20 25-26 కోసం వరిని కేటా యించడానికి బ్యాంక్ గ్యారెం టీలు, ఒప్పందాలను సమ ర్పించాలని అలాగే మిగిలిపో యిన గోనె సంచులను వెంట నే తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎం సివిల్ సప్లై సైదులు, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల ఖాతాల్లోకి రూ.150 కోట్లు

ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, (జనంసాక్షి):** ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా రూ.150 కోట్ల ట్రక్చర్ అమౌంట్‌ను విడుదల చేసినట్లు మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందని, ఇప్పటికే నిధుల ఫైలుపై సంతకం పూర్తి కావడంతో లబ్ధిదారుల ఖాతాల్లోకి మంగళవారం నగదు జమ అవుతుందని స్పష్టం చేశారు. మిగిలిన నిధులను కూడా ఈ ఏప్రిల్ నెలాఖరు లోగా విడుదల చేస్తామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అవార్డులను త్వరితగతిన క్లియర్ చేసి, నూతన ప్యాకేజీ ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ.18 లక్షల పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## గాంధారిపల్లి ఇసుక .. రూ. 58 వేలు



**పాపన్నపేట, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** గాంధారి పల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుకకు మంగళవారం రెవెన్యూ అధికారులు వేలం నిర్వహించారు. సుమారు 34 ట్రిప్పులు,102 క్యూబిక్ మీటర్ల ఇసుకకు క్యూబిక్ మీటరుకి రూ.570 చొప్పున హెచ్చు పాట పాడి రూ.58.140 లకు గ్రామస్తులు ఈ హక్కును పొందినట్లు తహశీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. రెవెన్యూ ఆర్ఐ సత్తు స్వామి, ఉన్నారు.

# హైదరాబాద్ - మెదక్ జాతీయ రహదారిపై విద్యార్థుల ధర్నా

- గిరిజన విద్యార్థులు అంటే లోకువా...!
- కులం పేరుతో దూషించే ఉపాధ్యాయుడు, ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోరా
- సందర్శనకు కరువైన కౌడిపల్లి గిరిజన గురుకుల పాఠశాల



**కౌడిపల్లి ఏప్రిల్ 07,(జనంసాక్షి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో గిరిజన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు దిగారు. గిరిజన రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఫణి కుమార్, సోషల్ ఉపాధ్యాయుడు ఉదయ్ కుమార్,ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు హైదరాబాద్, మెదక్ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.గత వారం రోజులుగా సోషల్ ఉపాధ్యాయుడు ఉదయ్ కుమార్,పై పలు ఆరోపణలు వెలువడుతున్నప్పటికీ, సంబంధిత అధికా రుల నుండి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థులు ఆరోపించారు. జిల్లా గురుకుల అధికారి ఆర్‌సీవో గంగారం నాయక్ ఇప్పటివరకు స్పందించలేదని వారు విమర్శించారు. ఇదే సమయంలో, ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఫణి కుమార్, విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తిస్తూ, కులం పేరుతో దూషణలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. మీరు ఉదయ్ దగ్గర డబ్బులు తీసుకుని మా మీద ఇలా ఆరోపణలు చేస్తున్నారు అంటూ అవమానకరంగా ప్రిన్సిపల్ ఫణి కుమార్ మాట్లాడినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలికి చేరుకొని విద్యార్థులకు నచ్చ చెప్పడంతో విద్యార్థులు సద్దుమణిగారు. ప్రస్తుతం ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది.

# ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి



- ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు
- స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న జిల్లా కలెక్టర్
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, (జనంసాక్షి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పలు ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. "ఏశీస్త్రవ్పవతీ టశీతీ ఎముశ్రీప్త -- ౕఖఅఏ ఔఙప్త రాఏఅవఅఏవ" అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ, ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, మిల్లెట్ ఆహారం, పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ,స్థానిక సర్పంచ్ ,పిహెచ్సి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పక్కగా ముఖ నిర్ధారణ పక్రియ

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, (జనంసాక్షి):** జిల్లాలో ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారిని పక్కాగా ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మెదక్ పట్టణం ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని, ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారి నుండి ఫేషియల్ నిర్ధారణ ప్రక్రియను యాప్ ద్వారా చేస్తామన్నారు. ఈ ప్రక్రియ ఈరోజు ,రేపు మెదక్ పట్టణంలోని 7, 20, 21 ,22 వార్డుల్లో కొనసాగుతుందన్నారు. వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది నాలుగు బృందాలుగా ప్రక్రియలు చేపడు తుందన్నారు. నిర్ధారణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మరణించిన వారిని పెన్షన్ పథకం నుండి తొలగించడానికి, పెన్షన్ పొందుతున్న వారిని నిర్ధారించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శ్రీనివాసరావు, సర్ఫ్ డైరెక్టర్ సోషల్ సెక్యూరిటీ గోపాల్, ప్రాజెక్టు మేనేజర్ గోవర్ధన్ టి.జి ఆన్లైన్ , సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించండి

అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో (జనంసాక్షి):** మున్సిపాలిటీ సిబ్బంది వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కొత్తకోట మునిసిపాలిటీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ పరిధిలోని నర్సరీలను, వర్మీ కంపోస్ట్ తయారీ సెంటర్‌ను పరిశీలించారు.నర్సరీల సందర్శనలో భాగంగా, రాబోయే జూన్ నెలలో చేపట్టనున్న మొక్కల నాటేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అలాగే వర్మి కంపోస్ట్ తయారీ సెంటర్ వద్ద వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, తడి , పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించాలని ఆదేశించారు. మార్కెట్ వ్యర్థాలను సమయానికి కంపోస్టింగ్ చేయాలని కూడా సూచించారు.

# మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే





## టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**నాగర్ కర్నూల్, (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం సమావేశం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో (జనంసాక్షి):** ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు,కల్యాణ లక్ష్మి చెక్కులు,షాదిముబారక్ చెక్కులను ఎప్పటికప్పుడు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తూ వారికి ఎంతో తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నిరు పేదల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడు తుందన్నారు.ఒక్కో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారునికి 5 లక్షల రూపాయలు చెల్లిం చి వారి సొంతింటి కల నెరవేరుస్తుందని, దాంతో ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక నానా ఇబ్బందులు పడిన నిరుపేదలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొంత గూడు ఏర్పాటు చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.అలాగే రేషన్ కార్డు లేని ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు ఇచ్చి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తూ నిరుపేదల ఆకలి తీరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు.ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గం పరిధిలోని 8 మండలాలు, రెండు మున్సి పాలిటీలకు సంబంధించి 178 మంది కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదా రులకు ఆయన ఒక లక్ష 16 రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు పొందిన లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అధికారులు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. వనపర్తి పట్టిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్

పాఠకుల సమస్యలపై నేరుగా ఆరా శాఖ గ్రంథాలయాల మరమ్మత్తులకు ప్రణాళికకు సూచనలు



**భువనగిరి, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి గ్రంథాలయ అభివృద్ధిపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎండి అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ, కార్యదర్శి ఎం.సుధీర్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.సందర్శనలో భాగంగా కలెక్టర్ గ్రంథాల యంలోని పాఠకులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్య లను తెలుసుకున్నారు. పాఠకులకు ఆధునిక సౌకర్యాలు అందించే దిశగా డిజిటల్ లైబ్రరీ సేవలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అలాగే జిల్లా కేంద్ర గ్రంథాల యంలో కొత్త వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జిల్లా పరిధిలోని రామన్నపేట, వలిగొండ, ఆలేరు, తుర్కపల్లి ప్రాంతాల శాఖ గ్రంథాల యాలను సందర్శించి వాటి మరమ్మత్తులకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం పరిధిలోని శాఖల వివరాలను కూడా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది కొరతను సంస్థ అధ్యక్షుడు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, దానిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే మండల, గ్రామ పంచాయతీల నుంచి వసూలవుతున్న లైబ్రరీ సెస్ తక్కువగా ఉండటంపై చర్చిస్తూ, పూర్తి స్థాయిలో వసూలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రంథాల య సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## నేడు రక్షిత మాతృత్వ దినోత్సవంపై వర్క్ షాప్

జిల్లా వైద్యాధికారి శ్రీరామ్



**మెదక్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** మెదక్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏప్రిల్ 8న రక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా వర్క్ షాప్ నిర్వహి స్తున్నట్లు, వర్క్‌షాప్‌లో సురక్షిత ప్రస వాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు జిల్లా వైద్యాధి కారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ వైద్య నిపు ణులు, అంగన్వాడీలూ, ఏఎన్ఎంలు, తల్లులు, పాల్గొం టున్నార ని ప్రజలందరూ పాల్గొనాలని జిల్లా వైద్యాధికారి డా:శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ఘనంగా వరల్డ్ హెల్త్ డే**

అంతకుముందు చేగుంట పిహెచ్సి, ధర్మారం పి హెచ్ సి లలో వరల్డ్ హెల్త్ డే సందర్భంగా హెల్త్ క్యాంపు నిర్వహించి గ్రామస్థులతో మాట్లాడారు. పీహెచ్సీ సేవలపై ప్రజలను తెలుసుకున్నారు. ఆరోగ్యం కాపాడు కోవాలని అనర్థాలకు తీయకుండా పడాలని వివరించారు.

# బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ అమ్మకం

- పట్టుకున్న ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ వసంత్ కుమార్



**గూడూరు, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** మహాలక్ష్మి ఏజెన్సీ గ్యాస్ ఖానాపూర్ మండలం వరంగల్ జిల్లాకు సంబంధించిన డెలివరీ బాయ్ సతీష్ మంగళవారం ఉదయం సుమారు 9:30 గంటలకు టాటా ఏసీ ట్రాలీ నెం.ఏపీ36 టీబీ 3767 వాహనంలో మొత్తం 32 గ్యాస్ సిలిండర్లు (17 ఫుల్, 15 ఖాళీ, బతుకమ్మ ఘాట్ నెక్కొండ రోడ్ గూడూరు నందు 5 సిలిండర్లు కస్టమర్స్ కి కాకుండా బయట బ్లాక్ మార్కెట్ నందు అమ్ముతుండగా ఎన్ఫోర్స్మెంట్ సీఐ వసంత్ కుమార్ రెడ్ హ్యాండెడ్ పట్టుకుని డిప్యూటీ తహసీల్దార్ (సీస్), మహబూబా బాద్‌కు అప్పగించారు. తదుపరి విచారణలో టాస్కోఫోర్స్ ఓఎస్డి ప్రభాకర్, లక్ష్మారెడ్డి, సీఐ వసంత్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ (సీస్),గూడూరు ఎస్ఐ గిరిధర్ రెడ్డి, కేసు నమోదు చేసి గ్యాస్ సిలిండర్లను తగు భద్రత నిమిత్తం రాజ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, కేసముద్రంకు కలెక్టర్ (సీస్) గతదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సేఫ్ కస్టడీకి అప్పగించడం జరిగిందని తెలిపారు.

# పల్లె ప్రగతి వనం నీలగిరి చెట్లు అమ్ముకున్నారు

- సర్పంచ్, కార్యదర్శిపై ఎంపిడిఓకు ఫిర్యాదు



**కౌటాల ఏప్రిల్ 07 (జనంసాక్షి) :** గతంలో పల్లె ప్రకృతి వనంలో నాటిన నీల గిరి చెట్లను సర్పంచ్, కార్యదర్శి అమ్ముకున్నారని ఎంపిడిఓ కు పిర్యాదు చేసిన గ్రామస్తులు. మండలంలోని కనికి గ్రామ పంచాయతీకి చెందిన పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం లో ఉపాధి హామీ పథకంలో కూలీల చేత గత ప్రభుత్వం లో 3ఎకరాల విస్తీర్ణం లో నీల గిరి చెట్లు నాటారు. స్థానికంగా ఉన్న సర్పంచ్, కార్యదర్శి ప్రజలకు తెలియ కుండ చెట్లను ఒక ప్రయివేట్ వ్యక్తికి అమ్ముకున్నారని మంగళవారం రోజున మండల ఎంపిడిఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీల గిరి చెట్ల విలువ సుమారుగా 2లక్షల 50వేలు ఉంటుందని దీనిపై విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పనులు చేయకున్నా జీతాలు ఇస్తున్నారని వాటిపై కూడా విచారణ చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తది తరులు పాల్గొన్నారు..

# వైద్య సేవలు మెరుగుపడుతున్నాయి

- ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డా.పాల్వాయి హరీష్ బాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ జిల్లాలో వైద్యసేవలు మెరుగు పడుతున్నాయని, డాక్టర్లు, వైద్య సిబ్బంది ఇంకా శ్రమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో సిజేరియన్ సెక్షన్లు చేస్తున్నామని, అత్యవసర సేవలు కూడా మెరుగుపడాలని సూచించారు. కాగజ్ నగర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని శరవేగంగా పూర్తి చేయనున్నామని తద్వారా సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ, డీఎంఎచ్ఓ సీతారాం, డీడబ్లూఓ భాస్కర్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, మార్కెట్ కమిటి చైర్మన్ ఇరుకుల్ల మంగ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.సుభోద్, డాక్టర్లు, అంగన్వాడీ ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

# ఇసుక డీడీ ధరలు తగ్గించి ట్రాక్టర్ యజమానులను ఆదుకోవాలి

- కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07(జనంసాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఇసుక డీ.డీ. ధరలను తగ్గించి, ట్రాక్టర్ యజమానులను ఆదుకోవాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ మంగళవారం ఆసిఫాబాద్ ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లాలో ఇసుక డీడీ ధర రూ.400 మాత్రమే ఉండగా, ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రం రూ. 775 వసూలు చేయడం అన్యాయమన్నారు. పెరిగిన డీజిల్ ధరల దృష్ట్యా పాత ధరలతో ఇసుక సరఫరా చేయడం ట్రాక్టర్ యజమానులకు భారంగా మారిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సామాన్య ప్రజలకు తక్కువ ధరకే ఇసుకను అందించేందుకు ఆసిఫాబాద్ పట్టణంలో 'ఇసుక బజార్' నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ధరల తగ్గింపు,ఇసుక బజార్ ఏర్పాటుపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గర్భిణీల సంక్షేమమే లక్ష్యం

- మాతా-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- వైద్యులు రోగులకు సమయానికి అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 7(జనంసాక్షి):** గర్భిణీల సంక్షేమమే లక్ష్యంగా వైద్యులు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం, జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్ పరిధిలో గల మాతా - శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీ విభాగాన్ని తనిఖీ చేసి, ఓపీ సేవలను మరింతగా మెరుగుపరచాలని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను స్వయంగా పరిశీలించి, గర్భిణీలకు చేయించే వ్యాయామం సరిగా నిర్వహించాలన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలతో లికలెక్టర్‌లి మాట్లాడి, ఎక్కడ నుంచి వచ్చారు? ఎలా ఉంది? హీమోగ్లోబిన్ ఎంత ఉంది? ఆసుపత్రిలో అందిస్తోన్న ఆహారం బాగుందా? ఏం ఇస్తున్నారు? సమయానికి మందులు అందిస్తున్నారా? అని వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గర్భిణీలు క్రమం తప్పకుండా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

# డైట్ మెనూ కచ్చితంగా అమలు చేయాలి

- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 17(జనం సాక్షి):** మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లాలోని తొర్రూరు పట్టణ కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల)ప్రీ మెట్రిక్ , పోస్ట్ మెట్రిక్ అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, హెల్త్ సెంటర్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు,.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో తరగతి గదులు, డార్మెంటరీ, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, టాయిలెట్స్, పరిసరాలను పరిశీలించి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం కల్పించే పక్కా డైట్ మెనూ ను కచ్చితంగా అమలు చేయాలని, నాణ్యమైన వేడివేడి ఆహార పదార్థాలను అందించాలని, భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ భోజనం, టిఫిన్స్, స్నాక్స్ సిద్ధం చేయాలని, పిల్లలకు, వసతి గృహాలు పాఠశాలలో భోజనం సిద్ధం చేసే సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి అట్టి నివేదికలను సమర్పించాలని సంబంధిత వార్డెన్, ప్రిన్సిపల్ను ఆదేశించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలను క్రమం తప్పకుండా బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్ సమయాలలో సందర్శించి వారితో కలిసి భోజనం చేయాలని సూచించారు. ప్రతి విద్యా సంస్థ వసతి గృహాల లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన కి సంబంధిత శాఖ ప్రధాన అధికారి లేదా ప్రత్యేక అధికారి వద్దనే ఉండాలని, భోజనం, సౌకర్యం తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత వేసవికాలం నేపథ్యంలో విద్యార్థిని విద్యార్థులకు అన్ని ఏర్పాట్లను, సౌకర్యాలను కల్పించాలని తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, పిల్లల యొక్క హాజరు శాతం పూర్తిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన టెక్నాలజీ ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తరగతులను నిర్వహించి ఉత్తమ ఫలితాలను సాధించుటకు కృషి చేయాలని తెలిపారు. పిల్లల మానసిక, ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని విద్యతోపాటు క్రీడల్లో నైపుణ్యత ఉండే విధంగా ప్రతి విభాగం టీచర్ ముందుకు సాగాలన్నారు. అనంతరం అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ ను సందర్శించి ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్ రిజిస్టర్, తదితర రికార్డులను తనిఖీ చేశారు, హాస్పిటల్ పరిధిలోని సబ్ సెంటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా మెరుగైన వైద్యం ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే వారికి సేవలు అందించడం కోసం డాక్టర్స్ నిత్యం అందుబాటులో ఉండాలని, వేసవి ప్రభావం నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహిం చాలని, అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని మాత, శిశు మరణాలను జరగకుండా చర్యలు తీసుకోవా లని వైద్య సిబ్బంది పోలీస్ సంబం ధిత విభాగాలు నిత్యం ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. అక్రమ స్కానిం గ్‌లు, లింగ నిర్ధారణ పరీక్షలు నిబంధనలకు విరుద్ధంగా నడిచే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి ధైర్యం భరోసా కల్పిం చాలని తమ పరిధిలో ఉన్నటువంటి సేవలను వేగంగా అందించాలని సూచించారు. ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ వార్డు గ్రామస్థా యిలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ను మెయిం టైన్ చేయాలని, గర్భిణీ స్త్రీలను, చిన్న పిల్లలను ఇతర వ్యాధిగ్రస్తులను గమనిస్తూ ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, సాంఘిక సంక్షేమ శాఖ డిసిఓ జయశ్రీ, ప్రిన్సిపల్ రత్నమాల, హాస్పిటల్ డాక్టర్స్ సుగుణాకర్ రాజు, నందన దేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రాస్తారోకో



**పాలకుర్తి, ఏప్రిల్ 07(జనంసాక్షి) :** మండలంలోని గూడూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం, బీఆర్ఎస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రైతులు రాస్తారోకో చేశారు. పాలకుర్తి, స్టేషనఘన్పూర్ ప్రధాన రోడ్డుపై రైతులు బైటాయించగా వాహనాలు స్తంబించి పోగా, రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా రైతులు మాచెర్ల సారయ్య, మాజీ ఎఫ్ఎస్సీస్ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు గ్రామంలో 20 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారని తెలిపారు. పాలకుర్తిలో మార్కుఫెడ్ అధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన అధికారులు గూడూరులో కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గూడూరులో రైతులు ప్రైవేటు వ్యాపారులు రూ.1900 విక్రయిస్తుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కుఫెడ్ మొక్కజొన్నలను క్వింటాకు రూ.2400 కొనుగోలు చేస్తోందని అన్నారు. ఇప్పటికైన అధికారులు గూడూరులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు నక్క నాగన్న, పనికర చేరాలు, యాదయ్య, తోటకూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధన దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ప్రిన్సిపల్ కు సూచించారు. అనంతరం మండలంలోని పోచంపహాడ్ గ్రామం పరిధిలో మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి జాతీయ రహదారి 63 విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల పొట్టలు కొట్టి ప్రయివేటు వారికి టెండర్లు ఇవ్వద్దు

- ప్రైవేటు టెండర్ విధానాన్ని రద్దుచేసి టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలి
- చేనేత సంఘ మాజీ అధ్యక్షులు దిడ్డి రమేష్



**శాయంపేట, ఏప్రిల్ 7, (జనం సాక్షి) :** చేనేత కార్మికుల కడుపును కొట్టి ప్రైవేట్ వ్యక్తులకు అవకాశం ఇచ్చి రెక్కాడితే గాని డొక్కాడని చేనేత కార్మికులకు అన్యాయం చేయవద్దని శాయంపేట చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం మాజీ అధ్యక్షులు దిడ్డి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘ భవనం నుండి చేనేత కార్మికులతో ప్రధాన కూడలి వద్దకు ర్యాలీగా బయలుదేరి వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికులతో కలిసి తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ నారాయణ, తహసిల్దార్ ఆర్ ప్రవీణ్ కుమార్ లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్యాయం చేస్తూ కొత్తగా టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని,టెండర్ విధానం ద్వారా కార్మికులకు పని లేకుండా పోతుందని, కార్మికులు జీవనోపాధికరువై రోడ్డున పడే దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. గతంలో చేనేత కార్మికులు తయారుచేసిన లివరీ టవల్స్, బెడ్ షీట్స్, పాలిస్టర్ షర్టింగ్ వస్త్రాలను డిస్కో ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేదని, వాటిని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలకు అందజేసే వారిని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్మికులు తయారు చేసిన వస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం టెస్కో ద్వారానే కొనుగోలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల చేనేత కార్మికులు జీవనోపాధి కూలిపోయి రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని, ఉపాధి కోల్పోవడంతో కార్మికుల ఆకలి చావులు చూడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పునర్ ఆలోచించి టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్మికులు తయారుచేసిన వస్త్రాలను టెస్కో ద్వారా ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేసే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కుసుమ శరత్, మత్స్యగిరి స్వామి దేవాలయం చైర్మన్ సంఘ మాజీ డైరెక్టర్ సామల బిక్షపతి, వడ్డేపల్లి శ్రీనివాస్, వనం దేవరాజు, బూర లక్ష్మీనారాయణ, దాసరి సమ్మయ్య, పూల ఐలుమల్లు, మామిడి భాస్కర్, బాసని విద్యాసాగర్, నవీన్, దాసరి రమేష్, మహిళా కార్మికులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



**బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్ట ణంలోని జిల్లా పరిషత్ బ్రాంచి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కొల్లూరి రాజేష్ (15) మంగళవారం తాళ్ల గురిజాల శివారులోని కుంటలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్ళాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా ఈఎంటీ దుర్గం కిష్టయ్య, పైలెట్ ఒద్ది రాజేశం మృత దేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# ఉద్యోగాల పేరిట మోసం

- యువకుడి అరెస్టు..

**చెన్నారావుపేట, ఏప్రిల్ 7 (జనం సాక్షి):** ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని భోజేర్వు గ్రామానికి చెందిన బోళ్ల సుజిత్, శ్రీకాంత్, భూపాలపల్లి జిల్లా మొరంచపల్లికి చెందిన జల్ల చందు, శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన కర్రు నాగరాజులు హనుమకొండలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉద్యోగాల కోసం వివిధ పోటీ పరీక్షలను రాస్తూ సిద్ధమవుతున్నారు. కర్రు నాగరాజు తనకు తెలిసిన ప్రభుత్వ అధికారులు ఉన్నారని తమకు ప్రభుత్వ ఉద్యోగాలు తప్పకుండా ఇప్పిస్తానని బోళ్ల సుజిత్, శ్రీకాంత్, జల్ల చందులను నమ్మించి రూ. 4 లక్షలు తీసుకుని మోసం చేశాడు. బోళ్ల సుజిత్ ఫిర్యాదు మేరకు కర్రు నాగరాజు పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

# కల్లెడలో ఎర్రి కుక్క దాడి

- యువకుడి వేళ్లు తెగిపోవడంతో కలకలం..

**పర్వతగిరి, ఏప్రిల్ 07 ( జనం సాక్షి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మం డలం కల్లెడ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిరుత సతీష్ ఉదయం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి స్నానం చేస్తుండగా, అకస్మాత్తుగా ఒక ఎర్రి కుక్క అతనిపై దాడి చేసింది. కుక్క ఒక్కసారిగా సతీష్ కుడి చేయి భుజాన్ని బలంగా కొరికింది. దాడితో కిందపడిపోయిన సతీష్‌పై మరింత ఉగ్రంగా విరుచుకుపడిన కుక్క, ఎడమ చేయి ఉంగరపు వేలిని గట్టిగా కొరికి తెంచేసింది. దీంతో వేలు పూర్తిగా తెగి కిందపడిపోయింది. సతీష్ అరుపులు విన్న గ్రామస్తులు, యువకులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను అత్యవసరంగా సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో భయం నెలకొంది. మరొకరు కుక్క కాటుకు బలి కాకూడదనే ఉద్దేశంతో గ్రామస్తులు ఆ ఎర్రి కుక్కను వెతికి చంపినట్లు సమాచారం. గ్రామంలో తిరుగుతున్న ఎర్రి కుక్కల సమస్యపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

- జిల్లా డీసీహెచ్‌ఎస్ డా. రవి బాబు సారధ్యంలో ఏరియా ఆసుపత్రుల నిర్వహణ.
- భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు



**మణుగూరు, (జనంసాక్షి):** మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలు అందించి నందుకు గాను రాష్ట్రస్థాయిలో అవార్డు లభించాయి. మంగళవారం హైదరాబాదులోని రవీంద్ర భారతి జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా కొత్తగూడెం జిల్లాలోని ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు అవార్డులు అందుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి.

**ఉత్తమ సేవలకు:**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్‌ఎస్ డా.రవిబాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్ (టివివిపి) ఆసు పత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం.

**ఏరియా ఆసుపత్రులకు అవార్డులు:**

ఈ అవార్డులు అందుకున్న వారిలో సిహెచ్ సి పాల్వంచ కు చెందిన డా. శైలేష్ కుమార్ (సిఏఎస్–ఆర్థో), డా. పి. రామ్ ప్రసాద్ (డివైసిఎస్–అనస్తీషియా), ఏరియా హాస్పిటల్ భద్రాచలం డా.కృప విజయ్ (డివైసిఎస్ – పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి, ఏ బి ఏ ఎస్ సేవలలో ఎ.వెంకట రావు (98శాతం), అలాగే ల్యాబ్ సేవల విభాగంలో భద్రాచలం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ ఏరియా హాస్పిటల్ మణుగూరు నర్సింగ్ ఆఫీసర్ మానస , సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్-- ఏ. శారధ అవార్డులు అందుకున్నారు. అదనంగా భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు “బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా” విభాగంలో డీ సి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు మూడు అవార్డులు ఆయా సూపరింటెండెంట్లు భద్రాచలం రామ కృష్ణ, మణుగూరు గౌరీప్రసాద్, చర్ల సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు.. జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందగా, ఈ అవార్డులు గిరిజన ప్రజలకు అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచాయి ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ , హెల్త్ శ సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆరోగ్య శాఖ అధికారులు,డీ సి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు సూపరింటెండెంట్లు రామ కృష్ణ, గౌరీప్రసాద్, సాయి వర్ధన్ మానస శారద పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సేకరించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి):** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు,ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ ఇవ్వగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు.గ్రేడ్ ఏ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,389, కామన్ రకానికి క్వింటాలుకు రూ.2,369 గా ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని వివరించారు. ఐకేపీ ఆద్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న 136 కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. తూకం వేసే యంత్రాలు, తేమ శాతం చూపే యంత్రాలు, టార్ఫాలిన్లు, గన్ని బ్యాగ్స్ సరిపడా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు ఇతర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఏఈఓ ధృవీకరించిన తరువాత కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇట్టి శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ డీఎం నర్సింహారెడ్డి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# మద్యం సిండికేట్‌పై విజిలెన్స్ ఆరా

- వైన్స్ షాపులు తనిఖీ చేయని ఎక్సైజ్ శాఖ అధికారులు.
- వైన్స్ షాపుల తనిఖీలు చేయని ఎక్సైజ్ అధికారులపై పలు అనుమానాలు.?



**ఖమ్మం రూరల్ (జనంసాక్షి) :** సిండికేట్‌గా మద్యం దందా అనే కథనం “జనంసాక్షి” పత్రికలో ప్రచురితమైనా విషయం పాఠకులకు విధితమే. కానీ ఈ కథనంతో వైన్స్ షాపుల యజమానులు ముందస్తు జాగ్రత్తతో గ్రామలోకి మద్యం సరఫరా చేసే ఆటోలను నిలిపి వేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. అదేవిధంగా సిండికేట్‌గా మద్యం దందా అనే విషయం పై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. ఇదే విషయంపై వివరణ కోరెందుకు రూరల్ ఎక్సైజ్ శాఖ సీఐ బి.చంద్ర మోహన్‌ని ‘జనం సాక్షి’ దినపత్రిక విలేకరి పలుమార్లు చరవాణిలో సంప్రదించిన స్పందించకపోవడం పలు అనుమానాలకు తావుని స్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పాలి. నిన్న జరిగిన పరిణా మాలను దృష్టిలో పెట్టుకొని నేడు అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు మూకు మ్మడి దాడులు నిర్వహిస్తారో లేదో అని చూడాలని ప్రజలు వేచించుస్తున్నారు.

## 22వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల మంజూరుపై వినతి ఎమ్మెల్యే సానుకూల స్పందన



**భువనగిరి,(జనంసాక్షి):** 22వ వార్డు సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఈరోజు హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా 22వ వార్డు పరిధిలో సుమారు 300 మీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, వెంటనే సంబంధిత అధికా రులకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# వడి వడిగా అశ్వరావుపేట నియోజకవర్గ అభివృద్ధి

### షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**చంద్రుగొండ, (జనంసాక్షి):** అశ్వరావుపేట నియోజకవర్గం వడివడిగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో జిల్లా మంత్రులు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక దృష్టి సాధించటంతో అశ్వరావుపేట నియోజకవర్గం అభివృద్ధిలో ముందు పర్సలో ఉందని అశ్వరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే ఆదినారాయణ తెలిపారు. మంగళవారం చంద్రుగొండ మండలం అయ్యన్న పాలెం రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ తో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం అందే విధంగా నాయకులు అధికారులు దృష్టి సారించాలన్నారు. ఉచిత విద్యుత్తు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రూ 500 కే గ్యాస్ అందించడమే కాకుండా గ్రామాలలో సమస్యలను ప్రజల నుండి వచ్చిన వినతుల ప్రకారం సీసీ రోడ్ల నిర్మాణం గ్రావెల్ రోడ్ల నిర్మాణం లక్షలాది రూపాయలతో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్ రెవిన్యూ సిబ్బంది హౌసింగ్ ఏఈ వినయ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి బోజ్యానాయక్ నల్లమోతు వెంకటరమణ తుమ్మలపల్లి సురేష్ బడుగు కృష్ణవేణి సారేపల్లి శేఖర్ బోయిన భోగి కోటేశ్వరావు వివిధ పంచాయతీల సర్పంచులు ఇస్లావత్ రుక్మిణి కుంజ వెంకటేశ్వరరావు గుగులోతు బాబు, పద్మ, రామారావు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం




**హాలియా, మార్చి 7 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని హాలియా పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి ఆసుపత్రి సహకారంతో రెండు కిలోమీటర్ల పరుగును తులసి ఆసుపత్రి నుండి పురపాలక కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం పాల్గొన్న వారికి గుడ్లు, అరటిపండ్లు, మజ్జిగ వంటి పౌష్టికాహారం పంపిణీ చేశారు.అలాగే పురపాలక సంఘ ఆవరణంలో తులసి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వివిధ నిపుణ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి హాజరై మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న పురపాలక సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పురపాలక సంఘ అధ్యక్షుడు చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ యోగ, పరుగులు వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. రెండు కిలోమీటర్ల పరుగులో పాల్గొన్న వారందరికీ తులసి ఆసుపత్రి యాజమాన్యం మాలే సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ కే రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌని రాజా రమేష్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నారాయణ గౌడ్, వార్డు సభ్యులు, సలహాదారులు, పుర ప్రముఖులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## బాధితుడి వద్దకే వెళ్లి ఫిర్యాదు నమోదు

**వలిగొండ, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేయడం పోలీస్ శాఖ బాధ్యత అని మరోసారి నిరూపితమైంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వెళ్లి ఫిర్యాదు నమోదు చేసిన ఘటన వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం సుమారు 11:00 గంటల సమయంలో ఏమో తుర్కపల్లి గ్రామానికి చెందిన ఉడుత నరసింహ అనే వ్యక్తి తనను తన గ్రామానికి చెందిన మర్రి చంద్రయ్య అనే వ్యక్తి కర్ర తో కొట్టగా, గాయపడిన అతను స్థానిక రేణుకా దేవి హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా హాస్పిటల్ వారు ఎంఎల్‌సి కోసం పోలీస్ స్టేషన్‌కు సమా చారం ఇవ్వగా అతను పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వలేని పరిస్థితిలో ఉండగా వెంటనే వలిగొండ ఎస్.ఐ. యుగేందర్ ఆదేశాల మేరకు, ఏఎస్ఐ జాఫర్, టెక్ టీమ్ కానిస్టేబుల్స్ అనిల్, శంకర్, మహిళ కానిస్టేబుల్ సింధు తో పాటు సంఘటన స్థలానికి స్వయంగా వెళ్లి బాధితుడిని పరామర్శించి, అతని నుండి ఫిర్యాదును స్వీకరించారు. బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్–సైట్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి, కేసును బి ఎన్ ఎస్ చట్టం ప్రకారం నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నా కూడా ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అవసరమైన సందర్భాల్లో పోలీసులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారు. ఈ సంఘటన పోలీసులు ప్రజలకు ఎంత దగ్గరగా ఉన్నారో, ప్రజల సమస్యలను ఎంత బాధ్యతగా తీసుకుంటారో చూపించే మంచి ఉదాహరణగా నిలిచింది.



# సేవా శిఖరానికి ‘దళితరత్న’






**కోటపాటి రుక్మారావుకు పురస్కారం**

**ఖమ్మం, (జనంసాక్షి) :** అక్షరమే ఆయుధంగా, పేదరికంపై పోరునే శ్వాసగా మలచుకుని, అణగారిన వర్గాల ఆశల దీపమై వెలుగుతున్న కోటపాటి రుక్మారావు సామాజిక ప్రస్థానానికి రవీంద్రభారతి వేదికగా ఘన నీరాజనం లభించింది. ఏకంగా ఒకటిన్నర దశాబ్ద కాలంగా వసతిగృహ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతూ, దళిత విద్యా వికాసమే ధ్యేయంగా సాగుతున్న ఆయన నిరంతర సేవాయజ్ఞం, ప్రతిష్టాత్మకమైన “దళితరత్న” పురస్కారమై మెరిసింది. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఆదివారం రాత్రి జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి ఉత్సవాల్లో అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, కార్యక్రమ నిర్వహణ బాధ్యుల చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్న వేళ, ఆ ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. సేవను అలంకాం ంగా కాక, ఒక పవిత్ర బాధ్యతగా భావించి, యువతలో విలువల విత్తనాలు నాటుతున్న రుక్మారావు కృషి అనన్యసామాన్యమైనదని ఆయన కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తోడ్పడే ఇలాంటి అరుదైన వ్యక్తులను గుర్తించి గౌరవించడం, నవ సమాజ నిర్మాణానికి దిక్సూచి వంటిదని అభివర్ణించారు. పురస్కారాన్ని స్వీకరించిన వేళ రుక్మారావు కళ్లలో మెరిసిన తృప్తి, వెలువడిన వినమ్రత అందరి హృదయాలను హత్తుకుంది. ఈ గౌరవం నా సేవకు ముగింపు కాదని, మరింత నిబద్ధతతో ముందుకు సాగడానికి లభించిన ఒక నూతన ఉత్తేజం అన్నారు. రుక్మారావు ఆయన మాటలు అంకితభావానికి నిలువుటద్దం పట్టాయి. నిర్వాహకులు సుదర్శన్ బాబు మాట్లాడుతూ 15 ఏళ్లుగా దళిత విద్యార్థులకు రుక్మారావు అందిస్తున్న సేవలను పరిగణలోకి తీసుకొని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వివరించారు. సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఆయన సేవలు మరువలేనిమన్నారు. ఈ వేడుకలో జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, సూపర్డెంట్ అలీముద్దీన్, బాలసాని రెడ్డి, ఏఎస్సిడిఓ మోహన్, పలువురు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల రాష్ట్ర బాధ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని రుక్మారావును అభినందనల జల్లులో ముంచెత్తారు. పదిమందికి వెలుగునిచ్చే సేవకు కాలం అందించిన అక్షర నీరాజనం ఈ దళితరత్న పురస్కారమని కొనియాడారు.

# ప్రతి దాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



ఎమ్మెల్యే మందుల సామెల్

**తుంగతుర్తి, (జనంసాక్షి):** కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకువచ్చిన ప్రతి ధాన్యపు గింజలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామెల్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ప్రతి పక్షాలు తట్టుకోలేక రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డును అందించలేదని విమర్శించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రెండో విడతలు మరింత మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించను న్నట్లు తెలిపారు. రైతులు గిట్టుబాటు ధర పొందాలంటే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందించే ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2369 మద్దతు ధర పొందాలని అన్నారు.దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నీడ,నీటి వసతి తోపాటు ఓప్రతి దాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందిఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు సకాలంలో అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, సత్యం తాహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ బాబు, కోపరేటివ్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఎస్ కే బడే సాబ్, సొసైటీ సీఈవో యాదగిరి,తుంగతుర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి,మద్దిరాల, నూతనకల్, నాగారం, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దొంగరి గోవర్ధన్,అవిల మల్లు, తోడుసు లింగయ్య, నాగం సుధాకర్ రెడ్డి, జిల్లా నాయకులు రేగటి రవి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బికోజి,తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు యాదవ్, మాచర్ల అనిల్, కొండ రాజు, పెద్ద బోయిన అజయ్, గంగరాజు,పచ్చిపాల సుమతి,దాయం ఝాన్సీ రాజిరెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలను నాయకులు యువజన నాయకులు, పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని కలిసిన బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు

### యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు బార్ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ



**భువనగిరి, (జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నిసంగి విద్యా సాగర్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆకాంక్ష యాదవ్‌ను ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు నిసంగి విద్యా సాగర్ మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించేలా పోలీస్ శాఖ సమన్వయం పెంచాలని ఎస్పీని కోరారు. ప్రజలకు న్యాయం త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెడబోయిన యాదగిరి, కార్యవర్గ సభ్యుడు గడ్డం శ్రీనివాస్, గోద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




## కేరళలోని 2 ఆలయాలకు అనంత్ అంబానీ
# భూరి విరాళం

ముంబయి: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ గొప్ప మనసు చాటుకున్నారు. కేరళలోని ప్రముఖ దేవాలయాలైన రాజరాజేశ్వరం, గురువాయూర్ ఆలయాలకు రూ.3 కోట్లు చొప్పున మొత్తం రూ.6 కోట్లు విరాళం ప్రకటించారు. ఇటీవల ఈ రెండు ఆలయాలను సందర్శించిన సందర్భంగా ఈ విరాళాలు ప్రకటించారు. దీనికి అదనంగా చారిత్రక ప్రాముఖ్యత కలిగిన రాజరాజేశ్వరం ఆలయ తూర్పు గోపురం సహా ఆలయ సమగ్ర పునరుద్ధరణకు రూ.12 కోట్లు కేటాయించారు. గురువాయూర్ ఆలయంలో ఏనుగుల సంక్షేమానికి తనవంతు సాయం ప్రకటించారు.ఏప్రిల్ 2న సాయంత్రం 8 గంటల ప్రాంతంలో తలిపరంబలోని చారిత్రక రాజరాజేశ్వరం ఆలయాన్ని అనంత్ అంబానీ సందర్శించారు. ఆలయ సంప్రదాయాలు పాటిస్తూ అశ్వమేధ నమస్కారం చేశారు. ఆలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులకు రూ.3 కోట్లు చెక్కును ఆలయ అధికారులకు అప్పగించారు. మెరుగైన పార్కింగ్ సహా ప్రాచీన తూర్పు గోపురం పునరుద్ధరణకు మరో రూ.12 కోట్లు అందించనున్నట్లు ప్రకటించారు. ఆలయానికి విచ్చేసిన అనంత్ అంబానీకి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.అదే రోజు సాయంత్రం 5 గంటలకు గురువాయూర్ ఆలయాన్ని అనంత్ అంబానీ సందర్శించారు. గురువాయూరప్పన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టుకు రూ.3 కోట్ల విరాళం ప్రకటించారు. వంతారా ద్వారా జంతు సంరక్షణకు పాటుపడుతున్న అనంత్ అంబానీ.. గురువాయూర్‌లోనూ ఆలయ ఏనుగుల సంక్షేమానికి కూడా సాయం అందిస్తానని ప్రకటించారు. ఏనుగుల కోసం ఆసుపత్రి, గొలుసులు లేని షెల్టర్, ఆధునిక మౌలిక సదుపాయాలతో వన్యప్రాణులకు సంరక్షణ అందించే బాధ్యతను తీసుకుంటానని ప్రకటించారు. ఆలయ అధికారులు అనంత్ అంబానీకి శాలువ కప్పి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయాలు అనేవి కేవలం ఆరాధనా స్థలాలు మాత్రమే కాదని, మనలో విశ్వాసం, కరుణ, ప్రకృతితో మమేకం చేసే కేంద్రాలని అనంత్ అంబానీ అన్నారు. ఈ పవిత్ర వారసత్వాన్ని భవిష్యత్ తరాల కోసం కాపాడి, బలోపేతం చేయడం మనందరి బాధ్యత అని అన్నారు.



# నాలుగోరోజూ లాభాల్లో సూచీలు..

### 23వేల ఎగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో ఉదయం ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోయింది. మధ్యాహ్నం తర్వాత సీన్ మారింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్ సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. సెన్సెక్స్ ఉదయం 73,734.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,106.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,282.41 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత పుంజుకొని 509.73 పాయింట్ల లాభంతో 74,616.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 155.40 పాయింట్ల లాభంతో 23,123.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్స్ లాభపడ్డాయి. ఇండిగో, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ట్రెంట్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4663 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పీ, జపాన్ నిక్కీ, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ రాణించాయి.

# ఎయిరిండియా సీఈఓ విల్సన్ రాజీనామా..!



టాటా గ్రూప్‌నకు చెందిన దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారు. మరో ఏడాది పదవీ కాలం ఉండగానే తన బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆయన రాజీనామాను ఎయిరిండియా ధ్రువీకరించింది. విల్సన్‌పై టాటా గ్రూప్ పెద్దలు అసంతృప్తిగా ఉన్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ 2022 జులైలో ఎయిరిండియాలో చేరారు. ఆయన పదవీకాలం 2027 జూన్‌తో ముగియనుంది. ఆయన నేతృత్వంలోనే ఎయిరిండియాలో విస్తారా విలీనమైంది. అయితే, సంస్థ సేవల్లో నాణ్యత, సమయపాలనలో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. దీనికితోడు గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాదంతో విల్సన్ నాయకత్వంపై వ్యతిరేకత మొదలైంది. ఆ సమయంలో ప్రభుత్వ అధికారులు కూడా విల్సన్‌ను పక్కనపెట్టి నేరుగా టాటా గ్రూప్ పెద్దలతో మాట్లాడటం చర్చకు దారితీసింది. దీంతో ఆయనకు కంపెనీ ఉద్వాసన పలకనున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.ఈ క్రమంలోనే ఎయిరిండియా సీఈవో పదవి కోసం టాటా గ్రూప్ కొత్త వ్యక్తిని అన్వేషిస్తున్నట్లు ఈ ఏడాది మార్చిలో కథనాలు వెలువడ్డాయి. అమెరికా, యూకేకు చెందిన రెండు ప్రముఖ విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడినట్లు వాటి సారాంశం. ఈనేపథ్యంలోనే తాజాగా విల్సన్ తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరోవైపు, ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ కూడా ఇటీవలే పదవి నుంచి దిగిపోయారు.

ఇదే సరైన సమయం: విల్సన్

ఎయిరిండియాకు రాజీనామాపై విల్సన్ స్పందించారు. ఈ మేరకు ఉద్యోగులకు లేఖ రాశారు. ఎయిరిండియా తదుపరి దశ అభివృద్ధి కోసం బాధ్యతలను మరొకరికి అప్పగించడానికి ఇదే 'సరైన సమయం' అని ఆయన పేర్కొన్నారు. ఆరు నెలల పాటు ఆయన నోటీసు పీరియడ్‌లో ఉంటారు.



## ఐటీలో మూలాల నుంచే ప్రక్షాళన

**న్యూఢిల్లీ:**ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న ఉద్యోగాల కోతకు కాలానుగుణ మార్పులు – ఆర్థిక కారణాలే కాం ణం కాదని, మూలాల నుంచే ప్రక్షాళన జరుగుతోందని టీమ్‌లీజ్ డిజిటల్ సీఈఓ నీతి శర్మ తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో తక్కువ మంది సిబ్బందితోనే, కంపెనీలు అధిక ఉత్పాదకత సాధిస్తున్నాయని.. ఇందు వల్లే అధిక నైపుణ్యాలు కలిగిన వారిని నియమించుకు నేందుకు, కొనసాగించేందుకు మొగ్గుచూపుతున్నాయని పేర్కొన్నారు. టెక్ రంగంలో ప్రస్తుత పరిణామాలపై ఆమె పంచుకున్న అభిప్రాయాలు, విశ్లేషణలు ఇలా ఉన్నాయి..అప్పుడు అధిక నియామకాలు.. ఇప్పుడు కోతలు : 'ఉద్యోగాల కోతకు సంబంధించి ట్రాకింగ్ చేసే 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' గణాంకాల ప్రకారం 2026లో ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 70కి పైగా టెక్ కంపెనీలు 40,480 మంది ఉద్యోగులను తొలగించాయి. కరోనా పరిణామాల్లో ఒక్కసారిగా లభించిన గిరాకీకి అనుగుణంగా కంపెనీలు నియామకాలు అధికంగా చేపట్టాయి. ఇప్పుడు ఐటీ వ్యయాల్లో వృద్ధి 5 - 6 శాతానికి మందగించడంతో, ఉద్యోగులందరికీ పని ఉండటం లేదు. ఏఐ వల్ల: ఏఐ వల్ల తక్కువ మందితోనే అధిక పని చేయగలుగుతున్నారు. కోడింగ్, సపోర్ట్ వంటి విభాగాల్లో దీనివల్ల 10– 30% ఉత్పాదక లాభాలు కనిపిస్తున్నాయి. వినియోగదారుల సేవా రంగంలో 14–15%, కొన్ని రకాల కోడింగ్, రైటింగ్ వంటి పనుల్లో 40% మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ఇంకా చాలా సంస్థలు ఏఐ వినియోగంలో ప్రాథమిక దశలోనే ఉన్నందున, దీనిద్వారా వచ్చే ఆదాయంపై స్పష్టమైన ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి.ఉద్యోగ భద్రతపై ఆందోళన: దిగ్గజ సంస్థల్లోనూ భారీ లేఆఫ్స్ కారణంగా, 60 శాతానికి పైగా టెక్ ఉద్యోగులు తమ వృత్తిజీవితంపై ఆందోళన చెందుతున్నారు. ఒరాకిల్, గూగుల్, మెటా వంటి సంస్థల్లో జరుగుతున్న 'నిర్దాక్షిణ్య తొలగింపులు' ఐటీ నిపుణుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

## విదేశీ ప్రయాణాలకూ 'డిజియాత్ర'!

ముఖ గుర్తింపు సాంకేతికత ఆధారంగా, విమానాశ్రయాల్లోకి ప్రవేశాన్ని సులభతరం చేసేందుకు అమలు చేస్తున్న 'డిజియాత్ర' ప్లాట్‌ఫామ్‌ను అంతర్జాతీయ ప్రయాణాలకూ విస్తరించనున్నారు.ప్రస్తుతం దేశీయ ప్రయాణాలు చేసేవారికే ఈ సేవ అందుబాటులో ఉంది. దేశీయంగా 38 విమానాశ్రయాల్లో డిజియాత్ర సేవలు అందుబాటులో ఉండగా, మూడో అంచె నగరాలకూ విస్తరించనున్నట్లు డిజియాత్ర సీఈఓ సురేశ్ ఖడక్‌భావి తెలిపారు. మరిన్ని విమానాశ్రయాలకు ఈ సేవను విస్తరిస్తూనే, అంతర్జాతీయ ప్రయాణికులకూ అందుబాటులోకి తేవాలని అనుకుంటున్నట్లు చెప్పారు.బెంగళూరు– దోహా లాంటి మార్గాల్లో ఎలక్ట్రానిక్ పాస్‌పోర్టుల ద్వారా ఇంటర్‌ఆపెరబిలిటీని పరిశీలించేందుకు, సాంకేతిక పరీక్షలను కూడా డిజియాత్ర ఇప్పటికే నిర్వహించిందని తెలిపారు. 'ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయం దగ్గర ఏవైతే గుర్తింపు ధ్రువీకరణ వివరాలను పంచుకుంటారో.. వాటినే తమ గమ్యస్థాన విమానాశ్రయంలోనూ వాడొచ్చు. అయితే అంతర్జాతీయ ప్రమాణాలు, ద్వైపాక్షిక ఒప్పందాలపై ఇది ఆధారపడి ఉంటుంద'ని సురేశ్ తెలిపారు. డిజియాత్రలో నమోదుకు ఇప్పటివరకు ఆధార్ వివరాలను వినియోగిస్తుండగా, ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌ల ద్వారా కూడా నమోదు చేసే విధానాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు.




## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,38,350 (22 క్యారెట్లు) | ₹ 1,50,930 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,55,000

# శత్రువుల చేతికి చిక్కకుండా...

### చోర.. ధీర... అమెరికా, ఇరాన్‌ల రివర్స్ ఇంజినీరింగ్



**న్యూఢిల్లీ:**ఇరాన్ భూభాగం దిగిన ఎఫ్–15 పైలట్‌ను రక్షించే క్రమంలో దెబ్బతిన్న రెండు సి–130జె రవాణా విమానాలను అమెరికా బలగాలు పూర్తిగా ధ్వంసం చేశాయి. ఇందులోని కీలక పరిజ్ఞానాలు టెహ్రాన్ చేతిలో పడకూడదన్న ఉద్దేశంతో ఈ అసాధారణ చర్యకు పూనుకున్నాయి. అధునాతన టెక్నాలజీ, సెన్సర్లతో కూడిన ఈ లోహవిహంగాలు ఇరాన్ చేతిలో పడితే.. వాటిని రివర్స్ ఇంజినీరింగ్ ద్వారా ఆ దేశం అక్రమంగా అనుకరించే ప్రమాదం ఉందన్నది అగ్రరాజ్య ఆందోళన! అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకొనే అమెరికా కూడా ఈ చోరకళను అందిపుచ్చుకొని ఇరాన్ డ్రోన్లను కాపీ కొట్టడం విశేషం! ఒక సంస్థ లేదా దేశం తయారుచేసిన ఉత్పత్తిని లోతుగా పరిశీలించడం ద్వారా అక్రమంగా దాని నకలును సృష్టించడాన్ని రివర్స్ ఇంజినీరింగ్‌గా పేర్కొంటారు. భారీ వ్యయ ప్రయాసలకోర్చి ఉత్పత్తులను తయారుచేయాల్సిన అవసరాన్ని ఇది తప్పిస్తుంది.

ఇరాన్ దిట్ట:రివర్స్ ఇంజినీరింగ్‌లో ఇరాన్‌ది అందెవేసిన చేయి. ఆ దేశంలో సమర్థ ఆయుధ పరిశ్రమ ఉంది. దీన్ని చాలావరకూ అమెరికన్, ఇజ్రాయెలీ, జర్మన్ పరిజ్ఞానాలను రివర్స్ ఇంజినీరింగ్ చేయడం ద్వారా సాధించినట్లు చెబుతారు. ఇందులో డ్రోన్లు (ఆర్‌క్యూ–170, షాహిద్ శ్రేణి), క్షిపణులు, నౌకాదళ ఆయుధాలు ఉన్నాయి. వివిధ సందర్భాల్లో ఆయా దేశాల నుంచి స్వాధీనం చేసుకున్న లేదా అక్రమంగా సంపాదించిన ఆయుధాలను తన వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా ఇరాన్ మార్చుకుంటోంది. అమెరికా నుంచి చేజిక్కించుకున్న ఆర్‌క్యూ–170 డ్రోన్ ఆధారంగా షాహిద్–191 డ్రోన్‌ను ఇరాన్ తయారుచేసింది. అలాగే.. ఇజ్రాయెలీ హార్పీ లాయిటరింగ్ మ్యునీషన్లను చూసి షాహిద్–136 డ్రోన్లను రూపొందించింది. మాతృకలతో పోలిస్తే చాలా చౌకలో, పెద్ద సంఖ్యలో వీటిని ఉత్పత్తి చేసే సత్తాను సాధించింది. తాజా యుద్ధంలో సాంకేతిక లోపం కారణంగా పేలని క్షిపణులు, బాంబులను ఇరాన్ స్వాధీనం చేసుకుంది. వీటిని తెరిచి, అందులోని పరిజ్ఞానాలను అనుకరించే అవకాశాలు ఉన్నాయి. ఆయుధాల కోసం విదేశాలపై ఆధారపడే పరిస్థితిని రివర్స్ ఇంజినీరింగ్ ద్వారా ఇరాన్ తగ్గించుకుంది. ఈ క్రమంలో చౌకైన ప్రత్యామ్నాయాలను సృష్టించుకుంది. అమెరికా సైతం..:అమెరికా ఆయుధాలు అధునాతన పరిజ్ఞానాలమయం! వాటి ధర చాలా ఎక్కువగా ఉంటుంది. సమర్థ వైమానిక దళం లేని ఇరాన్ ప్రధానంగా క్షిపణులు, డ్రోన్లపై ఆధారపడుతోంది. ప్రధానంగా షాహిద్ డ్రోన్లను నమ్ముకుంటోంది. వీటి ప్రభావాన్ని గమనించిన అమెరికా కూడా తన సహజతీరుకు భిన్నంగా చౌకైన ప్రత్యామ్నాయం వైపు మొగ్గింది. ఇరాన్‌కు చెందిన షాహిద్–136 డ్రోన్‌ను అనుకరిస్తూ లూకాస్ (లో–కాస్ట్ అన్‌క్రూడ్ కంబాట్ ఎటాక్ సిస్టమ్) అనే చౌకైన డ్రోన్‌ను తయారుచేసింది. దీని ధర 35వేల డాలర్లు. డిజైన్‌పరంగా ఇది



షాహిద్–136ను పోలి ఉంటుంది. రెండు రకాల డ్రోన్ల రెక్కల వెడల్పు ఒకేలా ఉండటం గమనార్హం. 50 కోట్ల డాలర్ల వ్యయం :ఇరాన్ భూభాగంపై దిగిన పైలట్, వెపన్స్ ఆఫీసర్‌ను రక్షించడానికి అమెరికా చేపట్టిన భారీ ఆపరేషన్‌కు అయిన ఖర్చు 50 కోట్ల డాలర్లపైమాటేనని నిపుణులు చెబుతున్నారు. ఈ ఆపరేషన్‌కు కారణం.. అమెరికా ఎఫ్–15ఈని ఇరాన్ కూల్చివేయడం! ఆ యుద్ధవిమానం ధర 10 కోట్ల డాలర్లు. సహాయ చర్యల్లో ఎ–10 థండర్‌బోల్ట్–2 జెట్‌లు, ఎంసీ–130జే కమాండో రవాణా విమానాలు, బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు, ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లు పాల్గొన్నాయి. వీటిలో కొన్ని దెబ్బతిన్నాయి. ఎగరలేని స్థితిలో ఉన్న రెండు సి–130జె విమానాలను అమెరికా బలగాలు ధ్వంసం చేయాల్సి వచ్చింది. ఒక్కోదాని విలువ 10 కోట్ల డాలర్లపైనే. రెండు ఎంహెచ్–6 లిటిల్ బర్డ్ హెలికాప్టర్లు కూడా దెబ్బతిన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒక్కోదాని ధర 75 లక్షల డాలర్లు. కొన్ని ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లను నేలకూల్చామని ఇరాన్ సైన్యం చెబుతోంది. ఒక్కో డ్రోన్ ధర 3 కోట్ల నుంచి 6 కోట్ల డాలర్ల మధ్య ఉంటుంది. ఈ ఆపరేషన్‌లో ఎ–10 వార్తాగ్ యుద్ధవిమానం కూడా దెబ్బతింది. ఇది కువైట్ గగనతలంలో కూలింది. పైలట్ సురక్షితంగా తప్పించుకున్నాడు. ఈ జెట్ ధర 2 కోట్ల డాలర్లు.

# 2030కి మరో 25 లక్షల ఉద్యోగాలు

ముంబయి: దేశీయ ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో 2030 నాటికి 20–25 లక్షల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఉద్యోగ కన్సల్టెన్సీ సంస్థ అడెకో ఇండియా అంచనా వేసింది. ఈ రెండు రంగాలు సామర్థ్య–ఆధారిత వృద్ధి దశలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొంది. కార్మిక శక్తిలో 30–35% మందికి నైపుణ్యాల పునఃశ్చరణ అవసరమని తెలిపింది. ఆసుపత్రులు, ఆయుష్, వృద్ధుల సంరక్షణ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డయాగ్నొస్టిక్స్, టెలిమెడిసిన్, క్లినికల్ పరిశోధన, పబ్లిక్ హెల్త్ సిస్టమ్స్ వంటి రంగాల్లో నియామకాలు ఎక్కువగా స్పెషలైజేషన్, టెక్నాలజీ నైపుణ్యాలున్న వారికి లభిస్తాయని నివేదిక వివరించింది. 100 మందికి పైగా క్లయింట్ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు అడెక్కో తెలిపింది. విశ్వసనీయ మార్కెట్ పరిశోధన ఆధారాలు కూడా తోడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం..ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో వృద్ధి ఆర్థిక ప్రాబల్యంతో ముడిపడి ఉంటుంది. ఇది 2022లో జీడీపీలో 3.3 శాతంగా ఉండగా.. క్లినికల్ పరిశోధనా కార్యకలాపాలు, డిజిటల్ ఆరోగ్య స్వీకరణ, ఫార్మాస్యూటికల్ అభివృద్ధి, తయారీని ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం అవుట్‌సోర్సింగ్ చేయడం వంటి వాటి మద్దతుతో 2030 నాటికి 5 శాతానికి చేరుకుంటుందని అడెక్కో ఇండియా అంచనా వేసింది. డయాగ్నొస్టిక్స్, ప్రివెంటివ్ హెల్త్‌కేర్, టెలిమెడిసిన్ వంటివి రెండో, మూడో అంచె పట్టణాలకూ విస్తరిస్తుండటంతో వీటికి గిరాకీలో 20–25% పెరుగుదల ఉంటుంది. సంక్లిష్ట జనరిక్స్, స్పెషాల్టీ థెరపీల, బయోలాజిక్స్ వైపు జరుగుతున్న మార్పునకు అనుగుణంగా, అధునాతన ఆర్ అండ్ డీ, రెగ్యులేటరీ ఉద్యోగాల కోసం నియామకాలు 25–30% పెరుగుతాయి.నియామకాల్లో 65–70% బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, చెన్నై, దిల్లీ–ఎన్‌సీఆర్‌లలోనే కేంద్రీకృతమై ఉంటాయి. ఆసుపత్రి నెట్‌వర్క్‌లు, తయారీ క్లస్టర్‌లు, వికేంద్రీకృత డెలివరీ నమూనాల విస్తరణ మద్దతుతో పుణె, అహ్మదాబాద్, కోయంబత్తూర్ వంటి రెండో, మూడో అంచె నగరాల్లోనూ ఈ నియామకాలు క్రమంగా పెరుగుతున్నాయని అడెక్కో ఇండియా అసోసియేట్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ సేల్స్–పర్మనెంట్ రిక్రూట్‌మెంట్ పీయుష్ సప్రూ వెల్లడించారు.

## ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

- 9వ తేదీ నుంచి 29 వరకు అమలు
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5.00గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

## యూఏఈని ఎగతాళి చేసి.. భారత్‌పై విషం కక్కి

### పాక్ సెనెటర్ ప్రేలాపనలు

పాకిస్థాన్ చట్టసభ సభ్యుడు ముషాహిద్ హుస్సేన్ భారత్‌పై తనకున్న ద్వేషాన్ని మరోసారి బయటపెట్టారు. భారత్–యూఏఈ మధ్య పెరుగుతున్న సంబంధంపై మాట్లాడుతూ.. యూఏఈ కూడా మరో భారత్‌గా మారకుండా జాగ్రత్త పడాలంటూ ప్రేలాపనలు చేశారు. యూఏఈ చాలా బలహీనమైందని.. ఆ దేశంలో భారతీయులు అత్యధికంగా ఉన్నందున అక్కడి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఉచిత సలహా ఇచ్చారు. యూఏఈ అభివృద్ధిలో పాక్ పాత్ర చాలా ఉందంటూ ప్రగల్భాలు పలికారు. ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. యూఏఈ ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని చవిచూస్తోంది. దీంతో గతంలో పాక్‌కు ఇచ్చిన 3.5 బిలియన్ డాలర్ల (రూ.32 వేల కోట్లు) రుణాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా ఆ దేశం ఇటీవల ఇస్లామాబాద్‌ను కోరింది. ఇప్పటివరకు యూఏఈ వద్ద తాము అప్పుగా తీసుకొన్న డబ్బు తిరిగి చెల్లిస్తామని పాక్ వెల్లడించింది. మార్చి 27 నాటికి పాక్ వద్ద 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. యూఏఈకి చెల్లించాల్సిన అప్పు మొత్తం ఆ దేశ విదేశీ మారక నిల్వల్లో సుమారు 18 శాతానికి సమానం. దీంతో పాకిస్థాన్ మరిన్ని ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆ దేశ సెనెటర్ యూఏఈపై ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇదీ చదవండి: కోమాలో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ..?

### ట్రంప్ డెడ్‌లైన్ వేళ.. ఇరాన్ 'కిరీటం'
# ఖర్గ్‌పై దాడులు

ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటు చేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టార్గెట్లపైనా అమెరికా–ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది. పర్షియన్ గల్ఫ్‌లో ఖర్గ్ ఒక చిన్న ద్వీపం. ఇరాన్ తీరానికి 25–30 కి.మీ దూరంలో ఉండే ఇది.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం. ఇరాన్ తమ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఇక్కడి నుంచే నిర్వహిస్తోంది. 1986 నుంచి ఇక్కడ విదేశీ పెట్టుబడులు పెరగడంతో.. ఇరాన్ ఇంధన ఎగుమతులకు కీలకంగా మారింది. కాగా.. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అగ్రరాజ్యం భారీగా బలగాలను మోహరించింది కూడా. అమెరికా భూతలదాడులకు దిగొచ్చన్న అంచనాలున్నాయి. వాటిని తిప్పికొట్టేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది.తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్–అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని..ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది. ఆయా దేశాలలోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని..చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది.



# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- పెండింగ్ కేసులపై సీపీ అంబర్ కిషోర్ ఝా సమగ్ర సమీక్ష
- వేగవంతమైన దర్యాప్తుకు ఆదేశాలు



**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు.దొంగతనాల నివారణ మరియు కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు.రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని,ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు,కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "అరైవ్-అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి,వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్ మరియు బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# వ్యాధులు రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి

- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెడికవర్‌లో ఆరోగ్య అవగహన కార్యక్రమం
- మన ఆరోగ్యం.. మనదే బాధ్యత : మెడికవర్ వైద్యులు



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 07 (జనంసాక్షి) :**
వ్యాది వచ్చిన తర్వాత బాధపడేకంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని మన ఆరోగ్యం మనదే బాధ్యతగా అనే బావనతో జీవనశైలిని మార్చుకోవాలని మెడికవర్ వైద్యులు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఆరోగ్య అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ... షుగర్, రక్తపోటు, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వంటి వ్యాధులు వచ్చినప్పుడు సోషల్ మీడియా పై ఆధారపడి స్వయంగా మందులు వాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. సరైన పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందడం అవసరమన్నారు. అలాగే మద్యం సేవించడం, పొగ త్రాగడం, డ్రగ్స్ వినియోగం, జంక్ ఫుడ్ తీసుకోవడం వంటి అలవాట్లను మానుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, పనిలో ఒత్తిడిని తగ్గించుకోవడం, మంచి నిద్ర ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. ప్రస్తుతం రోగాలు అరికట్టే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని అవసరాన్ని బట్టి వాటిని తీసుకోవాలని సూచించారు. ఇటీవల 100 మందిని పరీక్షిస్తే 80 మందికి కొలెస్ట్రాల్ సమస్య ఉంటుందని, వారు రెగ్యులర్‌గా చికిత్స పొందకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని గతంలో 40 సంవత్సరాలున్న జీవితకాలం ఇప్పుడు 75 సంవత్సరాలకు పెరిగిందని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో 25 మంది వివిధ స్పెషాలిటీల వైద్యులు సేవలందిస్తున్నారని వెల్లడించారు. సమాజంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకుంటేనే మంచి భవిష్యత్తు సాధ్యమని వైద్యులు స్పష్టం చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో కార్డియాలజిస్టు డా.అనీష్ పబ్బ, జనరల్ ఫిజీషియన్లు డా.నాగరాజు, డా. లోకేష్, క్రిటికల్‌కేర్ డా. ఉపేందర్‌రెడ్డి, జనరల్ సర్జన్ డా. తాహా, సూపరింటెండెంట్ డా. ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా రీ ఫిల్లింగ్ చేస్తున్న సిలిండర్ల స్వాధీనం

**హయత్ నగర్, ఏప్రిల్ 7 (జనం సాక్షి) :**
వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుష్మా థియేటర్ సమీపంలో సుష్మా జంక్షన్ నుండి రైతు బజార్ వెళ్ళే రోడ్డులో గల మహదేవ్ హోమ్ అప్లియేన్సెస్ షాపు లో అక్రమంగా గ్యాస్ ను రీఫిల్లింగ్ చేస్తుండగా వనస్థలిపురం పోలీస్ రైడ్ చేసి 03 డోమెస్టిక్, 20 చిన్న సిలిండర్లు, గ్యాస్ రీఫిల్లింగ్ రాడ్ ను స్వాధీన పర్చుకొని, షాపు యజమాని సురేంద్ర, సిబ్బంది అభిషేక్ పైన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.

# ప్రజా పాలననా... దుర్మార్గపు పాలననా.?

- రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ప్రజలు బొంద పెడతారు
- 6 గ్యారంటీలు, 13 అంశాలు, 420 హామీలు అమలెప్పుడు?
- ప్రజలకు కూడు, గూడు, గుడ్డ లేకుండా చేసి ఉసురు తీస్తున్నారు



**ధారూర్, ఏప్రిల్ 7 (జనంసాక్షి):**
రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు బొంద పెడతారని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 అంశాలు, 420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసుకోవాలని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, చివరకు తనను కూడా ఉదయం 4 గంటలకే హౌస్ అరెస్టు చేయడానికి ప్రయత్నించడం దారుణమని ఖండించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని గోరంగా ఇంట్లో అరెస్టు చేసి, గంట గంటకు పోలీస్ స్టేషన్ మార్చుతూ అనేక ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జనాలు గట్టిగా తిడుతున్నారని, "నన్ను రోడ్ల మీద తిట్టుకుంటున్నారు" అని తానే అంటున్నారని, ఎందుకు ప్రజలు తిట్టుకుంటున్నారో ఆలోచన చేసుకోవాలని సూచించారు. ప్రజల భూములను అక్రమంగా తీసుకుంటున్నారని, ఇండస్ట్రియల్, ఫార్మా కంపెనీలు పెట్టాలని బలవంతంగా భూములు లాక్కోవడం అక్రమమని విమర్శించారు.
వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండలంలో 1000 ఎకరాల నుండి 11 ఎకరాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సేకరించడం జరిగిందని, ఇప్పుడు రైతుల వద్ద ఉన్న భూములను గుంజుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలు ఏమైపోయినా గాని తాను మాత్రమే బాగుండాలని రేవంత్ రెడ్డి ఉద్దేశం కలిగి ఉన్నాడని, రాబోయే రోజుల్లో రేవంత్ సొంత పార్టీ పెట్టిన బీజేపీలో కలిసినా ఆ పార్టీకి నష్టం కలుగుతుందని హెచ్చరించారు. "ప్రజలకు కూడు, గూడు, గుడ్డ లేకుండా చేసి ఉసురు పీకుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజలు అధ్యక్షుడిని ఎలా ఊరికించి కొట్టారో, తెలంగాణలో రేవంత్ రెడ్డిని ఊరికించి కొట్టే రోజులు త్వరలో వస్తాయి" అని ఆయన హెచ్చరించారు. ఆరు గ్యారంటీలు, 13 అంశాలు, 420 హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని, స్వయంగా ప్రజలే తిట్టుకుంటున్నారని మండిపడ్డారు. మహిళల కోసం ఫ్రీబస్ అని చెప్పి మహిళలను మోసం చేశారని విమర్శించారు. అనంతరం పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అరెస్టులు దారుణమని, పరిగి మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 1200 ఎకరాల భూమి నోటిఫికేషన్ జారీ చేసి రైతుల ఇష్టం లేకుండా బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం తప్ప రైతులకు మరే జీవనాధారం లేదని, భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రజా పాలన అంటూ దుర్మార్గపు పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ప్రజల చేతుల్లో బొంద పడుతుందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.



## అక్రమ రేషన్ బియ్యం గోదాంపై టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు

### 500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7(జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి సమీపంలో లో అక్రమంగా నిల్వ చేసిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలంగాణ చీఫ్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శశిధర్ రాజు మీడియాకు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గోడౌన్లపై దాడులు నిర్వహించారు. శేష సాయిరాం రైస్ ఇండస్ట్రీస్ ప్రాంగణంలో తనిఖీలు చేపట్టగా సుమారు 500 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు,అక్కడ రెండు వాహనాలు ఉండగా, వాటిలో ఒకటి (టీజీ 15 టీ ఆర్ 6337)లో సుమారు 35 క్వింటాళ్ల బియ్యం లోడ్ చేసి ఉన్నది. మరో వాహనం (ఏపీ 20డబ్ల్యూ 9468) ద్వారా బియ్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. అలాగే బీహార్‌కు చెందిన కార్మికులను ఉపయోగించి పీడీఎస్ బియ్యాన్ని తెల్లని ప్లాస్టిక్ సంచుల్లో (50 కిలోల చొప్పున) మళ్లీ ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.ఈ విషయంపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వో కు సమాచారం అందించగా, వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ దాడిలో సివిల్ సప్లై విజిలెన్స్ డి ఎస్ పి వెంకటేశం, సిఐ పండరి బాబు, ఎస్ఐ సాంబశివరావు, డి ఎస్ వో వనజాత, డీటీ రామకృష్ణ తదితరులు ఉన్నారు

# ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల భూములు గుంజుకుంటుండ్రు

- రైతుల క్షేమం కోరితే అరెస్టులా.. ప్రజాస్వామ్యం ఎక్కడ?
- హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్ట్.. మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులపై అరెస్టు పర్వం

**పరిగి, ఏప్రిల్ 7 (జనంసాక్షి):**
ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల రైతుల భూములను తీసుకునే కుట్ర చేస్తున్న నేపథ్యంలో, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వంటి నాయకులను హౌస్ అరెస్టు చేయడం దారుణమని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ధారూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల పక్షాన పోరాడాలని వచ్చిన నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖండిస్తోందని మండిపడ్డారు. "ప్రజలు ప్రశ్నిస్తే గొంతు నొక్కేస్తున్నారు. ఇది ప్రజా పాలనా.. దుర్మార్గపు పాలనా?" అని ప్రశ్నించారు.
కళాపూర్ రాపోలు రైతులను పరామర్శించడా నికి, వారికి అండగా ఉండాలని వచ్చిన మాజీ మంత్రులను హౌస్ అరెస్టు చేయడం, వికారాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులను ఎక్కడ పడితే అక్కడ అరెస్టు చేయడం దారుణమని ఖండించారు. "ప్రజల భూములను అక్రమంగా తీసుకుంటున్నారు. ఏం చేద్దామనుకుంటున్నారు? ఇండస్ట్రియల్, ఫార్మా కంపెనీలు పెట్టాలని బలవంతంగా భూములు లాక్కోవడం అక్రమం" అని మండిపడ్డారు. మోమిన్‌పేట్ మండలంలో 1000 ఎకరాల నుండి 11 ఎకరాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సేకరించడం జరిగిందని, ఇప్పుడు రైతుల వద్ద ఉన్న
ఈ సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి మాట్లాడిన మహేష్ రెడ్డి.. రైతుల పక్షాన పోరాటం సిద్ధంగా ఉంటామని, నోటిఫికేషన్ రద్దు చేసే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# శేరిలింగంపల్లిలో మరోసారి హైడ్రా భారీ అడుగు

- ఐటీ కారిడార్‌కు చేరువలో 8 ఎకరాల భూమి స్వాధీనం
- మార్కెట్ విలువ 1200 కోట్లు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 07 (జనంసాక్షి) :** హైడ్రా మంగళవారం శేరిలింగంపల్లి పరిధిలో మరో భారీ అడుగుకు శ్రీకారం చుట్టింది. ఏకంగా 12 వందల కోట్లరూపాయల విలువచేసే 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. వివరాలలోకి వెళితే... శేరిలింగంపల్లి నియోజక వర్గం మాదాపూర్ పరిధి ఐటి కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. బడా నిర్మాణ సంస్థల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడింది. ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబర్ 55 లో వున్న 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని తమ స్వాధీనంలోకి తీసుకుంది. ఇందులో భాగంగా ఐటి హబ్ కి చేరువలో బడా రియల్ ఎస్టేట్ సంస్థల స్వాధీనంలో ఉన్న దాదాపు నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు కొలను మాధవరెడ్డి కూతురు సబితకు చెందిన 4 ఎకరాల భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఇందులో తాత్కాలికంగా వేసిన షెడ్డులను హైడ్రా అధికారులు మరియు సిబ్బంది కలిసి పూర్తిగా తొలగించడం జరిగింది. ప్రభుత్వ భూమిలో నెలకొల్పిన ఆర్‌సిసి ప్లాంట్‌ను వాసవి నిర్మాణ సంస్థ స్వయంగా తొలగించుకోవడం గమనార్హం. కార్మికులకోసం వేసిన తాత్కాలిక షెడ్డులనుసైతం హైడ్రా తొలగించింది. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిలో హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. కాగా కాపాడిన భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం 12 వందల కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అంచనా. గతంలోనూ ఇక్కడ ఆక్రమణలను హైడ్రా తొలగించిన విషయం విధితమే. సర్వే నంబరు 53 లోని మొండికుంట ఆక్రమణలతోపాటు సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న విషయాన్ని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. నిజానికి శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ లోని సర్వే నంబర్ 55 లో ఉన్న భూమి అసైన్డ్ ల్యాండ్. రంగారెడ్డి కలెక్టర్ ఈ భూమిని ప్రొహిబిటెడ్ లిస్టులో ఇప్పటికే పెట్టారు. దీని ప్రకారం ప్రభుత్వానికి చెందినదిగా పేర్కొన్నారు. అదే భూమిని తమదిగా మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ చెబుతూ వస్తోంది. వాసవి నిర్మాణ సంస్థ అందులో ఆర్‌సిసి ప్లాంటులను ఏర్పాటు చేయడమే కాకుండాభవన నిర్మాణ కార్మికులకు షెడ్డులను సైతం నిర్మించింది. అలాగే నిర్మాణ సామగ్రిని కూడా అందులో నిలువ ఉంచడం గమనార్హం. ఇలా మొత్తం 4.20 ఎకరాల భూమిని తన స్వాధీనంలో ఉంచుకుంది. ఈ రెండు సంస్థలకుతోడు ఇదే సర్వే నంబరులో ఉన్న మరో 4 ఎకరాల భూమిని కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబిత తనదిగా చెబుతూ వస్తున్నారు. స్థానికులను భయపెట్టే విధంగా బౌన్సర్లను కాపలాగా ఉంచారు. హైడ్రాకు ఫిర్యాదు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాలమేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అదికారులతో కలిసి హైడ్రా సమగ్ర సమాచారాన్ని సేకరించి దానిని ప్రభుత్వభూమిగా నిర్ధారించుకుంది. అనంతరం హైడ్రా కమిషనర్ స్పష్టమైన ఆదేశాలమేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులుసైతం ఏర్పాటు చేశారు.



## మైసిగండి మైసమ్మను దర్శించుకున్న పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు
- ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నేతలు

**కడ్తాల్ ఏప్రిల్ 07(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తి వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, సిడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి,ఎంపీ మల్లు రవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,లతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు .అనంతరం మహేష్ కుమార్ గౌడ్,మంత్రి జూపల్లి కృష్ణారావు, వంశీచంద్ రెడ్డిలు దేవస్థానంలో అభిషేకం, అర్చన, హారతి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పుష్పాలు సమర్పించి,కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి దేవుని వస్త్రంతో సన్మానించారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని,ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ దైవ దర్శనంలో పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నరసింహా ముదిరాజ్‌లు కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలుపొందారు.నాయకుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వారికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులతో కలసి కొంతసేపు నాయకులు గడిపి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మైసిగండి మైసమ్మ ఆలయం ప్రాంతీయంగా ఎంతో ప్రాచుర్యం పొందిన దేవస్థానం కాగా,ప్రత్యేక రోజుల్లో వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తుంటారు.నాయకుల దర్శనం సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తుల్లో ప్రత్యేక సందడి వాతావరణం నెలకొన్నది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజల సహకారం, ఐక్యత ఉంటేనే అభివృద్ధి సాధ్యం

**దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి**

**హయత్ నగర్, ఏప్రిల్ 7 (జనం సాక్షి):**
హయత్ నగర్ డివిజన్‌లో నూతనంగా నిర్మించి న డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనం ప్రారంభోత్సవం లో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఫెన్స్ కాలనీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ భవనం కాలనీ అభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని వారు అన్నారు. ఈ సంఘ భవనం ద్వారా కాలనీ ప్రజలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మంచి వేదిక లభిస్తుందని వారు తెలిపారు. కాలనీ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, భాస్కరసాగర్, మల్లేష్, దీపావళి శ్రవణ్, కాలనీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు నర సింహ, జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ నరేంద్ర స్వరూప్, కోశాధికారి గిరిధర్ రెడ్డి,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రవణ్, సోమేశ్వర్ రావు, నర్సింహా, ఎన్ శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వర్ రావు, రాఘవేంద్ర రెడ్డి, బాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి

- చేయూత పథకం క్రింద దరఖాస్తులు చేసుకున్న వారికి పెన్షన్స్ మంజూరు చేయాలి : సిపిఐఎం



**ముషీరాబాద్, ఏప్రిల్ 07 (జనం సాక్షి):** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, చేయూత పెన్షన్ పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలని సిపిఐ ఎం డిమాండ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సిపిఐ ఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. దశరథ్ మాట్లాడుతూ
హిమాయత్ నగర్ మండలం పరిధిలోని అనేక బస్తీలలో పేదలు నివసిస్తూ సొంత ఇంటి కొరకు ప్రభుత్వానికి అనేక సార్లు దరఖాస్తు చేసుకున్న గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం గానీ వీరి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎల్ -1 కేటగిరిలో ఉన్న దరఖాస్తుదారులకు మాత్రమే ఇళ్ళు మంజూరు చేస్తున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి సొంత ఇంటి కల కలలాగే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. నగరంలో ఉన్న ప్రభుత్వ స్థలాలలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి పేదలకు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేష్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తదితరులు పెన్షన్ల కొరకు దరఖాస్తు చేసుకొని పెన్షన్ కొరకు ఎదురుచూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరికి కూడా పెన్షన్ మంజూరు చేయడం లేదని అర్హులైన పేదలందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, చేయూత పెన్షన్లను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు టి మహేందర్, జోన్ కమిటీ సభ్యురాలు వెంకటమ్మ, నాయకులు మల్లయ్య, రాజు, వెంకటేష్, నారాయణమ్మ, అనురాధ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో రైతుల ప్రయోజనాలకు పెద్దపీట

- ఎన్నికలు ఉన్నప్పుడే వచ్చే నాయకుణ్ణి కాదు
- ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకునేవాడిని : రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కథలాపూర్ మండలం కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన విప్
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన విప్



**కథలాపూర్, ఏప్రిల్ 7(జనంసాక్షి) :** కథలాపూర్ మండలకేంద్రంలో ప్రజా ప్రభుత్వంలో రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం రోజున ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కథలాపూర్ మండల కేంద్రంలో పర్యటించారు. మండల కేంద్రం లో మార్కెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని 86 మంది అర్హులైన లబ్ధిదారులకు 31 లక్షల 81 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులకు వారు పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నాం అన్నారు.. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు నేడు నిర్విరామంగా కొనసాగుతు ఒదని పేర్కొన్నారు.మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం మొక్కజొన్న కు క్వింటాలుకు 2400 రూపాయలు మద్దతు ధర కల్పిస్తున్నాం అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నమని,కథలపూర్ మండలంలో పోసానిపేట, సిరికొండ గ్రామంలో నూతన 33/ 11 కేవీ విద్యుత్ ఉపకేంద్రఓ, కథల్పూర్ మండల కేంద్రంలో 220 సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు.
మేడిపల్లి కథలాపూర్ భీమారం మండల ప్రజల వరద ప్రదాయిని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి అన్నారు. గతంలో 22 తేదీ వస్తె చలో కలికోట సూరమ్మ చేరవు నిర్మాణం చేపట్టాలని అనేక ఆందోళనలు నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్ట్ చేర్చడం జరిగిందన్నారు. కుడి ఎడమ కాలువల నిర్మాణానికి భూసేకరణ పూర్తి అయ్యింది అని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి తెలిపారు. ఇప్పటికే నష్ట పరిహారం చెల్లించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలికోట సూరమ్మ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి సాధించారని అన్నారు. ప్రజలు రైతులు ప్రాజెక్ట్ సందర్శన చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని తెలిపారు.ప్రతి నెల రెండు నుండి మూడు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేస్తాను అన్నారు.గతంలో వరద కాల్వ నీరు విడుదల చేయాలని రోడ్డు ఎక్కితే తప్ప రాలేదని కానీ ప్రజా ప్రభుత్వంలో రైతులు రోడ్డు ఎక్కక ముందే నీరు విడుదల చేశామని తెలిపారు.. ఇప్పటి వరకు మూడు సార్లు వరద కాల్వ కు నీటిని విడుదల చేశామన్నారు. ఎన్నికలు ఉన్నప్పుడే వచ్చే నాయకులను నమ్మవద్దు అన్నారు.ఎన్నికలు ఉన్నా లేకున్నా తను ప్రతి నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు.

# 'కళ్ళు మూసుకున్నా' నిఘా నేత్రాలు

## ముస్తాబాద్ మండలంలో పనిచేయని సీసీ కెమెరాలు

**ముస్తాబాద్, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, ముస్తాబాద్ మండల కేంద్రంలోని చాలా గ్రామాలలో నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) పనిచేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దొంగలను గుర్తించడం, దోపిడీలు, స్నాచింగ్‌లు అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ప్రజలు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై పోలీసులు దృష్టి పెట్టినా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎక్కువ సంఖ్యలో కెమెరాలు పనిచేయకపోవడం గ్రామస్తులను ఆందోళనకు గురి చేస్తోంది. "నిఘా నేత్రాలకే నిఘా కరువైంది" అని గ్రామ ప్రజలు చర్చించు కుంటున్నారు. విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇతర కేబుల్స్‌ను తొలగించడంతో పాటు సీసీ కెమెరా కేబుల్స్ కూడా తొలగించడంతో అవి పనిచేయకుండా పోయాయని, రోడ్ల తవ్వకాల సమయంలో కూడా కొన్ని గ్రామాల్లో కేబుల్స్ కట్ అయ్యాయని ప్రజలు తెలిపారు. గత 6-7 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాత సీసీ కెమెరాల నిర్వహణలో గ్రామ పంచాయతీలు లోపం చేశాయని వారు ఆరోపించారు. రోడ్డు ప్రమాదాలు, చైన్ స్నాచింగ్‌లు, దాడులు, హత్యాదాంతాల కేసుల్లో నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, కానీ అవి పనిచేయకపోవడం వల్ల ప్రజలు భయపడుతు న్నారు. రానున్న వేసవి కాలంలో పుణ్యక్షేత్రాలు, వివాహాలకు వెళ్లాలంటే ఇంట్లో ఒకరిద్దరు ఉండాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటికైనా పోలీసు ఉన్నత అధికారులు ఈ నిఘా నేత్రాల నిర్వహణ బాధ్యత తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం లేదని, పోలీసు శాఖ కూడా సొంత నిధులు వినియోగించడం లేదని వారు వాపోయారు. గతంలో సామాజిక బాధ్యతగా కొన్ని సంస్థలు, సంఘాలు ఇచ్చిన విరాళాలతో ఏర్పాటు చేసిన కెమెరాలు కూడా పనిచేయకుండా పోయాయని తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ గణేశ్‌ను అడిగినప్పుడు.. ముస్తాబాద్ మండలంలో 20 సీసీ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తామని, మండలంలోని నూతన సర్పంచులను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచనలు అందించామని తెలిపారు. వెంటనే ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సర్పంచులు హామీ ఇచ్చారని ఎస్ఐ వివరించారు. ప్రజలు మరింత భద్రత కోసం సీసీ కెమెరాల నిర్వహణపై ప్రభుత్వం, పోలీసు శాఖ తక్షణం దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు ని పరిశీలించిన ఎమ్మెల్యే అది శ్రీను

**కథలాపూర్, ఏప్రిల్ 7(జనంసాక్షి) :** కథలాపూర్ మండలంలోని చింతకుంట నుండి గుంటిపెరుమండ్ల రోడ్డు పరిశీలించిన ఎమ్మెల్యే ఇటీవల పనులు మొదలై మట్టిరోడు పూర్తయిన సందర్భంలో శ్రీ ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విపు వేములవాడ ఎమ్మెల్యే సందర్శించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అది శ్రీను మాట్లాడుతూ పని తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కి చెప్పాను ఇంకేదైనా డబ్బులు తక్కువ పడితే మంజూరు చేసి ఇప్పిస్తానని తెలిపారు పని మాత్రం తొందర తొందరగా పూర్తి చేయాలని తెలియజేసారు వారి వెంట చెదలు సత్యనారాయణ కథలాపూర్ సర్పంచ్ న్యావనంది శేఖర్, ఏ యమ్ సి నారాయణరెడ్డి అజీమ్, నాగరాజు, మల్లేష్, దేవు యాదవ్ నర్సారెడ్డి,ప్రభాకర్, ఆనంద్, కృష్ణ,వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్‌లోనే ఉండాలా.. మరో పార్టీలో చేరాలా!

- పదవి ఆశలు నెరవేరక అసంతృప్తి..
- అనుచరుల దీక్షలు, హైకమాండ్ బుజ్జగింపు
- నిజామాబాద్‌లో సందిగ్ధంలో.. సంజయ్ రాజకీయ భవిష్యత్తు
- రంగంలోకి పార్టీ పెద్దలు... నిర్ణయం ఆయన చేతుల్లోనే

**నిజామాబాద్ బ్యూరో, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత ధర్మపురి శ్రీనివాస్ తనయుడు ధర్మపురి సంజయ్ ప్రస్తుతం సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సొంత పార్టీలో ఎదురవుతున్న చేదు అనుభవాల దృష్ట్యా కొన్ని రోజులుగా సంజయ్ చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయనే విషయం చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తనకు కీలక పదవి వస్తుందని ఆశించిన సంజయ్‌కు ఆ పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ధర్మపురి సంజయ్ అనుచర వర్గం దీక్షలు చేపట్టడం, హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లి వినతి పత్రం అందజేయడం వంటి చర్యలు జరిగాయి. మున్నూరు కాపు సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డి. శ్రీనివాస్ తనయుడు ధర్మపురి సంజయ్‌కు కీలక పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నగరపాలక సంస్థ ఎన్నికల్లో సంజయ్ కీలక పాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీకి కార్పొరేషన్ దక్కించుకోవడంలో కృషి చేశారని, కార్పొరేషన్ ఎన్నికలకు ముందు ఢిల్లీలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న సంజయ్‌ను పార్టీ హైకమాండ్ నిజామాబాద్‌కు రప్పించి బాధ్యతలు అప్పగించిందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంఐఎంతో పొత్తు కుదుర్చడంలోనూ సంజయ్ వ్యూహం ఫలించిందని చెబుతున్నారు.
అయితే కీలక పదవి రాకపోవడంతో సంజయ్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఊపందుకుంది. ముఖ్య అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంజయ్ అనుచరులందరూ గాంధీ చౌక్‌లో ఒకరోజు దీక్ష చేపట్టడంతో హైకమాండ్ ఆందోళనకు గురైంది. నిజామాబాద్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ సంజయ్ అనుచరులను బుజ్జగించి దీక్ష విరమింపజేశారు. త్వరలోనే పార్టీ హైకమాండ్ సంజయ్‌కు కీలక పదవి ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని నచ్చచెప్పారు.
అయినప్పటికీ సంజయ్‌కు కీలక పదవి వస్తుందా లేదా అన్న సందేహాలు మెజార్టీ సభ్యులను వెంటాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ కీలక నేత సంజయ్‌కు పదవి రాకుండా అడ్డుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ పదవి సంజయ్‌కు వస్తుందన్న ప్రచారం జోరుగా వినిపించినప్పటికీ ఆ పదవి రాకపోవడంతో అసంతృప్తి పెరిగింది.
ఇదిలా ఉండగా సంజయ్ కాంగ్రెస్ పార్టీని వీడి కవిత కొత్త పార్టీలో చేరే అవకాశం ఉందన్న ప్రచారం కూడా ఊపందుకుంది. జాగృతి పార్టీతోపాటు మరికొన్ని పార్టీలు సంజయ్ చేరికకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు వినిపిస్తోంది. ప్రస్తుతం సంజయ్ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ఏది ఏమైనా ఆయన రూటే సెపరేట్ అనే అభిప్రాయం లేకపోలేదు. సొంత పార్టీని వీడితే రాజకీయంగా నష్టమా లాభమా అనే దానిపై సమీకరణలు బేరీజు వేసుకుంటున్నారు.
అయితే ఇప్పట్లో కాంగ్రెస్ పార్టీ వీడే ఆలోచన లేదని సంజయ్ ముఖ్య అనుచర వర్గం అభిప్రాయపడుతోంది. ఏది ఏమైనా ప్రస్తుతం ధర్మపురి సంజయ్ రాజకీయ భవిష్యత్తు ఆయన సొంత నిర్ణయం పైనే ఆధారపడి ఉ ంది. కాంగ్రెస్ పార్టీ పెద్దలు సంజయ్‌ను బుజ్జగించేందుకు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే.



### శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా

# కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- మాదకద్రవ్యాలు,గంజాయి లాంటి పదార్థాలను కనిపెట్టే నార్కోటిక్ డాగ్స్‌చే తనిఖీలు
- అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు : సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి
- సరైన పత్రాలు లేని 23ద్విచక్ర వాహనాలు,15 లీటర్ల మద్యం స్వాధీనం

**సిరిసిల్ల టౌ న్ ఏప్రిల్ 7 (జనం సాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం సిరిసిల్ల పట్టణంలోని సిక్కు వాడలో డీఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు,నంబర్ ప్లేట్లు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అలాగే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న బోయిని శ్రీనివాస్, బల్విర్ సింగ్ చందర్ సింగ్‌లపై కేసులు నమోదు చేసి 14 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ ప్రజల రక్షణతో పాటు వారికి భద్రత కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించినా, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు శ్రీకాంత్,ఉపేందర్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## డ్రింకింగ్ వాటర్ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 7(జనం సాక్షి):** జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెం. 25లో ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ మానిటరింగ్ సెల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రిబ్బన్ కట్ చేసి మంగళ వారం ప్రారంభించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తిన పక్షంలో ప్రజలు వెంటనే స్పందించేందుకు ఈ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సెల్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్ 990871 2421 ను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా త్రాగునీటి సమస్యలు ఉన్న యెడల ప్రజలు ఈ నంబర్‌కు సంప్రదించి తమ సమస్యలను తెలియజేయవ చ్చని తెలిపారు.ఈ మానిటరింగ్ సెల్ ఏప్రిల్ 07 నుండి జూన్ 30 వరకు పని చేస్తుందని, ప్రతి రోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని త్రాగు నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందులో ఇండస్ట్రీ ఆఫీసర్ లాలు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటశ్వర్లు, డిఎల్‌పిఓ శ్రీనివాస్, మెప్మా శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హెల్తీ సైక్లింగ్ ర్యాలీ

- సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి : అల్ఫోర్స్ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి
- కాలుష్య నివారణకు సైక్లింగ్ అలవాటు చేసుకోవాలి : సీపీ గౌస్ ఆలం
- 150 మంది సైక్లిస్టులు పాల్గొన్న ర్యాలీ.. త్వరలో ప్రశంసా పత్రాలు



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 7 (జనంసాక్షి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అల్ఫోర్స్ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హెల్తీ సైక్లింగ్ ర్యాలీని మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్ఫోర్స్ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి.. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నించాలని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత లాభాలు మాత్రమే కాకుండా సమాజపరంగా, పర్యావరణాన్ని కాలుష్యం నుండి రక్షించడానికి సైక్లింగ్ చాలా మంచి మార్గమని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇస్తారని, ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను అలవాటు చేసుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ.. నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం జరుగుతోందని చెప్పారు. వ్యక్తిగతంగా లాభాలు చేకూరడమే కాకుండా సమాజపరంగా చాలా లాభాలు చేకూరుతాయని, ప్రధానంగా పర్యావరణాన్ని కాలుష్యం నుండి సంరక్షించవచ్చని తెలిపారు. కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు 150 మంది సైక్లిస్టులు పాల్గొన్నారు. ర్యాలీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుండి బస్టాండ్, తెలంగాణ చౌక్, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, రెనే హాస్పిటల్ వరకు కొనసాగింది. పాల్గొన్న వారందరికీ త్వరలో ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, అల్ఫోర్స్ విద్యా సంస్థల సమన్వయంతో నిర్వహించారు.
కార్యక్రమంలో కరీంనగర్ రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ ప్రొ. డాక్టర్ బంగారి స్వామి, కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రెనే హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ మేకల అరవింద్ బాబు, ట్రాఫిక్ సీఐ బి. సంజీవ్, ట్రాఫిక్ ఎస్ఐ హనుమంతు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి సురభి వేణుగోపాల్, రెనే హాస్పిటల్ జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, లయన్స్ క్లబ్ నాయకులు ఇనుగుర్తి రమేష్, మరిపెల్లి మహేందర్, ఏసీపీ సి. ప్రతాప్, క్రిటికల్ కేర్ వైద్యులు డా. కృష్ణా రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డా. మహేష్ బాబు, అల్ఫోర్స్ సిబ్బంది, రెనే హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సైక్లింగ్ ర్యాలీ సమాజంలో ఆరోగ్య స్పృహను పెంచడంతో పాటు పర్యావరణ సంరక్షణకు కూడా దోహదపడుతుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు.



## రైతులకు కనీసం జిరాక్స్ డబ్బులు కూడా రాలేదు

- నష్ట పోయిన రైతుకు ఎకరానికి రూ 50 వేలు చెల్లించాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి

**బోధన్, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** సాలూర మండలం ఖాజాపూర్, హున్స, మందర్న గ్రామాలలో ఇటీవల కురిసిన వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేలు చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశా రు. మంగళవారం ఆయన వడగళ్ల వానకు నష్టపోయిన రైతుల పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రభుత్వం గత రెండురోజుల క్రితం వడగళ్ల వానకు నష్ట పోయిన రైతులకు ఎకరానికి 50 వేలు అందించాలని డిమాండ్ చేశారు. అయితే గత రెండు సంవత్సరాలలో ఇదేవిధంగా భారీ వర్షాలు, వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించిన దాఖలాలు లేవన్నా రు. కనీసం రైతులు నష్టపరిహారం కోసం అధికారులకు అందించిన జిరాక్స్ కాపీలకు సంబంధించిన డబ్బులు సైతం రాలేదన్నారు. వడగళ్ల వాళ్ళతో రైతులు నష్టపోతే బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఇప్పటివరకు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ సైతం ఇక్కడ పర్యటించక పోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పంట నష్ట అంచనాను పకడ్బందీగా వేసి రైతులకు ప్రభు త్వం నష్ట పరిహారం చెల్లించాలని మెడపాటి ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

### అవినీతి ఆరోపణలపై 9 గంటలకు పైగా తనిఖీలు



**జగిత్యాల బ్యూరో ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళ వారం ఉదయం ఏసీబీ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దాడుల సందర్భంగా కార్యాలయంలో ఉన్న సిబ్బంది ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి సమాచారాన్ని బయటకు పంపకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కార్యాలయం లోని పత్రాలు, ఫైళ్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పట్టణంలో అనుమతుల మంజూరు, నిర్మాణాల అనుమతుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల పనితీరును సమగ్రంగా పరిశీలిస్తున్నారు. అక్రమాలపై ప్రాథమిక ఆధారాలు లభిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశముందని ఏసీబీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ దాడులతో మున్సిపల్ కార్యాలయ సిబ్బందిలో కలకలం రేగింది.పట్టణ ప్రజలు మాత్రం ఈ చర్యలను స్వాగతిస్తూ, అవినీతి నిర్మూలనకు ఇది మొదటి అడుగు కావాలని అభిప్రాయపడుతున్నారు. అయితే ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు ఇంకా తనికీలు నిర్వహిస్తుండడం తో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ తనిఖీలో సంజూ విజయ్ కుమార్ తో పాటు అధికారులు ఉన్నారు.




# భోజన విరామ సమయంలో నిరసనలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** టిటి జెఏసి, యూఎస్పిసి, జాక్టోల ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం బోజన విరామ సమయంలో నిర్మల ఉన్నత పాఠశాల నాంపల్లి, వేములవాడ పదవ తరగతి స్పాట్ కేంద్రంలో ఉపాధ్యాయ ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో వివిధ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 మార్చిలో నిర్వహించిన పదవ తరగతి స్పాట్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లింపులు జరపాలని,అక్టోబర్ 2024 లో నిర్వహించిన కుల గణన రెమ్యూనరేషన్ చెల్లింపులు జరపాలన్నారు.7 సం.రలు నుండి పదవ తరగతి స్పాట్ రెమ్యూనరేషన్ పెంచలేదని,ఇంటర్ మీడియట్ 7 సం రలలో 2 సార్లు పెంచడం జరిగిందన్నారు.కనీసం 50 శాతం రెట్లు పెంచాలని వారు డిమాండ్ చేశారు.ఈ సంవత్సరం నిర్వహిస్తున్న పదవ తరగతి స్పాట్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లింపులు జరపాలని పదవ తరగతి క్యాంప్ అధికారికి 3 జేఏసీ ల ఆధ్వర్యంలో వినతి అందించడం జరిగిందన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల అద్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎడ్ల కిషన్, బోయనగారి నారాయణ, గుండమనేని మహేందర్ రావు,జంగిటి రాజు,అవురం సుధాకర్ రెడ్డి, వంగ తిరుపతి,వికృతి అంజయ్య, రేవోజు సదానందం, మొగిలి లక్ష్మణ్ మండల,జిల్లా, రాష్ట్ర బాధ్యులు,ఉ పాధ్యాయినీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
8 ఏప్రిల్ 2026

# ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

## బెట్టింగ్ యాప్ ఉచ్చులో పడకండి

- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్7 (జనంసాక్షి) :** ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగి పోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొఫైళ్లను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# కల్పక్కంలో ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్

- అణుశక్తి ప్రయాణంలో కీలక ముందడుగు
- ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు అభినందనలు



**అమరావతి, ఏప్రిల్7 (జనంసాక్షి) :** దేశ అణుశక్తి ప్రయాణంలో కీలక ముందడుగు పడటం గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు తెలిపారు. స్వదేశీ ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీని సాధించిందన్నారు. దేశ అణు కార్యక్రమంలో రెండో దశకు ముఖ్యమైన మైలురాయి సాధించామని తెలిపారు. మోదీ నాయకత్వంలో అణుశక్తి రంగంలో భారత్ దూసుకుపోతుందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు సీఎం చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు స్పందించారు. తమిళనాడులోని కల్పక్కంలో ఏర్పాటు చేసిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ సోమవారం క్రిటికాలిటీని విజయవంతంగా సాధించింది. దీంతో దేశ అణు కార్యక్రమంలో రెండో దశలో ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత శాస్త్రీయ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొంటూ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని అభినందనలు తెలిపారు.



# హైడ్రాను సందర్శించిన ఏడీబీ ప్రతినిధులు

- గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణపై ఆరా
- హైడ్రా కమిషనర్‌తో చర్చించిన ఏడీబీ ప్రతినిధులు

**హైదరాబాద్, ఏప్రిల్ 07 (జనంసాక్షి) :** మూసీ పునరుజ్జీవనంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఏడీబీ(ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) ప్రతినిధులు హైడ్రా కార్యాయాన్ని సందర్శించారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారితో సమావేశమయ్యారు. నగరంలో చెరువుల పునరుద్ధరణతో పాటు హైడ్రా కార్యకలాపాలపై ఆరాతీశారు. గొలుసు కట్టు చెరువుల పునరుద్ధరణతో మూసీకి కలిగే ప్రయోజనాలను చర్చించారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల పూర్వ స్థితిని పాత వీడియోల ద్వారా తెలుసుకున్నారు. హైడ్రా పునరుద్ధరించిన తర్వాత అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమృకున్ - ఉద్ - దౌలా చెరువు, కూకట్‌పల్లిలోని నల్ల చెరువు రూపు రేఖలు మారిన తీరును వీడియోల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాలను కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పవర్ పాయింట్ ద్వారా ఏడీబీ ప్రతినిధులకు వివరించారు. హైడ్రా మొదటి విడత చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణతో పాటు.. రెండో విడత చేపట్టిన 14 చెరువుల గురించి లోతుగా చర్చించారు.



# రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 07 (జనంసాక్షి) :** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మంగళవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు కొద్ది సేపు భేటి అయ్యారు. అంతకు ముందు రాష్ట్ర గవర్నర్‌ను డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఇతర అధికారులతో కలిసి రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం అకాడమిక్ , అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన గవర్నర్‌కు వివరించారు.

# ఐటీ కారిడార్‌కు చేరువలో హైడ్రా భారీ ఆపరేషన్

- రూ.1200 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా
- 8 ఎకరాలకు పైగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (జనంసాక్షి) :** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. బడా నిర్మాణ సంస్థల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబర్ 55లోని 8 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఐటీ హబ్‌కు చేరువలో బడా రియల్ ఎస్టేట్ సంస్థల స్వాధీనంలో ఉన్న 4.20 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు.. కొలను మాధవరెడ్డి కూతురు సబితకు చెందిన 4 ఎకరాల భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఇందులో తాత్కాలికంగా వేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది. ప్రభుత్వ భూమిలో నెలకొల్పిన ఆర్‌సీసీ ప్లాంట్‌ను వాసవి నిర్మాణ సంస్థ స్వయంగా తొలగించుకుంది. కార్మికులకోసం వేసిన తాత్కాలిక షెడ్డులను హైడ్రా తొలగించింది. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా తొలగించి బోర్డులు ఏర్పాటు చేసింది. మంగళవారం హైడ్రా కాపాడిన భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ. 1200ల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. గతంలోనూ ఇక్కడ ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సర్వే నంబరు 53లోని మొండికుంట ఆక్రమణలతో పాటు.. సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమిని 11 ఎకరాల వరకూ స్వాధీనం చేసుకున్న విషయం విధితమే.

### అసైన్డ్ భూముల పేరుతో..

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్లోని సర్వే నంబర్ 55 లో ఉన్న భూమి అసైన్డ్ ల్యాండ్. రంగారెడ్డి కలెక్టర్ ఈ భూమిని ప్రోహిబిటెడ్ లిస్టులో ఇప్పటికే పెట్టారు. దీని ప్రకారం ప్రభుత్వానికి చెందినదిగా పేర్కొన్నారు. అదే భూమిని తమదిగా మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ చెబుతూ వస్తోంది. వాసవి నిర్మాణ సంస్థ అందులో ఆర్‌సీసీ ప్లాంటులతో పాటు.. భవన నిర్మాణ కార్మికులకు షెడ్డులు వేసింది. అలాగే నిర్మాణ సామగ్రిని కూడా అందులో ఉంచింది. ఇలా వినియోగించుకుంటూ మొత్తం 4.20 ఎకరాల భూమిని తన స్వాధీనంలో ఉంచుకుంది. ఈ రెండు సంస్థలకు తోడు ఇదే సర్వే నంబరులో ఉన్న మరో 4 ఎకరాల భూమిని కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబిత తనదిగా చెబుతూ వస్తున్నారు. బౌన్సర్లను కాపలాగా ఉంచారు. హైడ్రాకు ఫిర్యాదు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సబంధిత శాఖల అదికారులతో కలిసి హైడ్రా విచారించింది. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలమేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.



# ప్రయివేట్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

## 10 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు




**ఖమ్మం, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సును వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 10 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థులను బస్సు నుంచి బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వేగంగా సహాయక చర్యలు చేపట్టారు. విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, లారీని స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు. పాఠశాల వాహనాల డ్రైవర్లు , భారీ వాహనాల డ్రైవర్లు రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# రైతులను పరామర్శించకుండా అడ్డుకుంటారా?

- ఇంత నిరంకుశంగా వ్యవహరించడం సరికాదు
- హరీష్ రావు అరెస్ట్‌ను ఖండించిన బిఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** పరిగి పర్యటనకు వెళ్లకుండా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును అడ్డుకోవడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హరీశ్‌రావు గృహ నిర్బంధం అక్రమమని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని తెలిపారు. తప్పు చేయకుంటే ఈ సర్కార్‌కు భయమెందుకు అని ప్రశ్నించారు. రైతుల పక్షాన పోరాడితే అడ్డుకుంటారా నిలదీశారు. అధికారం చేతిలో ఉందని ఈ ప్రభుత్వం అక్రమంగా రైతుల భూముల చెరబడుతున్నదని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రెండున్నరేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ వచ్చింది లేదు .. ఒక్క ఇటుక పేర్చింది లేదని విమర్శించారు. కానీ భూసేకరణ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుం దని మండిపడ్డారు. తమ భూముల కోసం పోరాడుతున్న రైతులకు భరోసా ఇవ్వడం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ నిర్బంధం సిగ్గు చేటు అని విమర్శించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు .. కాంగ్రెస్ నేతలు భూములను దోచుకుంటున్నారని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఎంత అణచివేసినా ప్రజలు, రైతుల తరపున ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. బాధిత రైతులను కలిసేందుకు వెళ్లకుండా హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై ఆంక్షలు, హౌస్ అరెస్టులపై మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత భయం అని ప్రశ్నించారు. అక్రమంగా పేదల భూములను గుంజుకుంటున్న ప్రభుత్వం.. బాధితులను కలవడానికి వెళ్తుంటే ఇన్ని నిర్బంధాలా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతుందని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. రైతుల పక్షాన పోరాటం చేస్తే అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలకు, చేతలకు పొందన లేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న హరీశ్‌రావు అంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజల పాలిట శాపంగా మారుతున్న పాలన అని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా మీ అవినీతిని బయటపెడుతూనే ఉంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# యువన్యాయవాది దారుణ హత్య



**అన్నమయ్య, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** అన్నమయ్య జిల్లా, పీలేరు నియోజకవర్గం పరిధిలోని కె.వి.పల్లి మండలంలో ఓ న్యాయవాది దారుణహత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో న్యాయవాది తల్లిదండ్రులు కూడా గాయపడ్డారు. మంగళవారం న్యాయవాది తరపు కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న పూజారి ఎల్లయ్య (35) కె.వి పల్లి మండలం, తీతవగుంటపల్లి గ్రామ పంచాయతి, పాతవడ్డిపల్లిలో నివాసం ఉంటున్నారు. గుర్తుతెలియని దుండగులు సుమారు పదిమందికి పైగా న్యాయవాది ఇంటికి వచ్చి, తలుపులు పగలగొట్టి, లోనికి చొరబడ్డారు. ఆ శబ్దానికి నిద్ర మేల్కొన్న ఎల్లయ్య పై వారు రాళ్ళతో దాడి చేసి హతమార్చారు. అడ్డొచ్చిన అతని తల్లిదండ్రులు పూజారి వెంకటరమణ, రెడ్డమ్మలను కూడా గాయపరిచారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారని తెలిసింది. ఈ దాడికి పాత కక్షలే కారణం అయ్యుంటాయని గ్రామస్తులు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు గ్రామంలో ఒకచోట ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మరో చోటికి మార్చడంలో ఆ న్యాయవాది ప్రమేయం ఉందన్న అనుమానం కూడా కారణం అయ్యుండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి సమయంలో జరిగిన ఈ దాడితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కె.వి.పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. న్యాయవాది హత్యకు పాల్పడిన వ్యక్తులెవరు, దాడి వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటన్న దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రాత్రి వేళలో చోటు చేసుకున్న ఈ హత్యా సంఘటన గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేసింది. మృతుడికి భార్య శ్రీలేఖ, ఎనిమిదేళ్ల కుమార్తె, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనా సమయంలో మృతుడి భార్య తన పుట్టింటికి వెళ్ళినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోలీసులు శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న స్థానిక న్యాయవాదులు కూడా పట్టణ ప్రాంతీయ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.



# ఏసీబీకి చిక్కిన అగ్రి వర్సిటీ అసోసియేట్ డీన్

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** ఎన్ని దాడులు జరుగుతున్నా లంచావతారాలు మారడం లేదు. నిత్యం ఎక్కడో చోట లంచగొండులు పట్టుబడుతూనే ఉన్నారు. ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

# మొక్క కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఖమ్మం, ఏప్రిల్7 (జనంసాక్షి) :** కూసుమంచి మండలంలోని జీర్ల చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. చేగుమ్మ సహకార సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సొంత బంధువుల ఘాతకం

- బంగారం కోసం వృద్ధురాలి హత్య

**విజయనగరం, ఏప్రిల్7 (జనంసాక్షి) :** బంగారానికి ఆశపడి సొంత బంధువులే ఓ వృద్ధురాలిని చంపి చెరువులో పాతిపెట్టిన ఘటన పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. మంగళవారం స్థానిక వివరాల మేరకు .. చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామంలో గొర్లె చిన్నప్పమ్మ (65) ను అదే గ్రామానికి చెందిన ఆమె మేనల్లుడు వరుసైన ఎజ్జుపొరపు రమణ, చందక రమణ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆమె బంగారానికి ఆశపడి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన వృద్ధురాలిని గొల్లపాలెం గ్రామానికి సమీపంలో గల ఒక చెరువులో పాతిపెట్టారు. దీంతో మృతురాలి అల్లుడు రెడ్డి పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును ఛేదించారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులతోపాటు విజయనగరం, విశాఖపట్నం నుండి ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ టీంలు, క్లూస్ టీంలు డి.ఎస్.పి ఎస్ రాఘవులు, సీఐ శంకర్రావుల ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ తవ్వించూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఈ సంఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370